7-7Pg1exHMNWJQE.qxd:7-7Pg1exHMNWJQE.qxd 1/1/02 6:53 AM Page 1

వెన్నెల
గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 157 పేజీలు: 16 వెల: 6.50

ప్రశ్న రావణ్‌కు 18 దాకా రిమాండ్ 3లో
రాజ్యసభ మూడు సీట్లకు నోటిఫికేషన్ 5లో

3 రీజియన్లలో క్రీడా సిటీలు

రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ చేయాలి

51.88 చ.కిమీ విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ

ప్రతి జిల్లాకు ఎకనమిక్ ప్రొఫైల్

6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్

మూడు ప్రాంతాలపై సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: ఉద్యానవన పంటల సాగుతో తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డ్ సృష్టించిన కడప జిల్లా లింగాలం మండలం స్ఫూర్తితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పురోగతికి హార్టికల్చర్ గ్రోత్ ఇంజిన్ అవు తుందని, 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలన్నారు. ఈ ప్రాంత స్థితిగతులు మార్చే శక్తి హార్టికల్చర్‌కు ఉందని...తిరుపతి ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. పూర్వోదయ పథకం కింద రూ.40,000 కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో వచ్చే మరో రూ.60,000 కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎం చెప్పారు. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల కన్నా సీమలోని ఓ మండలంలో ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండటాన్ని అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ. 7.30 లక్షలు తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. హార్టికల్చర్ కు అత్యంత అనువైన రాయలసీమలో ఆ దిశగా ప్రజలను మరింత ప్రోత్సహించాలన్నారు. సీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకువస్తే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని సిఎం అన్నారు. ఆ దిశగా జిల్లా అధికారుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణపై పలు మార్గదర్శకాలను సూచించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఆవిష్కరించగా...6 నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యాక ముసా యిదాను ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏ రంగాల్లో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారు

>>2

సోమవారం ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటో

యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

అత్యున్నత గౌరవం ప్రదర్శించిన ఇండొనేసియా ప్రభుత్వం

జకార్తాలో స్వయంగా స్వాగతించిన అధ్యక్షుడు సుబియాంటో

జకార్తా,జులై 6: మూడుదేశాల పర్యటనలో భాగంగా తొలి దేశంగా ప్రధాని మోడీ ఇండోనేషియాలోకి ప్రవేశించగానే యుద్ధ

>>2

భారత్ ఏఐ రాజధానిగా ఏపి

ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లు

సియోల్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

సోమవారం సియోల్‌లో 'షూ ఆల్స్' కంపెనీ చైర్మన్ లీ చియాంగ్‌గెన్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్

విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి: భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే తమ ధ్యేయం ఏపీ మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్ టి ఐ హెచ్) ద్వారా "వన్ ఫ్యామిలీ,వన్ ఎంటర్ ప్రెన్యూర్ష నినాదంతో ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ టెక్ స్టార్టప్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ అమరావతిలో ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆర్ టీఐహెచ్ విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనం తపురం ప్రాంతీయ శాఖలతో పనిచేస్తోందన్నారు. టాటా, ఎల్ టీ, జీఎంఆర్, గ్రీన్‌కో, అదానీ, జేఎస్‌డబ్ల్యూ వంటి ప్రఖ్యాత సంస్థల సహకారంతో దీనిని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆర్ టీఐహెచ్ ఫుల్ లైఫ్ సైకిల్ ప్రోగ్రామ్స్ అయిన స్పార్క్ (ఆలోచనల రూప కల్పన), క్యాటలిస్ట్ (18 వారాల ఇంక్యుబేషన్), వెలాసిటీ ల్యాబ్ లలోకి కొరియన్ స్టార్టప్‌లను ఆహ్వానం పలుకుతు న్నామన్నారు. ఈ వేదిక ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్ లకు మద్దతునిచ్చింది, 5,200కు పైగా ఎంటర్ ప్రెన్యూర్ లను భాగస్వాములను చేసింది. ఏపీ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ 2024-29లో భాగంగా ప్రోటోటైపింగ్, డీప్‌టెక్ గ్రాంట్ల కింద 22 కోట్ల ఆర్.టి. ఐ హెచ్ .ఐ డి బి ఐ సీడ్ ఫండ్, 20 కోట్ల వరకు తి.నీ సీడ్ ఈక్విటీ, క్రెడిట్‌గ్యారెంటీ వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాం. 160కి పైగా విసి /ఏం జెల్ సిండికేషన్ నెట్‌వర్క్ కలిగిన ఆర్ టీఐహెచ్ ఇప్పుడు ఏఐ, క్వాంటం, అధునాతన తయారీ కోసం ఎస్ ఐ డి బి ఐ భాగస్వామ్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన డీప్‌టెక్ ఏం జెల్ ఫండ్‌తో ఇప్పుడు మరింతగా విస్తరించినట్లు తెలిపారు.స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం: ఆర్‌టీ ఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియాకొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పనిచేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నాం. ఒక ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్‌ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో (కోట్రా/కిస్టార్టప్) సహఇంక్యుబేషన్ ఏర్పాటుచేస్తాం. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుంది. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2-3 మార్కెట్లలోకి, ఆం ధ్రప్రదేశ్ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభ తరమ వుతుంది. భారతదేశ ఆక్వాకల్చర్‌లో ఆంధ్రప్రదేశ్ సుమారు 40 వాటాను కలిగి ఉంది, 1,053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం వెంబడి లాజిస్టిక్స్, ఫిన్‌టెక్,

>>2

ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదలీలపై 13 నుంచి నిషేధం అమలు

విజయవాడ,జూలై6,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటా యింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వంతాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికశాఖ (హెచ్‌ఆర్‌ప్లానింగ్‌పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీచేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టతఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన ప్రక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, శాఖాధిపతులు ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించింది. స్థానిక కేడర్ల పంపిణీ పూర్తయ్యే వరకు పరిపాలనా చర్యలపై పరిమితులు ఉంటాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

అవ్వకు స్వయంగా ప్రసాదం అందిస్తున్న టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర

ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

విఐపి బ్రేక్ దర్శనంతో పులకించిన 116యేళ్ల అవ్వ

అంతటి వృద్ధాప్యంలోను కాలినడకన తిరుమలపైకి

తిరుమల,జులై 6ప్రభాతవార్తప్రతినిధి: సాధారణంగా రాజ్యాంగహోదాలోని ప్రముఖులకు లభించే విఐపి ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం తరహాలో ఎలాంటి ఆర్భాటంలేకుండా 116ఏళ్ళ అవ్వకు ఆమె కుటుంబానికి దక్కడం సాక్షాత్తు ఆ దేవదేవుడు ఇచ్చిన అరుదైన అవకాశం. శతాధిక వయస్సు దాటినా ఆ అవ్వకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగి ఉండటమే ఇందుకు నిదర్శనం. 116 ఏళ్ల వయస్సులోనూ మూడురోజుల క్రిందట అలిపిరి మెట్లదారిలో కాలినడకన తమిళనాడుకు చెందిన నవనీతమ్మ సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆ స్వామిని ప్రత్యేక దర్శనం చేసుకుని పులకించిపోయింది. ఈ జన్మకు ఇది చాలుస్వామీ అంటూ అవ్వ మనస్సులోనే ఉత్సాహం చూపింది. నవనీతమ్మ కాలినడకన తిరుమలకు రావడం, ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్

>>2

ఇంకా అన్వేషణే

గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

మరో ఘటనలోని 20 మంది సురక్షితం

కర్రి చిన్నను జాగ్రత్తగా తీసుకు వస్తున్నాం: విశాఖ రేంజి ఐజి గోపీనాథ్ జెట్టి

విశాఖపట్నం, జులై 6 ప్రభాత వార్త: విశాఖ సముద్ర తీరానికి సమీపంలో గల్లంతైన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులోని ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరాయంగా కొనసాగుతుందని విశాఖ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గాలింపు చర్యల వివరాలను వెల్లడించారు.జూలై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పడవ జూలై 4న తిరిగి చేరుకోవాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రమాదానికి గురై గల్లంతైందన్నారు. పడవలో మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఉండగా, వారిలో కర్రి చిన్నను పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని తెలిపారు. మిగిలిన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. జూలై 4 అర్ధరాత్రి సమయంలో సమాచారం అందిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు భారత తీర రక్షక దళం, భారత నౌకాదళాన్ని అప్రమత్తం చేసి సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత తీర రక్షక దళానికి చెందిన రెండు నౌకలు, భారత నౌకాదళానికి చెందిన రెండు నౌకలు ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిరంతర గాలింపు నిర్వహిస్తున్నాయన్నారు. అదేవిధంగా నౌకాదళం, తీర రక్షక దళానికి చెందిన డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్లు సముద్రంపై వైమానిక గాలింపు కొనసాగిస్తున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ ఆపరేషన్స్ స్టేషన్ (రోస్) ద్వారా ఎలక్ట్రానిక్ నిఘా కూడా నిరంతరం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం సముద్రంలో నాలుగు మీటర్ల వరకు ఎత్తైన అలలు, గంటకు సుమారు 50 నాటికల్ మైళ్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా గాలింపు, రక్షణ చర్యలకు తీవ్ర

>>2

సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్

ముగ్గురు జడ్జిల ప్రమాణ స్వీకారం

విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులుగా సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం,ఆలపాటి గిరిధర్,పురషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29నుంచి 32కు చేరింది. ఈకార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు,హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులురిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొన్ని చోట్ల ఈదురుగాలులతో వానలు

విజయవాడ,జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీరం దాటినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన ఆరు గంటలలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్యదిశగా కదిలిన వాయుగుండం.. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటినట్లు సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయుగుండం రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేనట్లు తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసేనట్లు పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు,మంగళవారం ఈ పరిస్థితి ఉండవచ్చని, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వర్షం కురిసే సమయంలో కల్వర్టులు, కాలువల సమీపంలోకి వెళ్లవద్దని సూచించింది. ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ సీజన్ మీద పడుతోంది. ఎల్‌నినో కారణంగా అడపాదడపా వానలు పడుతున్నా.. సాగుకు అనుకూల వాతావరణం ఉండటం లేదు. అలాగే కృష్ణా పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలలోనూ జూన్ నెలలో ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు.

ముంబయిలో భారీ వర్షాలకు కాలువలా కనిస్తున్న ఓ రహదారి

ముంబయి నుంచి కాశ్మీర్ దాకా

వరద ముంపు

ఉగ్రరూపంతో ప్రవహిస్తున్న నదులు

కొండచరియలు విరిగిపడి పలువురు దుర్మరణం

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

మహారాష్ట్రలో భారీ వర్షాలకు 10మంది మృతి

శ్రీనగర్,జులై 6: జమ్మూకశ్మీర్‌లో అటు ప్రకృతి విపత్తు ఒక విలయంగా మారింది. దోడాకిశ్త్‌వాడ్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా చీనాబ్ నది ఉగ్రరూపం దాల్చింది. రాంబన్ జిల్లాలోని బగ్లిహార్ డ్యామ్ ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అధికారులు సోమవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను ఎత్తివేసి నీటిని కిందకు విడుదల చేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, మునుపెన్నడూ లేని విధంగా డ్యామ్ గేట్లను తెరవడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ ప్రాంతంలో ఒక్కసారిగా మేఘ విస్ఫోటం సంభవించడంతో ఊహించని రీతిలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులన్నీ బురదమయంగా మారాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి కిశ్త్‌వాడ్‌లో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు సైట్ తీవ్రంగా దెబ్బతింది. కొండల నుంచి దూసుకొచ్చిన భారీ రాళ్లు, మట్టి పెళ్లల కింద ప్రాజెక్టుకు చెందిన అనేక వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు పూర్తిగా కూరుకుపోయాయి. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, భారత ఆర్మీ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. భారీ యంత్రాల సహాయంతో బురదను తొలగించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. బాధితులకు, పర్యాటకులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది ఈ వరద విపత్తుల నడుమ సింధు జలాల ఒప్పందం పై భారత్ తన కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ శాశ్వతంగా, నమ్మదగిన రీతిలో స్వస్తి పలికే వరకు 1960 నాటి ఈ ఒప్పందం సస్పెన్షన్ లోనే ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ

>>2

7-7pg2exHMNWJQE.qxd:7-7pg2exHMNWJQE.qxd 1/1/02 6:51 AM Page 1

సోమవారం జకార్తాలో ప్రధాని మోదీతో ముచ్చటిస్తున్న ప్రవాస భారతీయులు

యుద్ధవిమానాలతో ప్రధాని మోడీకి స్వాగతం

>> విమానాలతో స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ప్రధాని మోదీ విమానం నుంచి వీక్షించారు. ప్రస్తుతం ఈజెట్ రక్షణగా వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.రాజధాని జకార్తా చేరుకున్న మోదీకి ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా స్వాగతం పలికారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరోసారి చాటిచెప్పారు. మోదీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన క్షణం నుంచి ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ప్రత్యేక ఎస్కార్ట్‌గా ఆ దిందారు. భారత ప్రధాని విమానాన్ని జకార్తా వరకు భద్రతా పరిరక్షణలో వెంట తీసుకెళ్లడం ద్వారా ఇండోనేషియా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ప్రదర్శించింది. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, దౌత్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా భారత్‌ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, సముద్ర భద్రత, ఇండోపసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా భారత్‌ఇండోనేషియా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోదీ పర్యటనలో పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశమున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి.

ఇంకా అన్వేషణే

>> ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న అన్ని వనరులతో 72 గంటల ప్రామాణిక సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మరొక 24 గంటల పాటు తొలి విడత రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, తాజా సమాచారం అందిన వెంటనే వెల్లడిస్తామని గోపీనాథ్ జెట్టి తెలిపారు. బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్ర దింపులు కొనసాగిస్తూ, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాత్రికే ఒడ్డుకు చిన్నను తీసుకొస్తాంమెర్చంట్ వెసెల్‌లో సురక్షితంగా ఉన్న కర్రి చిన్నను తీరానికి తీసుకురావడానికి కోస్ట్ గార్డ్, నౌకాదళం ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మరో నౌకకు మార్పిడి చేయడం లేదా హెలికాప్టర్ ద్వారా తరలించడం ప్రమాదకరంగా ఉండటంతో ఆపరేషన్‌ను జాగ్రత్తగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో విశాఖ పోర్టు అధికారులతో చర్చించి సంబంధిత వాణిజ్య నౌకకు ముందుగానే బెర్తింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇదే క్రమంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మత్స్యకారులంతా వేటకు వెళ్లటప్పుడు తప్పకుండా బోటుకున్న ట్రాన్స్ పాండర్ ను తప్పకుండా ఆన్ చేసి ఉంచాలని విజ్ఞప్తి చేశారు.మరొక ఘటనలో 20 మందిని సురక్షితంగా రక్షించారు. ఇదిలా ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంజిన్ దెబ్బతిని సముద్రంలో చిక్కుకుపోయిన మరొక మత్స్యకార పడవలోని 20 మంది మత్స్యకారులను కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, భారత తీర రక్షక దళం, ఒడిశా మెరైన్ పోలీసు సంయుక్తంగా సురక్షితంగా రక్షించారని తెలిపారు. **ఆరు గంటల పాటు తిరగబడిన బోటుపైనే ఉన్నారు : ఎమ్మెల్యేవంశీ** "నేను కర్రి చిన్నాతో మాట్లాడాను. ఆయన చెప్పిన దాని ప్రకారం. నాలుగో తేదీ సాయంత్రం 3.00 గంటల ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న బోటు సాంకేతక సమస్యల వల్ల తిరగబడిపోయింది. ఆ సమయంలోనే కర్రి చిన్న వాళ్ల అన్నయ్య బోటు కిందకు పోయారు. మిగిలిన వారంతా తిరగబడిన బోటుపైనే రాత్రి 9.00 గంటల వరకు ఉన్నారు. ఆ బోటు క్రమేపీ మునిగిపోయింది. తెడ్డు ఆధారంగా వారంతా కొంత దూరం ఈదుకుంటూ వచ్చారు. వస్తూ వస్తూ ఉండగా ఒకిద్దరు మధ్యలో ఆగిపోయారు. నలుగురు కొంతవరకు వచ్చి ఆగిపోయారు. చిన్న ఒక్కడే ఈదుకుంటూ వచ్చి అక్కడికి దగ్గరలో లంగరు వేసి ఉన్న పనామా జెండాతో ఉన్న షిప్‌ను పట్టుకున్నడు. గట్టిగా అరవటంతో అందులో ఉన్న సిబ్బంది చూసి లైఫ్ జాకెట్ ఇచ్చి చిన్నాను రక్షించారు" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వివరించారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: సిఎం చంద్రబాబు

విజయవాడ, జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం,అలసత్వం ఉండకూడదని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఆయా ప్రభుత్వ శాఖల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కార్యచరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పారదర్శకంగా వ్యవహారిం చాలన్నారు.రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలి. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏపీ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని... గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. కార్పొరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

నాగరాజు కస్టడీ షరతుల సవరణపై నేడు హైకోర్టు తీర్పు

విజయవాడ.జూలై6,ప్రభాతవార్తప్రతినిధి: గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులోనిందితుడిగా ఉన్న సస్పెండైన సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది.చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తు ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమర్థతను ప్రభావితం నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు.నిందితుడు నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సముచితమని పేర్కొన్నారు.నాగరాజు తరఫు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగా రంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై మంగళవారం ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది.

పలువురు ఐపిఎస్ అధికారుల బదలీ

విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు.అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు.అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

3 రీజియన్లలో క్రీడా సిటీలు

>> లకు సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో మూడు ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ సిటీల అభివృద్ధి జరగాలన్నారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంలో సూర్య లంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లోని 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో వైజాగ్ బే సిటీ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేలా ప్రముఖ సంస్థల్ని ఆహ్వానించాలన్నారు. బే సిటీలో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని గుర్తించినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్లో ఇప్పటికి మొత్తం 49 ప్రాజెక్టులు రాగా...వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని అధికారులు వివరించారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని చెప్పారు. అయితే వీటితో పాటు వచ్చే 3 నెలల్లో లక్ష చదరపు అడుగుల్లో ఇంటర్నేషనల్ కన్వెన్సన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకుపాడేరు విశాఖను పర్యాటక సర్కిల్‌గా రూపొందించి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాలన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందన్నారు. వెల్నెస్ సెంటర్లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు జరపాలన్నారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో నివసిస్తున్నారని, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండటం ఏఈఆర్‌కు కలిసొచ్చే అంశమని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం...మొత్తం 9 జిల్లాలు అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉండగా వీటిలో అన్నింటికన్నా కృష్ణా జిల్లా తలసరి ఆదాయంలో ముందుందని అధికారులు చెప్పారు. జిల్లాల వారీగా రీజియన్ అభివృద్ధి జరిగేలా వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు, కొల్లేరసరస్సు ను రీజియన్ అభివృద్ధి కోసం వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు.

వీఈఆర్, ఏఈఆర్‌తో పోటీపడేలా టీఈఆర్: ఖనిజ సంపద నుంచి హార్టికల్చర్ వరకు...పుణ్యక్షేత్రాల నుంచి పర్యాటక ప్రాంతాల వరకు రాయలసీమకు ఉన్న అనుకూలతను మార్కెటింగ్ చేసుకోవాలని సీఎం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే పెద్దఎత్తున పెట్టుబడులు... తద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీ పడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి జరగాలన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఐఐటీ వంటి విద్యా సంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులు రాయలసీమ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గండికోట, హార్స్లీహిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. శ్రీసిటీ దేశంలోనే నెంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా నిలు స్తోందని, అలాగే ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్... ఇలా అన్ని రంగాల్లోనూ పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నయ్ వరకు నాలుగు వరుసల రైల్వే లైన్ వస్తోందని... మౌలిక వసతులను వినియోగించుకుని టీఈఆర్‌ను మరింతగా ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచన చేయాలన్నారు.

0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా టీఈఆర్: స్వర్ణాంధ్ర 2047 విజన్ మేరకు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా ..తిరుపతి ఎకనమిక్ రీజియన్ వాటాగా 0.90 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. టీఈఆర్ ప్రణాళికల కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య...మొత్తం 9 జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి 3 ఎకనామిక్ రీజియన్లపై సమీక్ష నిర్వహిస్తామని సీఎం అన్నారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈ మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ లు పాల్గొన్నారు.

డి.సిఎం పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు

గన్నవరం(కృష్ణా), జులై 6, ప్రభాతవార్త : ఎన్నికలకు ముందు తన కుమార్తె మరణానికి కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన జనసేనాని పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత కేసును నీరుగార్చేవిధంగా మాట్లాడుతూ తమన మోసం చేసారని సుగాలి ప్రీతీ తల్లి పార్వతి సోమవారం కృష్ణాజిల్లా గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసారు. గత ఎన్నికల సమయంలో సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి అంశాన్ని తరచు ఎన్నికల సభలలో ప్రస్తావించిన పవన్ కళ్యాణ్ తాము అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా ప్రీతి కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పార్వతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రీతి కేసులో సాక్ష్యాలు లేవంటూ నిందితులకు మేలు చేకూర్చేలా మాట్లాడుతూ తమ కుటుంబాన్ని మోసం చేసారని ఆమె ఆరోపించారు. తమను మోసం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పార్వతి ఫిర్యాదుపై విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని గన్నవరం సిఐ శివప్రసాద్ తెలిపారు. కాగా ఈకేసులో నేరానికి సంబందించిన అంశాలు లేనందున కేసు నమోదు చేసే అవకాశాలు లేవనే చెప్పాలి. ఈఉదతంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోలీసు కేసులు పెట్టడం సాధ్యమా కాదా అన్న అంశం తీవ్ర చర్చనీయంశంగా మారింది.

లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్

విజయవాడ.జూలై 6,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసులో రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు..రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో ఏ2 రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌లో కోరారు..ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 13కు వాయిదా నాంపల్లి కోర్టు వేసింది.ఈ క్రమంలో ఇదే కేసులో .నిందితులు వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, కారుమూరి సునీల్‌ను వారం రోజులు కస్టడీ కోరుతూ పిటిషన్ ఈడీ దాఖలు చేసారు. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది.

అయోధ్య ట్రస్టు తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణమోహాన్

అయోధ్య,జులై 6: అయోధ్య రామమందిర్ విరాళాల చోరీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. విరాళాలు కాజేసిన నిందితులు పట్టుబడేంత వరకు పదవిలో కొనసాగబోనని జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, కోశాధికారి అనిల్ మిశ్రాలు సమర్పించిన రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. అనంతరం ట్రస్టీ సభ్యుల్లో ఒకరైన మధ్యంతర కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. త్వరలోనే సంస్థాగత సమీక్ష అనంతరం తాత్కాలిక కోశాధికారి పేరును కూడా వెల్లడిస్తామని ట్రస్టీ తెలిపింది. ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామ జన్మభూమి కాంప్లెక్స్ లో సోమవారం శ్రీ రామజన్మభూమి క్షేత్ర ట్రస్ట్ మూడుగంటలకు పైగా సమవేశమైంది. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాలను ఆమోదించిన ట్రస్టీ తాత్కాలిక కార్యదర్శిగా కృష్ణ మోహన్‌ను నియమించింది. అనంతరం ట్రస్ట్ కోశాధికారి స్వామీ గోవింద్ దేవ్ గిరి మీడియాతో మాట్లాడుతూ రామ మందిర్ విరాళాల చోరీ ఘటన తమ సంఘాన్ని తీవ్రంగా బాధించిందని చెప్పారు. రామమందిర్ విరాళాల చోరీ మమ్మల్ని చాలా బాధించింది. పెద్దమొత్తం కాజేశారా చిన్న మొత్తమా అనేది రెండో విషయం. అంతకంటే ముఖ్యంగా అలాంటి పవిత్రమైన చోట విరాళాల చోరీ జరగడం మమ్మల్ని క్షోభకు గురి చేస్తోందని గోవిద్ దేవ్ గిరి ఆవేదన వ్యక్తం చేశారు. విరాళాల చోరీకి బాధ్యులైన వారిని పట్టుకునేంతవరకు తాను కార్యదర్శిగా కొనసాగడం సమంజసం కాదని చంపత్ రాయ్ రాజీనామా చేశారని ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామాను అంగీకరించడం లేదా తిరస్కరించం వంటివి ఎక్కువ రోజులు మా చేతుల్లో ఉండవు. రాజీనామాను వెంటనే ఆమోదిస్తాం. మాకు వేరే దారి లేదని గోవింద్ దేవ్ గిరి తెలిపారు. జూలై 22వ తేదీన మరోసారి సమావేశం అవుతామని ట్రస్ట్ వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రత్యేక దర్యాప్తు బృందం సమర్పించిన తుది నివేదికను సమీక్షిస్తామని, ఆ తర్వాత కొత్త సభ్యులను, కార్యవర్గాన్ని నియమిస్తాని తెలిపింది.

ముంబై ప్రాంతంలో భారీ వర్షాలకు విరిగిపడిన వృక్షాలు

భారత్ ఏఐ రాజధానిగా ఏపి

>> డీప్‌టెక్, ఫ్రాంటియర్ టెక్, అధునాతన తయారీ హబ్ లలో పెట్టుబడులు కొరియన్ సంస్థలకు లాభసాటి కాగలవని మంత్రి లోకేష్ చెప్పారు.

అమరావతిలో తొలి క్వాంటంవ్యాలీ యూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం మా ధ్యేయం. ఇందులో భాగంగా గూగుల్ ఏఐ హబ్ (ఏప్రిల్ 2026లో శంకుస్థాపన చేశాం. రిలయన్స్, సిఫీ, కంట్రోల్‌ఎస్ తదితర సంస్థలు ఏపీలో 10 గిగావాట్ల డేటాసెంటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాయి. తద్వారా స్టార్టప్‌లకు సరసమైన ధరలకు పెద్ద ఎత్తున కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశపు మొట్టమొదటి క్వాంటం, ఏ ఐ విశ్వవిద్యాలయం అమరావతి క్వాంటం వ్యాలీలో ఆవిష్కృతమవుతోంది. దీనిద్వారా భారతదేశపు అత్యంత అధునాతన 133క్యూబిట్ ఐబిఎం క్వాంటం సిస్టమ్ టూ, ఐబిఎం - టిసిఎస్ క్వాంటం క్లౌడ్ సర్వీసెస్, ఒక క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి రానున్నాయి. కొరియన్ డీప్‌టెక్ స్టార్టప్‌ల పరిశోధన, సహఅభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయండి: దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ మాతుల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ సీఈవో లీ చియాంగ్‌గెన్ తో ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... మాతుల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసు కున్న ఎంఓయూ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారం భించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రూ.300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆర్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుతోపాటు, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు. మాతుల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ మాట్లాడుతూ... మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్జార్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బ్యాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో ఎం ఎఫ్ డి ఎస్ సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకతకలిగి ఉందని చెప్పారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివ ర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ఏఐ స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఛైర్మన్ లీ చియాంగ్‌గెన్ అన్నారు.

ఒప్పందమా! యుద్ధమా?

ఇప్పటికీ చర్చల ద్వారానే పరిష్కారం ఆశిస్తున్నా

9.1కోట్లమంది ఇరాన్‌ప్రజలకు హానిచేయకూడదనే భావిస్తున్నా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

వాషింగ్టన్,జులై 6: అమెరికాతో ఇరాన్ ఒప్పందం చేసుకోకపోతే మిషన్ పూర్తి చేస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. ఓపక్క ఇరాన్‌లో దివంగత సుప్రీం లీడర్ అయొతుల్లా ఖొమైనీ అంత్యక్రియల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్‌కు ఆగ్రహాన్ని రప్పించాయి. అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న వేళ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. అయితే తాను ఇప్పటికీ చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నానని కూడా వెల్లడించారు. ట్రంప్ మాట్లాడుతూ ఒప్పందం జరిగినా, జరగకపోయినా చివరికి గెలిచేది అమెరికానే అని అన్నారు. అయితే 9.1 కోట్ల మంది ఇరాన్ ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ఉద్దేశంతో తాను ఒప్పందానికే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. ఇరాన్ ఇప్పటికే కొన్ని అంశాల్లో అమెరికాకు హామీలు ఇచ్చిందని, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిం దేనని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే చర్చల ప్రక్రియలో భాగంగా ఇరాన్ వద్ద ఉన్న అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియాన్ని కూడా అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్‌పై చేపట్టిన చర్యల ఫలితంగానే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గాయని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా చూపిన కఠిన వైఖరి కారణంగా చమురు ధరలు ఉద్రిక్తతలకు ముందున్న స్థాయికంటే కూడా తగ్గాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు తీసుకురావాలన్న ఉద్దేశం తమకు లేదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చల ద్వారా పరస్పర అంగీకారంతో శాంతియుత పరిష్కారం సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని మరోసారి వెల్లడించారు.

ఈ జన్మకు ఇది చాలు స్వామీ!

>> కావడంతో ఆమె భక్తికి పలువురు ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సోషియల్ మీడియా ఖాతాల్లో భక్తికి వయస్సు అడ్డురాలేదని, శ్రీవారిపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఈ వృద్ధురాలే నిదర్శనమని పోస్ట్ చేశారు. ఈ క్రమంలో వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా ఆదివారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ సూచనలతో టిటిడి విజిలెన్స్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, తమిళనాడు చెన్నైకు చెందిన నవనీతమ్మ తిరుపతిలో ఉన్నట్లు కనుగొన్నారు. ఛైర్మన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నవనీతమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించారు. ఛైర్మన్ కార్యాలయం సిబ్బంది స్వయంగా ఆమెను బయోమెట్రిక్ కేంద్రం నుండి ఆనందనిలయం వరకు వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శతాధిక వృద్ధ భక్తురాలికి వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, శ్రీవారి తీర్థప్ర సాదాలను అందజేశారు.అనంతరం నవనీతమ్మ మనవడు దిక్పతి మాట్లాడుతూ ఆ దేవదేవునిపై అచం చల భక్తివిశ్వాసాలే శ్రీవారి రూపంలో టిటిడి అధికారులు తమ అమ్మమ్మతో పాటు కుటుంబ సభ్యులకు ఎంతో గొప్ప దర్శనభాగ్యాన్ని కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయం వెలుపల టిటిడి సిబ్బం దికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన తరువాత 116ఏళ్ల అవ్వ తిరుమలలో భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

ముంబయి నుంచి కాశ్మీర్ దాకా వరద ముంపు

>> శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు.

ముంబయి,థాణె,రాయ్‌గడ్‌ప్రాంతాల్లో జల విలయం

ముంబయి,జులై 6:భారీ వర్షాలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. ముంబై, పుణె, థానే, రాయగడ్ ప్రాం తాలు వానలకు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలకు సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఒకరు గల్లంతయ్యారు. ఎడతెరిపి లేని వానలతో పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్‌లో ఈరోజు తెల్లవారుజామున 4:25 గంటలకు పలు ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 మంది గ్రామస్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మోలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ కొండచరి యలు విరిగిపడ్డాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనతో ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపుణె హైవేపైభారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిం దని ఆయన వెల్లడించారు. సుమారు 100 టన్నుల శిథిలాలు ఒక్కసారిగా ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేపై పడ్డాయని పేర్కొ న్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. ఇప్పటివరకు దాదాపు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు సీఎం వివరించారు.

పూణే ప్రాంతంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

పుణె నుంచి ముంబైకి వెళ్లే ట్రాఫిక్ కోసం ఒక లేన్‌ను తిరిగి తెరిచామని, రాబోయే కొన్ని గంటల్లో ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిస్థాయిలోపనిచేస్తుందని ఆయన వెల్లడించారు. 16 రైళ్లను రద్దు చేయగా మరికొన్నిం టిని దారి మళ్లించారు. భద్రతా కారణాల దృష్ట్యాముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపూణే హైవేపై రాకపోకలను కూడా తాత్కాలికంగా నిలిపి వేశారు. అత్యసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

వారం - వర్జ్యం

07-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
సప్తమి మ.1.20
ఉత్తరాభాద్ర సా.4.19
వర్జ్యం : తె.4.07-తె.5.41,
దు.ఉ.8.17-ఉ.9.09, 2)రా11.59-రా.12.51
శుభసమయం : ఉ.9.30-10.15
రాహుకాలం - మ.3.00-4.30

వార్తాఫలం

మేషం: నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వస్త్రలాభం కలదు.

వృషభం: భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. పెట్టు బడుల విషయాలలో నిదానం అవసరం.

కర్కాటకం:కళలు, రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

సింహం:ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వాహనాలు కొనుగోలు చేస్తారు.

కన్య : విద్యావరంగా పురోభివృద్ధి బాగుంటుంది. నూతన వైద్య, విధానములు అనుకూల ఫలితములను ఇస్తాయి.

తుల :వృత్తి సంబంధమైన వ్యవహారాలలో ఒత్తిడి అధికం అవడం వల్ల శరీరం అలసటకు గురౌతుంది. బంధువుల కలయిక.

వృశ్చికం: బ్యూటీపార్లర్‌లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. ఎదుటి వారి విషయాలలో జోక్యం చేసుకోవద్దు.

ధనుస్సు: నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఈ రోజు మరిన్ని అనుకూల ఫలితాలు సాధిస్తారు.

మకరం: అవసరమైన సమాచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు. వాహనాలు కొనుగోలు.

కుంభం: శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. కాని దైవాను గ్రహం వలన మీ ఊహ వాస్తవికతకు దూరం అవుతుంది.

మీనం: ఆర్థిక వ్యవహారాలలో పురోగతిని సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

శ్రీసిటీలో విద్యుత్ పరికరాల తయారీ యూనిట్ పెట్టండి

• హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో మంత్రి లోకేష్ భేటీ • ఏపిలో మైక్రో ఎల్ఇడి డిస్ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయండి • సాఫ్ట్-ఇపిఐ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్‌కు మంత్రి వినతి • సియోల్ సెమీ కండక్టర్స్ డిస్ ప్లే ఫ్యాబ్ నెలకొల్పండి • సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యాంగ్ లీతో లోకేష్

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ పియు ప్రెసిడెంట్ యోకోటా తకేషితో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లోని హ్యోసంగ్ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం రూ.8వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ నెట్‌వర్క్ కలిగి ఉందని చెప్పారు. 2034నాటికి 15గిగావాట్ల ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌తో, 160 జి డబ్ల్యు క్లీన్ ఎనర్జీ సాధన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 7,248 ఎండబ్ల్యూ కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటన్నింటికీ భారీ స్థాయిలో 765/800 కె.వి ట్రాన్స్‌ఫార్మర్లు, జిఐఎస్, స్టేట్ కామ్ పరికరాలు అవసరం అవుతాయన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో, విద్యుత్ పరికరాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాలు తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ పి యు ప్రెసిడెంట్ యోకోటా తకేషి మాట్లాడుతూ హో సాంగ్ టీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. (పుణె, ఖేడ్ సిటీ) 2006 నుండి భారత్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది చెప్పారు. భారతదేశంలో 66-800 కె.వి జిఐఎస్ పరికరాలను తయారు చేసే ఏకైక సంస్థ హ్యోసంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మాత్రమేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని యోకోటా తకేషి చెప్పారు.

జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఈడీ, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ అధికారులతో లోకేష్ భేటీ: దక్షిణ కొరియాకు చెందిన జిజన్ ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఇడి, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ స్టాఫ్ ఇపిఐ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్‌సుంగ్ చోలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని. డిస్‌ప్లే తయారీదారుల కోసం ఎపిలో మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటుచేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఐఐటీ సహకారంతో ఒక అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్, ఎపిటాక్సీ, ఏమో సివిడి, మైక్రో ఎల్ఇడిలలో ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే సాఫ్ట్‌ఇపిఐ అకాడమీని ఎపి ప్రభుత్వంతో కలిసి ఏర్పాటుచేయాలని కోరారు. సాఫ్ట్‌ఈపీఐ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ సుంగ్ మిన్ హ్వాంగ్ మాట్లాడుతూ తమ సంస్థ దక్షిణ కొరియాలో జన్ ఎపివేఫర్లు, మైక్రో ఎల్ఇడి ఉత్పత్తులను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తుందని చెప్పారు. భారత్‌లో ప్రస్తుతానికి ప్రత్యక్ష తయారీ, కార్యకలాపాలు లేవని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు.

సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యాంగ్ లీతో మంత్రి లోకేష్ భేటీ: సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యాంగ్ లీతో ఎపి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ 2026లో భారతదేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25శాతం, గత 24నెలల్లో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని చెప్పారు. పరిశ్రమ అవసరాలను గుర్తించి, నైపుణ్యాలను అందించడానికి నైపుణ్యం, కౌశలం పథకాలను ప్రారంభించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కియా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఎల్‌జీ కెమ్, ఎంసీఎన్ఎక్స్ (కెమెరా మాడ్యూల్స్), సోలమ్ (ఏసీ విడిభాగాలు), హ్వాసంగ్ (పాదరక్షలు) వంటి 40కి పైగా కొరియన్ కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉందని, బుల్లెట్ రైళ్లు, రేర్ ఎర్త్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరాన్ని నిర్మించడంలో కేంద్రం మద్దతుతో ఏపీ ముందుకెళుతోందన్నారు. ఇటీవల ఇండియా సెమీ కండక్టర్స్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్ట్ ఏఎస్ఐపీ, ఏపీఏసీ లిమిటెడ్ కొరియన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ తమ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యాంగ్ లీ మాట్లాడుతూ భారత్‌లో తమ సంస్థ ప్రస్తుతం సేల్స్, డిస్ట్రిబ్యూషన్ కార్యాలయానికి మాత్రమే పరిమితమైనట్లు తెలిపారు. భారత్‌లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వ ఆదేశాలు

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజా ఉపాధిలో కీలకమైన స్థానిక కేడర్ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యక్ష నియామకాల నియంత్రణకు సంబంధించి పలు ఆదేశాలు ఇచ్చింది. కేడర్ బలాన్ని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది బలాన్ని నిర్ధారించడం, పంపిణీ చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వులు- 2025 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణకు ప్రభుత్వం ఈ ఆదేశాలిచ్చింది. కేడర్ బలం నిర్ధారణ, పంపిణీకి మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుత ఉద్యోగుల లోకల్ కేడర్‌ను ఆయా విభాగాధిపతులు నిర్ధారిస్తారు. ఈ విభజన భవిష్యత్తు ప్రత్యక్ష నియామకాలపై ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు లోకల్ కేడర్ నిర్ధారిస్తారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలు ఈ పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ జిల్లాలకు ఉద్యోగులను తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.

రావణ్‌కు 18వరకు రిమాండ్

రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసులో కోర్టు అతనికి రిమాండ్ విధించింది. బచ్చలకూరి జోసెఫ్‌పై గన్నవరానికి చెందిన జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ బిఎన్ఎస్‌లోని 152 సహా పలు సెక్షన్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)లోని సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. రావణ్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు. యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్) రిమాండ్ రిపోర్టులో గన్నవరం పోలీసులు కీలక అంశాలు పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. “యువత, విద్యార్థులను రావణ్ రెచ్చగొడుతున్నాడని, అతడిపై తెలుగు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. రావణ్ నిషేధిత మావోయిస్టు సంస్థ వైపు యువతను ఆకర్షించేలా ప్రకటనలు చేస్తున్నారు. రావణ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 9 కేసులు నమోదయ్యాయి. మతపరమైన విభేదాలు రెచ్చగొట్టేలా రావణ్ తీరు కనిపిస్తుంది. రాష్ట్రంలో అశాంతిని సృష్టించి యుద్ధం చేయాలనే ఉద్దేశం రావణ్‌లో ఉంది. ఇటీవల ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో రావణ్ రెచ్చగొట్టేలా మాట్లాడారు. రావణ్ అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. పదవుల్లో ఉన్న వారిని రావణ్ దూషించారు. రావణ్, వ్యవస్థలపై ప్రజల్లో ద్వేషం, వైషమ్యాలు సృష్టిస్తున్నారు. మావోయిస్ట్ హిడ్మాను కీర్తిస్తూ రావణ్ ప్రసంగాలు చేశారు. మావోయిస్టు భావజాలాన్ని రావణ్ ఫోన్‌లో గుర్తించాం. దేవుళ్లను అవమానించడం, కించపరచడమే లక్ష్యంగా రావణ్ పని చేస్తున్నారు. రావణ్ పేరు పెట్టుకోవడం కూడా అందులో భాగమే. రావణ్‌కు సహకరిస్తున్న వ్యక్తులు ఎవరో తేల్చాల్సి ఉంది. నిందితుడు రావణ్ విచారణకు సహకరించటం లేద్ను అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియామకం

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశీ పెట్టుబడుల కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది. జీఓ ఆర్టీ నంబర్ 1333 ద్వారా ఈ నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ అనుసంధానంపై ఎపి ప్రభుత్వం దృష్టి సారించింది.

ధైర్యంగా ఉండండి

• గాలింపు చర్యలు ముమ్మరం చేశారు

• గల్లంతైన మత్స్యకార కుటుంబాలకు బిజెపి చీఫ్ మాధవ్ పరామర్శ

• చేపల వేటకు వెళ్లే వారికి బీమా తప్పనిసరిగా చేయాలని వినతి

విశాఖపట్నం, జులై 6 ప్రభాతవార్త: విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతు కావడం అత్యంత దురదృష్టకరమని, వారిని క్షేమంగా తీసుకురావడానికి ప్రభుత్వ యంత్రాంగాలు అన్నీ సమన్వయంతో పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. సోమవారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న ఆయన గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, కేంద్ర సంస్థలు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాయని భరోసా కల్పించారు. అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో ఘటనపై సమీక్ష నిర్వహించి గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ నౌకలు, ఇతర రక్షణ బృందాలతో గాలింపును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వేటకు వెళ్ళే మత్స్యకారులకు ప్రమాద బీమా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా లైఫ్ జాకెట్లు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయాలని ఆవిధంగా చేస్తే వారి ఆచూకీ తెలుసు కోవడానికి మార్గం సులభంగా ఉంటుందని అన్నారు. మెకనైజ్డ్ బోట్లుకు జిపిఎస్ అందుబాటులోకి తీసుకు రావడంతో రక్షణ చర్యలు పర్యవేక్షణ పెంచాలని, మత్స్యకారులు వేటకు వెళ్ళే మెకనైజ్డ్ బోట్లు కోస్టు గార్డ్ కార్యాలయానికి జిపిఎస్ విధానం అనుసంధానం చేయాలని మాధవ్ సూచించారు. ప్రతి క్షణం విలువైనదేనని, గాలింపు చర్యల్లో ఎలాంటి అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారిది అజమాయిషీ... మాది అభివృద్ధి: కేంద్ర మంత్రి రామ్మోహన్

శ్రీకాకుళం, జులై 6 ప్రభాతవార్త: గత ప్రభుత్వ పాలన సమయంలో సమస్యలపై, ప్రజలపై అజమాయిషీ ఉండేది కానీ.. పరిష్కారం, ప్రయోజనాలు ఉండేవి కావని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం నాడు జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. తొలుత హిరమండలం మండలంలోని ధనుపురం గ్రామం వద్ద 29 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను ప్రారంభించారు. అనంతరం పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ నాయుడుకు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డు నుండి మెళియాపుట్టి వరకు 3.40 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. పాతపట్నం కేజీబీవిలో 2.55 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన అదనపు వసతి గృహాలను ప్రారంభోత్సవం చేశారు. లోపల గదులను పరిశీలించి సూచనలు చేశారు. పాతపట్నం మండలం కోదూరు వద్ద 2.30 కోట్ల రూపాయలతో నిర్మించిన పీఎం జన్మాన్ హాస్టల్ భవనాలను ప్రారంభించారు. పాతపట్నం మండలం సీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో ప్రహరీ గోడ, కొత్తూరు మండలం నివగాం నుండి గొట్ట వరకు 2.80 కోట్ల నాబార్డ్ నిధులతో బిటి రోడ్డు, నివగాం నుండి పాతపాడు వరకు 1.50 కోట్ల ఏపీఆర్.ఆర్.పీ నిధులతో నిర్మించిన బిటి రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఎల్.ఎన్.పేట మండలం తాయిమాంబపురం వద్ద బొటాడసింగి వద్ద 2.37 కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సీదిలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు తన కుటుంబంతో పాతపట్నం నియోజకవర్గంకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తామెప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతంలో వేరే పార్లమెంట్ పరిధిలో ఉన్న పాతపట్నం నియోజకవర్గం తన తండ్రి దివంగత ఎర్రంనాయుడు చొరవతో శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో చేరిన వైనాన్ని వివరించారు. రాష్ట్రంలో ప్రజలపై అజమాయిషీ చెయ్యాలని వైసీపీ సర్కారు ప్రయత్నిస్తే మనసారా కోరుకుని కూటమి సర్కారుకు పట్టం కట్టి బరువైన బాధ్యతను అప్పజెప్పారని రామ్మోహన్ నాయుడు అన్నారు. పాతపట్నం నుండి కుప్పం వరకు, అనంతపురం నుండి నెల్లూరు వరకు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టే బాధ్యతను అప్పజెప్పారని అప్పుల ఊబి నుండి అభివృద్ధి వైపు బలమైన అడుగులు వేస్తున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా ప్రజలకు చేరువ చేశామని రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలను అమలుపరిచి ప్రజామోదాన్ని సంపాదించామని స్పష్టం చేశారు. ఇల్లు, ఫించనులు బాధ్యతగా అందిస్తామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, అధికారులు స్థానికులు పెద్దఎత్తున భాగస్వామ్యం అయ్యారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఇంకా డోలీ మోతలే!

• కారుమానుకొండలో బాలిక పాము కాటు • 7 కిలోమీటర్లు డోలి మోతతో వైద్యశాలకు తరలింపు

పోలవరం, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం జిల్లాలోని కూనవరం మండలం కారుమానుకొండ గ్రామానికి చెందిన చందా సమ్మక్క ప్రియా అనే యువతి పాము కాటుకు గురైంది. దాంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు కొండలపై నుంచి సుమారు 7 కిలోమీటర్ల పాటు ఆ యువతని డోలిలో పెట్టుకొని కాలినడకన సోమవారం ఉదయం కూటూరు ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తెలంగాణలోని భద్రాచలం తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఎత్తైన కొండలపై అనేక కొండారెడ్డి గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు నేటికీ సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో కొండలపై నుంచి ఎక్కటం, దిగటం అనేది ఒక్క కాలినడక మాత్రమే మార్గం ఉంది. రహదారి సౌకర్యం లేని కార్మానుకొండ గ్రామంలో కొండరెడ్డి కుటుంబానికి చెందిన చంద్ర లక్ష్మయ్య

కుమార్తె సమ్మక్క ప్రియ. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. నిద్రమత్తులో ఉన్నప్పుడు తనను ఏదో పురుగు కుట్టిందని భ్రమించిన ఆ యువతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. పాముకాటుకు గురైనట్లు పసిగట్టిన కుటుంబ సభ్యులు ఆ యువతి నడవలేని స్థితిలో ఉండటంతో డోలి ఏర్పాటు చేసుకొని ఏడు కిలోమీటర్ల పాటు కొండలపై నుంచి దిగి నడుచుకుంటూ సోమవారం ఉదయం కూటూరు పి.హెచ్.సికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా బాలిక పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉంచి వైద్యులు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాలికను రక్త పింజర పాము కాటుకు గురైనట్టు వైద్యులు గుర్తించారు. ఇప్పటికే రెండు యూనిట్లు ప్లాస్మా ఎక్కించినట్లు వైద్యులు తెలిపారు.

ముగ్గురు పిల్లల్ని కంటే నగదు పురస్కారం

• కాన్పుల మధ్య విరామం.. తల్లీబిడ్డకు క్షేమం

• 11 నుంచి 18 వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ప్రచారం: మంత్రి సత్యకుమార్

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో మూడు జంటల(మొత్తం 84 జంటలు)కు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామని తెలికాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరు ్నజటలకు పై విధంగానే రూ.5వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు. ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. “పిల్లల మధ్య ఎడం పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం” అనే నినాదంతో ఈసారి ప్రచారం సాగనుంది. గర్భధారణకు సరైన సమయాన్ని ఎంచుకోవడం, కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యానికి మేలు కలుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మహిళా శిశు అభివృద్ధిశాఖ సిబ్బంది, ఇతర ప్రజా భాగస్వామ్య సంస్థలను ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ .చక్రధర్ బాబు తెలిపారు. ఉత్తమంగా పనిచేసిన వైద్యులు, సిబ్బందికి నగదు పురస్కారాలు ఇవ్వనున్నట్లు చక్రధర్ బాబు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కలిపి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.56 లక్షలను విడుదల చేశామని చెప్పారు.

బిసిల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యం

• మూడు బడ్జెట్లలో రూ.1.37 లక్షల కోట్ల కేటాయింపుతో చరిత్ర

• బిసి విద్య, గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి భారీ ప్రాధాన్యం: మంత్రి సవిత

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: బిసిల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో బిసిలకు మరోసారి మంచి రోజులు ప్రారంభమయ్యాయని అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బిసి సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత, రాయలసీమ అభివృద్ధి, గత ప్రభుత్వ వైఖరిపై విస్తృతంగా మాట్లాడారు. సమాజంలో సగానికి పైగా ఉన్న బిసిల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. మూడు బడ్జెట్లలో కలిపి రూ.1.37 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించడం చరిత్రలోనే తొలిసారని, బిసిల

పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, భోజనం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో బిసి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి తెలిపారు. బిసి విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు శ్రీసత్యసాయి జిల్లా టేకులోడు, విశాఖ జిల్లా సింహాచలంలో రెండు ఎక్స్‌లెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమను కూడా రాష్ట్రానికి తీసుకురాలేదని మంత్రి విమర్శించారు. ‘జె ట్యాక్స్’ పేరుతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలను కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టిందని ఆరోపించారు. రాయలసీమ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, ఐటి, డిఫెన్స్, విద్య, పర్యాటకం, హార్టికల్చర్ వంటి అన్ని రంగాల్లో రాయలసీమకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలు నేడు పెట్టుబడుల గమ్యస్థానాలుగా మారుతున్నాయంటే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వమే కారణమని మంత్రి సవిత పేర్కొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Lakshmi Narasimha swamy Temple
Balasinganapalli(V), Chennuru(M), Kadapa District
e-Procurement Tender
NIT.No.P/COE/1027/2026, Date:20.05.2026
e-Tenders are invited through the e-Procurement portal for Construction of Compound wall and 3 Storied Rajagopuram. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

7-7Pg7exHMNWJQE.qxd:7-7Pg7exHMNWJQE.qxd 1/1/02 7:04 AM Page 1

ఉదయగిరి అభివృద్ధికి పరిశ్రమలే పునాది

● కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి ● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

ఉదయగిరి, (నెల్లూరు) జులై 6 ప్రభాతవార్త: ఉదయగిరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గత రెండేళ్లలో ఉదయగిరి సంక్షేమం కోసం రూ.1,098.79 కోట్లు కేటాయించామని, ఇప్పటికే నాలుగు పరిశ్రమలకు ఆమోదం లభించగా వాటి ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సోమవారం ఉదయగిరికి చేరుకున్న మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యువనేత నారా లోకేష్ కృషితో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఆంధ్రప్రదేశ్‌కు రప్పించగలిగామని పేర్కొన్నారు. ఉదయగిరి ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర పరిస్థితులు క్రమంగా మెరుగు పడుతున్నాయని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రికొనియాడారు. తాను కూడా నారాయణ నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ రాకతో ఉదయగిరి అభివృద్ధికి మరింత వేగం వస్తుందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఉదయగిరి రూపు రేఖలు మారిపోతాయని ముఖ్యమంత్రి చంద్ర బాబు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్య కర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, యువ నేత లోకేష్ కృషితో పరిశ్రమలు ప్రారంభం కానున్నాయని, ఉదయగిరి- సీతారాంపురం మండలాలకు తాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నందవరం- ఉదయ గిరి రోడ్డుకు నిధుల కేటాయింపు, బనగానపల్లి రోడ్డుకు అటవీశాఖ అనుమతుల సమస్య పరిష్కారం, ఉదయగిరిలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ మేకపాటి శాంతమ్మ, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, చిరంజీవిరెడ్డి, బాబు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధే నా ధ్యేయం

● రూ.2 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం ● రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు (నెల్లూరు), జులై 6 ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిస్తూ జేజేలు చేస్తూ పూలవర్షం, హారతులతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. ప్రజల ఆశీర్వాదమే తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈసందర్భంగా సుమారు 2కోట్ల వ్యయంతో పూర్తయిన నూతన జడ్పీ హైస్కూల్ భవనం, సిసిరోడ్లు, పశువుల షెడ్లు ప్రారంభించడంతోపాటు శ్రీకోందడరామ స్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆత్మకూరు మండలంలోని ఈగ్రామానికి రాలేకపోయినా తనను రెండోసారి ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రిగా ఆశీర్వదించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు శాశ్వత ప్రయోజనం: రైతాంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు, 42 ఆర్ కాలువ పనులు ఎన్నో అడ్డంకులు ఎదురైనా పూర్తిచేసే దిశగా ముందుకు తీసుకెళ్ళామన్నారు. గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. మిగిలిన పంటకాలువల పనులను కూడా దశల వారీగా పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

పరిశ్రమలు, యువతకు ఉపాధే లక్ష్యం: ఆత్మకూరును వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగంలోను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం తెలిపారు. రూ.67 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కును పూర్తిచేశామని, పరిశ్రమలకు అవసరమైన నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 23 పరిశ్రమలు స్థలాలు కేటాయించుకున్నాయని, మరిన్ని భారీ పరిశ్రమలు వచ్చేదశలో ఉన్నాయన్నారు. భూముల ఆక్రమణలను తొలగించి కొత్త పరిశ్రమలకు భూములు అందజేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం: యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఆత్మకూరులో ప్రభుత్వ- ప్రవేటు భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు. గతంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలతోపాటు ఈ కేంద్రం ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామీణాభివృద్ధి, సాగునీరు, విద్య, ఆలయాల పునరుద్ధరణ, పరిశ్రమల ఏర్పాటు వంటి అనినన రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం ఎన్‌డిఎ కూటమి రెండేళ్ళపాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి ఆనం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును లబ్ధిదారులకు మంత్రి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తుల ఆభరణాలు నిజాయితీగా అప్పగింత

తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: భక్తులు పోగొట్టుకున్న విలువైన బంగారు ఆభరణాలను టిటిడి సిబ్బంది నిజాయితీతో తిరిగి అప్పగించిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. తిరుమలలో భక్తులు పోగొట్టుకున్న విలువైన బ్యాగ్‌ను గుర్తించి సిసిటివి పర్యవేక్షణతో వేగంగా స్పందించారు. టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి అందులోని నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను యథాతథంగా భక్తులకు భద్రంగా అప్పగించారు. తెలంగాణకు చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులు మేదరమిట్ట నుండి గోగర్భ డ్యాం సమీపంలోని మఠాలకు మహేంద్ర టాక్సీ జీప్‌లో ప్రయాణిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌ను వాహనంలోనే మరిచిపోయారు. విషయం గుర్తించిన వెంటనే టిటిడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేశారు.అధికారులు సిసిటివి ప్లేబ్యాక్ ఫుటేజీలను పరిశీలించి ప్రయాణించిన జీప్‌ను గుర్తించారు. అప్పటికే తిరుపతికి చేరుకున్న డ్రైవర్‌ను సంప్రదించి బ్యాగ్‌ను భద్రంగా స్వాధీనం చేసుకుని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భక్తుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి అందులోని విలువైన వస్తువులను ధృవీకరించి యథాతథంగా అప్పగించారు. టిటిడి భద్రతా విధానంపై భక్తుల ప్రశంసించారు.

హాకర్లపై దాడులు... 30 మంది బైండోవర్

తిరుమల, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో అనధికారికంగా భక్తులకు తిరునామం దరింపజేసి అందినకాడికి వసూలుచేస్తున్న అనదికార హాకర్లపై పోలీసులు దాడులు చేశారు. అనుమతులు, లైసెన్సు లేకుండా భక్తులకు నామాలు పెడుతూ, వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న 30 మందిని గుర్తించారు. వారిని తిరుమల నుంచి తిరుపతికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేసినట్లు తిరుమల పోలీసులు తెలిపారు. తిరుమలలో అనుమతులు లేకుండా నామాలు పెట్టడం, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అత్యవసర సేవల కోసం 112కు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణ ప్రైవేటుకు!

● అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నాం ● రూ.306.29 కోట్లతో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ● హార్బర్ ద్వారా 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్ష ప్రయోజనం ● వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ● మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి మెరుగుదలతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నెల్లూరు జిల్లాలో నిర్మితమవుతున్న జువ్వలదిన్నె మత్స్యకార హార్బర్ ఇందుకు ప్రత్యేక నిదర్శనమని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్థన్ రెడ్డి తెలిపారు. షిషింగ్ హార్బర్‌కు సంబంధించి కీలకమైన నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, పరిశుభ్రత, భద్రత, మానవ వనరుల వినియోగం, మౌలిక సదుపాయాల నిర్వహణను మరింత మెరుగుపరచడం కోసం ఆఫరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రతిపాదనలు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానంగా కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు వంటి వాటి నిర్వహణ ప్రస్తుతం ప్రభుత్వాల తలకు మించిన భారంగా మారుతున్న క్రమంలో, ఈ అంశంపై దేశంలో ఇతర రాష్ట్రాల్లో కూడా జరుగుతున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రవేట్ ఆఫరేటర్లు అత్యంత సమర్థవంతంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లను నిర్వహిస్తున్న ఉదంతాలు మనకు కనిపిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం మత్స్యకారులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ అందించేందుకు ఆఫరేషన్స్ మెయింటెనెన్స్ కింద ప్రవేట్ సంస్థల నుంచి టెండర్లు పిలవాలని నిర్ణయించడమైందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యధిక వార్షిక లైసెన్స్ ఫీజు కోట్ చేసిన సంస్థను ఆఫరేషన్స్ మెయింటెనెన్స్ కోసం ఎంపిక చేయడం జరుగుతుందని, అదే సమయంలో హార్బర్ భూమిపై ఎంపికైన సంస్థకు ఎటువంటి యాజమాన్య బదిలీ లేదా లీజు హక్కులు కల్పించబడవని మంత్రి స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆపరేటర్ ద్వారా హార్బర్‌లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, భద్రత అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించబడుతుందని మంత్రి తెలిపారు. బోట్ల నిలుపుదల నుంచి ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ వరకు అన్ని సదుపాయాలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా నిర్వహణ చేపట్టబడుతుందన్నారు. పారదర్శకమైన వేలం విధానం అమలు చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రభావం తగ్గి,

మత్స్యకారులకు వారి చేపలకు పోటీ ధరలు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు.. ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ సమర్థవంతంగా నిర్వహించడం వల్ల చేపల వేట అనంతర నష్టాలు గణనీయంగా తగ్గి, చేపల నాణ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా విశ్రాంతి గదులు, నెట్ మెండింగ్ షెడ్లు, ఇతర సౌకర్యాలన్నీ నిరంతరం నిర్వహించబడటం వల్ల మత్స్యకారులు మరింత సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన వాతావరణంలో తమ వృత్తిని కొనసాగించగలుగుతారని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం జువ్వలదిన్నె షిఫింగ్ హార్బర్‌ను ఆధునిక షిఫింగ్ సెంటర్‌గా అభివృద్ధి చేసి, మత్స్యకారుల ఆదాయం, జీవన ప్రమాణాలు, ఎగుమతి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ముఖ్యంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఇప్పటివరకు రూ. 306.29 కోట్ల వ్యయంతో 95.51శాతం భౌతిక పురోగతి సాధించిందన్నారు. హార్బర్‌లో మొత్తం 1,250 మత్స్యకార బోట్లకు నిలుపుదల సౌకర్యం కల్పించగా, ఇందులో 1,000 మోటరైజ్డ్ బోట్లు, 200 మెకనైజ్డ్ బోట్లు, 50 ట్యూనా లాంగ్‌లైనర్ బోట్లకు వసతి కల్పించే విధంగా రూపకల్పన చేశామన్నారు.

6100 మంది మత్స్యకారులకు ప్రయోజనం: ఈ హార్బర్ ద్వారా సుమారు 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుండగా, చేపల వ్యాపారులు, ఐస్ పరిశ్రమ కార్మికులు, రవాణా రంగం, అనుబంధ సేవల ద్వారా వేలాది మందికి పరోక్ష ఉపాధి లభించనున్నట్లు మంత్రి తెలిపారు. హార్బర్‌లో 835 మీటర్ల ఉత్తర బ్రేక్‌వాటర్, 620 మీటర్ల దక్షిణ బ్రేక్‌వాటర్, 10.50 లక్షల క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్, 909 మీటర్ల క్వేలు పూర్తయ్యాయి. అలాగే ఆధునిక ఆక్షన్ హాల్స్, ట్యూనా ప్యాకింగ్ హాల్, చేపల ఎండబెట్టే యార్డ్, 500 రోజి సామర్థ్యంతో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజ్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 9 గేర్ షెడ్లు, 4 నెట్ మెండింగ్ షెడ్లు, 3 విశ్రాంతి గదులు, కమ్యూనిటీ హాల్, రెస్టారెంట్‌డార్మిటరీ, గెస్ట్ హౌస్ నిర్మించారు. అదనంగా 53,695 చ.మీ. అంతర్గత రహదారులు, 33,938.73 చ.మీ. పార్కింగ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, రేడియో కమ్యూనికేషన్ టవర్, కోస్టల్ పోలీస్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.

సూపరింటెండెంట్ నుంచి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా జెకె కృష్ణశ్రీకి పదోన్నతి

● నూతన బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆర్‌జెడి పి. తిమ్మప్ప ఆకాంక్ష

విజయవాడ, జులై 6 ప్రభాతవార్త ప్రతినిధి: సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జేకే కృష్ణ శ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో)గా పదోన్నతి పొందిన సందర్భంగా జోన్2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పి. తిమ్మప్ప ఆమెను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సమాచార పౌరసంబంధాల సంచాలకుల కార్యాలయంలో కృష్ణశ్రీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జేడీ పి. తిమ్మప్ప మాట్లాడుతూ.. సూపరింటెండెంట్‌గా ఆమె ఇప్పటివరకు అందించిన సేవలను ప్రశంసించిన ఆర్జేడీ పి. తిమ్మప్ప, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.తన ఉద్యోగ బాధ్యతల్లో సూపరిండెంట్ గా కృష్ణశ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడం సంతోషకరం. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆర్జేడీ పి. తిమ్మప్ప అన్నారు.అభినందించిన వారిలో సీనియర్ అసిస్టెంట్లు డీవి సుబ్రహ్మణ్యం, ఉమర్ ఫరూక్, జూనియర్ అసిస్టెంట్లు వి. సునీత, రికార్డు అసిస్టెంట్ కృష్ణారావు, ఆఫీసు సబార్డినేట్లు చిన వెంకటేశ్వర రావు, భానుమతి, తదితర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారి పెళ్లి కూతురు

- టెన్త్ విద్యార్థినికి వివాహం
- మెడలో తాళి, కాళ్లలో మెట్టెలతో స్కూల్ కు హాజరు
- వారం కిందట పెళ్లి
- ఆలస్యంగా వెలుగులోకి
- అయినా స్పందించని జిల్లా విద్యా, ఐసిడిఎస్ అధికారులు

అనంతపురం (క్రైమ్), జులై 6 ప్రభాతవార్త: పట్టుమని పదిహేనేళ్ల లేవు. చదువుకునేందుకు పదో తరగతిలోకి అడుగుపెట్టిందో.. లేదో.. అప్పుడే పెళ్లి పీటలెక్కింది ఓ పదో తరగతి విద్యార్థిని. మెడలో తాళిబొట్టు, కాళ్ళల్లో మెట్టెలతో తరగతులకు హాజరు కావడం సంచలనంగా మారింది. ఈ ఘటన అనంతపురం జిల్లా కర్ణాటక సరిహద్దుల్లోని ఓ రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థిని కావడం గమనార్హం. వారం రోజుల కిందట పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. పెళ్ళయ్యాక బాలిక చదువుపై మక్కువతో మళ్ళీ తరగతులకు హాజరవుతుండడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే ఈ విషయం ఇంతవరకు జిల్లా విద్యాశాఖ ఇంచార్జ్ అధికారి, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

దుర్గమ్మ హుండీల ద్వారా రూ.3.39కోట్ల ఆదాయం

ఇంద్రకీలాద్రి, జులై 6 ప్రభాతవార్త: దుర్గమ్మ ఆలయంలో సోమవారం జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రు.3కోట్ల 39లక్షల 53వేల 599ల నగదు, 576 యుఎస్ఎ డాలర్స్, 100 ఆస్ట్రేలియన్ డాలర్స్, 22 మలేషియన్ రింగేట్స్, యుఎఇ దిర్హమ్స్ 295, సింగపూర్ డాలర్లు 13, యూరోలు 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, సౌదీ రియాల్స్ 20, కెనడా డాలర్లు 75, నైజీరియా నైరాలు 1500, సౌతాఫ్రికా ర్యాండ్స్ 70, ఒమన్ రియాల్స్ 50, కంబోడియన్ రియాల్స్ 800, కతార్ రియాల్స్ 7, దారుసలేం డాలర్స్ 2, టాంజానియా షిల్లాంగ్స్ 30,000, కెన్యా షిల్లాంగ్స్ 200, కొరియన్ వన్ 850, భూటాన్ న్యూల్‌ట్రుం 1, హాంకాంగ్ డాలర్స్ 160, బంగ్లాదేశ్ టాకాలు 20, కువైట్ దినార్లు 0.5, కొలంబియన్ మిల్ పెసోస్ 2, టర్కి లిరాలు 10 ఫిలిప్పైన్స్ పిసోలు 100, థాయ్‌లాండ్ బాత్‌లు 80, చైనా యువాన్లు 51, పాకిస్తాన్ రుపిలు 500, యుగోస్లోవియా దినార్లు 500 లతో పాటు పాత ఇండియన్ కరెన్సీ నగదు 2వేల నోట్లు 5, వెయ్యి నోట్లు 9, 500 నోట్లు 74 లభించాయని ఇఒ శీనా నాయక్ తెలిపారు.

దుర్గమ్మ భక్తుల విరాళాలు: నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అదృష్టార్ రత్నాలయం జ్యులరీస్ యాజమాని గుడివాడ రమణలాల్ రు.1,00,016ల విరాళం అందించారు. అదేదాత రు.1,00,016లను ఉచిత ప్రసాద పంపిణీ పథకానికి రుచర్మ పేరిట అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

● ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ పంపి డబ్బులు చెల్లించాలని ఫోన్లు చేస్తారు ● చిత్తూరు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త: దోచుకోవడానికి కాదేది అనర్హం కావడంతో సైబర్ నేరగాళ్ళ దృష్టి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నులు చెల్లించే వారిపై పడింది. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ మేరకు ఆస్తి, ట్రేడ్ లైసెన్స్ పన్నులను మీరు చెల్లించాల్సి వుందని, తాము ఫోన్ ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపుతున్నామని, తాము పంపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని ఇందుకు సంబంధించి రసీదును డబ్బులు చెల్లించిన వెంటనే ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురికి సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఫోన్ చేసి పన్నులు చెల్లించాల్సిందిగా కోరడం ఏమిటని ఒకరిద్దరు ఈ విషయంను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో కమీషనర్ అప్రమత్తం అయ్యారు. సైబర్ నేరగాళ్ళు మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల పేరిట చిత్తూరు నగర ప్రజల నుండి దోపిడి చేయడానికి పక్కా ప్రణాళికతో ఈ విధంగా పన్ను చెల్లింపుదారులకు ఫోన్లు చేస్తున్నారని కమీషనర్ గుర్తించారు. పన్నులు చెల్లించాలని ఫోన్ చేసే సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమీషనర్ ప్రజలను హెచ్చరించారు. ఇంటి, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సుల పన్నులు చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తుల నుండి పలువురికి ఫోన్‌కాల్స్ వస్తున్నాయనే విషయం తమ దృష్టికి వచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నుల మొత్తంను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తాము పంపే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పన్నులు చెల్లించమని కమీషనర్ గాని, ఇతర అధికారులు కాని ఎవరికి నేరుగా ఫోన్ చేయరని, అలాగే ఫోన్‌పే, గూగుల్‌పే స్కానర్‌కు డబ్బులు పంపమనే చెప్పే అవకాశం లేదన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంతమంది ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సైబర్ నేరగాళ్ళు 919440 219722 నెంబర్ నుండి ఫోన్ చేసి తాము మున్సిపల్ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామని, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పన్నులు చెల్లించాలని అడుతున్నారన్నారు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై ప్రజలు స్పందించవద్దని, డబ్బులు చెల్లించవద్దని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, పన్ను చెల్లింపుదారులకు ఎద్దైనా సందేహాలు వుంటే నేరుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు

● ఉనికి కోసం వైకాపా విమర్శలు ● ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు ధ్వజం

చిత్తూరు, జులై 6 ప్రభాతవార్త: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మామిడి రైతును ఆదుకోవడానికి పటిష్ట చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా మామిడి రైతుకు కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి దన్నుగా నిలిచి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. చిత్తూరులోని ఎంపి కార్యాలయంలో సోమ వారం దగ్గుమళ్ళ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. రైతు సంక్షేమం కోసం పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా తన ఉనికిని కాపాడుకోవడం కోసం విమర్శలు చేస్తోందన్నారు. మామిడి రైతుల కష్టాలను గుర్తించి ముందు చూపుతో కేజీకి రూ.4 సబ్సిడీ ప్రకటించి మామిడి రైతుకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ అన్నారు. రైతు పక్షపాతిగా మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరూపించారని, ఇది సిఎం పాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను చూడలేక వైకాపా నేతలు నిరసనల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వం రూ.281 కోట్ల ఆర్థిక సహాయంను అందించాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారని ఎంపి గుర్తు చేశారు. దీనికి కేంద్ర వ్యవసాయ శాఖ స్పందించి తోతాపురి మామిడి ధరలు పడిపోవడానికి గల కారణాలను గుర్తించి, ఆదాయంను పెంచే మార్గాలను అన్వేషించడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిఏఆర్ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింద న్నారు. ఈ పరిస్థితుల్లో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడం విడ్డూరంగా వుందన్నారు. మామిడి రైతును వైకాపా ప్రభుత్వం గతంలో ఐదేళ్ళ పాటు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు దేశం కార్యదర్శి అశోక్‌కుమార్, ఎపి మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య ట్రస్ట్‌కు కొత్త జనరల్ సెక్రటరీ?

చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం

అయోధ్య,జులై 6: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ రాజీనామాను ట్రస్ట్ ఆమోదించింది. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో నెలకొన్న వివాదం మధ్య ఆయన తన పదవికి రాజీనామా చేశారు. చంపత్ రాయ్ వారసుడిగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బాగ్రా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. చార్టర్డ్ అకౌంటెంట్‌గా, ప్రభుత్వ రంగ సంస్థ నాల్కో మాజీ అధిపతిగా పనిచేసిన బాగ్రాకు పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో విశేష అనుభవం ఉందని, ట్రస్ట్ కార్యకలాపాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు ఆయన సేవలు ఉపయోగపడతాయని వర్గాలు భావిస్తున్నాయి. ట్రస్ట్ తదుపరి దశలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో పరిపాలన, ఆర్థిక నిర్వహణ, సంస్థాగత పాలనపై పట్టు ఉన్న వ్యక్తిని బాధ్యతల్లోకి తీసుకురావాలన్న ఆలోచనతో ట్రస్ట్ ఉన్నట్లు సమాచారం. అయితే చంపత్ రాయ్ మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటే తప్ప ట్రస్టీగా కొనసాగనున్నారని తెలుస్తోంది. కొత్త జనరల్ సెక్రటరీ పేరును వెంటనే ప్రకటించే అవకాశం లేదని సమాచారం. ఈనెల 19, 20 తేదీల్లో ఢిల్లీలో జరిగే వీహెచ్‌పీ ద్వైవార్షిక జాతీయ కార్యవర్గ సమావేశంలో సంస్థాగత మార్పులు, బదిలీలతో పాటు ఈ అంశంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రామ మందిర విరాళాల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కఠిన వైఖరి అవలంబించగా, దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అనంతరం చంపత్ రాయ్‌తో పాటు ట్రస్టీ అనిల్ మిశ్రా తమ రాజీనామాలను సమర్పించారు. ఎస్ఐటీ ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆలయానికి వచ్చిన నగదు విరాళాలను లెక్కించే బాధ్యతలో ఉన్న సిబ్బంది, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఫుటేజీని క్రమం తప్పకుండా పరిశీలించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నగదును అపహరించినట్లు వెల్లడైంది. ఈ ఘటనలో సుమారు రూ.7 నుంచి రూ.7.5 కోట్ల వరకు నగదు గల్లంతైనట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ రామ్ శంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ కూడా ఉన్నాడు. టిన్నూ యాదవ్ తనపై ఉంచిన నమ్మకాన్ని దుర్వినియోగం చేసి ఈ మోసానికి పాల్పడ్డాడని చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్లు వర్గాలు వెల్లడించాయి. పట్టుబడే పరిస్థితి వచ్చినప్పుడు టిన్నూ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఓ నేతకు సమాచారం లీక్ చేశాడని కూడా సమాచారం. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ఇతర నిందితుల్లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ ఉన్నారు. ఇప్పటివరకు చంపత్ రాయ్, మిశ్రా, ప్రత్యేక ఆహ్వానితుడు గోపాల్ రావుపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే వీరిపైనా కేసు నమోదు చేయాలని కోరుతూ ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన అయోధ్య న్యాయవాదులు పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.

పహల్గామ్ ఉగ్రదాడి కేసు

నిందితుడు హాఫీజ్ సయీదే!

అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఎ

నిందితుల జాబితాలో టిఆర్ఎఫ్ సంస్థ పేరు

న్యూఢిల్లీ, జులై 6: పహల్గామ్ ఉగ్రదాడి కేసులో తాజాగా, పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోమవారం అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. సోమవారం జమ్ములోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఈ కొత్త ఛార్జిషీట్‌లో, సయీద్, అతని అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్ఎఫ్) పేర్లను చేర్చారు. ఈ టిఆర్ఎఫ్ సంస్థ కాశ్మీర్‌లో ఎల్ఇటికి కార్యాచరణ విభాగంగా పనిచేస్తోంది. జమ్ములోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో, ఉగ్రవాద నిరోధక సంస్థ హాఫీజ్ సయీద్‌పై అతని 'వ్యక్తిగత హోదాలో', లష్కరేతోయిబా (ఎల్ఇటి), టిఆర్ఎఫ్ అధిపతిగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967 లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, సరిహద్దు దాటి కుట్ర పన్నడం వంటి ఆరోపణలపై కూడా ఎన్ఐఎ తన ఛార్జిషీట్‌లో హాఫీజ్ సయీద్‌పై శిక్షాస్మృతి సెక్షన్‌ను ప్రయోగించింది. డిసెంబర్ 15, 2025న దాఖలు చేసిన తన మునుపటి ఛార్జిషీట్‌లో, ఎన్ఐఎ పాకిస్తానీ ఉగ్రవాది సారథి సాజిద్ జట్‌తో పాటు, జులై 2025లో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో భద్రతా దళాల చేతిలో హతమైన ముగ్గురు ఉగ్రవాదులు, అలాగే అరెస్టు చేయబడిన ఇద్దరు నిందితులను నిందితుడిగా చేర్చింది. పహల్గామ్ ఉగ్రదాడిని ప్రణాళిక చేయడం, సులభతరం చేయడం, అమలు చేయడంలో నిషేధిత ఎల్ఇటి/టిఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ పాత్రకు గాను, దానిని ఒక చట్టబద్ధమైన సంస్థగా కూడా పరిగణించి అభియోగాలు మోపింది.

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

ఆరుగురు ఉగ్రవాదులు అరెస్టు, తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలు స్వాధీనం

న్యూఢిల్లీ, జులై 6: పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు మాడ్యూళ్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల ఫలితంగా భట్టితో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఒక ఉగ్రవాద మాడ్యూల్‌తో పాటు అక్రమ ఆయుధాల రవాణా నెట్‌వర్క్‌ను కూడా ఛేదించారు. ఈ మూడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అనంతరం ఈ ఆపరేషన్ చేపట్టారు. అరెస్టు అయిన ఆరుగురు నిందితులు ఈ నెట్‌వర్క్‌లో భాగమని, కుట్ర పూర్తి స్థాయిని నిర్ధారించడానికి, ఈ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి వారిని విచారిస్తున్నామని అధికారులు తెలిపారు. దాడుల సమయంలో, ఈ నెట్‌వర్క్‌లోని సభ్యులు ఉపయోగించినట్లు ఆరోపించబడిన అనేక తుపాకులు, పెట్రోల్ బాంబులు, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రాంచీ ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై దాడిలో బాంబులు వాడారు: రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఇటీవల జరిగిన దాడిలో పెట్రోల్ బాంబులను కూడా ఉపయోగించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆ ఘటనకు, షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపించబడిన నెట్‌వర్క్‌కు మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయేమో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తారని పోలీసులు తెలిపారు. అయితే, అటువంటి సంబంధం ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఢిల్లీ పోలీసుల ప్రకారం, దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఆరోపించబడిన ఉగ్రవాద, ఆయుధ సరఫరా మాడ్యూళ్ల గురించి మరింత సమాచారం సేకరించడానికి నిందితులను విచారిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని అరెస్టులు, స్వాధీనాలు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నీరవ్ మోడీ అప్పగింతకు లైన్‌క్లియర్

అంతర్జాతీయ కోర్టులోనూ లభించని ఊరట

లండన్, జూలై 6: పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఇసిహెచ్ఆర్) నుండి ఉపశమనం పొందేందుకు చేసిన విఫల ప్రయత్నంతో సహా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో తనకున్న అన్ని చట్టపరమైన మార్గాలను వినియోగించుకున్న తర్వాత, భారతదేశానికి అప్పగించబడే అవకాశం ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, యుకె కోర్టులలో అప్పీళ్లను వినియోగించుకున్న తర్వాత మోడీ ఏప్రిల్‌లో ఇసిహెచ్ఆర్‌ను ఆశ్రయించారు. యూరోపియన్ కోర్టు ఆయనకు ఉపశమనం కల్పించలేదని, దీంతో ఆయన అప్పగింతను సవాలు చేయడానికి తదుపరి చట్టపరమైన మార్గాలు ఏవీ మిగల్లేదని వర్గాలు తెలిపాయి. చట్టపరమైన ప్రక్రియ వాస్తవంగా పూర్తవడంతో, మోడీని భారత అధికారులకు అప్పగించడానికి అవసరమైన పరిపాలనా లాంఛనాలను యుకె ప్రభుత్వం ప్రారంభించినట్లు సమాచారం. ఈ అప్పగింత ఇప్పుడు ఎప్పుడైనా జరగవచ్చని దౌత్య వర్గాలు సూచించాయి. 2019 మార్చి నుంచి లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైల్లో నిర్బంధంలో ఉన్న నీరవ్ మోడీ, తనను భారత్‌కు అప్పగిస్తే అక్కడ తనకు హింస ఎదురవుతుందని వాదిస్తూ పలు అప్పీళ్లు దాఖలు చేశారు. అయితే ఈ వాదనలను భారత్ తరఫున సిబిఐ, ఇడి అధికారులు బలమైన ఆధారాలతో ఖండించినట్లు సమాచారం. పిఎన్‌బి మోసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీని స్వదేశానికి తీసుకురావడం భారత్ దర్యాప్తు సంస్థలకు పెద్ద విజయంగా భావిస్తున్నారు. మోడీ భారతదేశంలో పిఎన్‌బి మోసం కేసు, మనీలాండరింగ్ దర్యాప్తు, సాక్ష్యాలను ధ్వంసం చేయడం, సాక్షులను ప్రభావితం చేశారనే ఆరోపణలతో కూడిన మరో కేసుతో సహా మూడు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

అబార్షన్‌పై నిర్ణయం తల్లిదే

విడిపోయిన భర్త అనుమతి అనవసరం

మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

ఇండోర్, జులై 6: వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి చట్టం, 1971 ప్రకారం, విడిపోయిన భర్త సమ్మతి లేకుండానే తన 13 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి ఒక మహిళకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. హైకోర్టు ఇండోర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్ భట్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ఆ మహిళ తన భర్త నుండి విడిగా నివసిస్తోందని, వైవాహిక సంబంధాన్ని కొనసాగించడానికి ఇష్టపడటం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆమెకు పునరుత్పత్తి స్వేచ్ఛ హక్కు ఉంది. అందువల్ల, ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడానికి అనుమతివ్వాలని పేర్కొంది. గర్భంకొనసాగించాలా?లేదా అబార్షన్ చేయించుకోవాలా? అన్నది తల్లి నిర్ణయం ప్రధానమని వ్యాఖ్యానించింది. భర్తనుంచి దూరంగా ఉంటున్నందున అతని అనుమతి అవసరంలేదని పేర్కొంది. వారు మొదట విడాకుల విషయంలో ఒక అంగీకారానికి వచ్చినప్పటికీ, ఆ తర్వాత భర్త వెనక్కి తగ్గడంతో, స్థానిక కోర్టు అతనికి నోటీసు జారీ చేసింది. అయితే, అతను కోర్టు ముందు హాజరు కాలేదు. ఆ తర్వాత భార్య, తాను 13 వారాల గర్భవతి అని కోర్టుకు తెలియజేస్తూ, అబార్షన్‌కు అనుమతి కోరుతూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్‌ను ఆశ్రయించింది. అయితే, భర్త తరఫున కోర్టులో ఎవరూ హాజరు కాలేదు. ఆమె వాదనలన్నీ విన్న తర్వాత, కోర్టు అబార్షన్‌కు అనుమతి మంజూరు చేసింది.

11న భారత్ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మహేంద్రగిరి

న్యూఢిల్లీ, జులై 6: భారత నౌకాదళం మరో అత్యాధునిక యుద్ధ నౌకను తన బలగాల్లోకి చేర్చుకోనుంది. స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన ప్రాజెక్ట్17ఏకు చెందిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ మహేంద్రగిరిని ఈ నెల 11న విశాఖపట్నంలో అధికారికంగా కమిషన్ చేయనున్నారు. ఎఫ్38 పెన్నెంట్ నంబర్ కలిగిన ఈ యుద్ధ నౌకను భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపకల్పన చేయగా, ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత శ్రేణి పేరును ఈ యుద్ధనౌకకు పెట్టారు. ఈ పేరుతో భారత నౌకాదళంలో చేరుతున్న తొలి యుద్ధనౌక ఇదే కావడం విశేషం. స్వదేశీ రూపకల్పన, స్వదేశీ నిర్మాణంతో ఆధునిక యుద్ధనౌకలను అభివృద్ధి చేసే భారత నౌకాదళ లక్ష్యంలో ఇది మరో మైలురాయిగా భావిస్తున్నారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి నీలగిరి క్లాస్ లేదా ప్రాజెక్ట్17ఏలో భాగంగా నిర్మితమైంది. ఇప్పటికే సేవలందిస్తున్న శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్‌లకు మరింత ఆధునిక రూపంగా వీటిని రూపొందించారు. రాడార్‌కు సులభంగా కనిపించకుండా ఉండే స్టెల్త్ సాంకేతికత, తక్కువ ఇన్‌ఫ్రారెడ్ ఉద్గారాలు వంటి ప్రత్యేకతలతో ఈ యుద్ధనౌకను అభివృద్ధి చేశారు. శత్రు రాడార్లు, క్షిపణుల గుర్తింపును తప్పించుకునే సామర్థ్యం మరింత పెరుగుతుంది.

రాజ్యసభ మూడు స్థానాలకు నోటిఫికేషన్

కోల్‌కత్తా,జులై 6: పశ్చిమ బెంగాల్ లో అధికార మార్పిడి అనంతరం అనేక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీకి ముఖ్యమంత్రి సువేందు అధికారి సారథ్యంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంవరుస షాకులిస్తోంది. ఇప్పటికే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. వ్యతిరేకంగా ప్రచారం చేసిన సెలెబ్రెటీలను కూడా వదలట్లేదు. కేసులు నమోదవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య పశ్చిమ బెంగాల్ లో మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల తేదీలను ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణంలో పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. రాత్రికి ఫలితాలు వెల్లడవుతాయి. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు సభ్యులు తమ పదవీ కాలం ముగియక ముందే రాజీనామాలు చేయడం వల్ల ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. కిందటి నెల 8న సుఖేందు శేఖర్ రాయ్, 10న సుస్మితా దేవ్, 11న ప్రకాష్ చిక్ బరాక్ తమ సభ్యత్వాలకు రాజీనామాలు సమర్పించారు. అవి ఆమోదం పొందాయి. ఈ ఎన్నికల ద్వారా నూతనంగా ఎంపికయ్యే ఎంపీలు 2029 ఆగస్టు, 2030 ఏప్రిల్ వరకు సభ్యులుగా కొనసాగుతారు. పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7 మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్లను దాఖలు చేయడానికి చివరి తేదీ 14. 15 నాటికి నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి 17వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. 24 పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కిస్తారు. 27వ తేదీ నాటికి ఉప ఎన్నికల ప్రక్రియ మొత్తం కూడా పూర్తవుతుంది. ఉప ఎన్నికలను ఎటువంటి వివాదాలు లేకుండా, అత్యంత పారదర్శక పద్ధతిలో నిర్వహించడానికి, పోలింగ్ పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక పర్యవేక్షక బృందాలను రంగంలోకి దించనుంది. నిష్పక్షపాత వాతావరణంలో ఈ కీలక ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా సరిపోవు భద్రతా సిబ్బంది, ప్రత్యేక పరిశీలకులను నియమిస్తున్నట్లు అండర్ సెక్రటరీ రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

ఢిల్లీలో నవవధువు మృతి కలకలం..

భర్త అరెస్ట్.. కట్న వేధింపుల కేసు నమోదు

న్యూఢిల్లీ, జులై 6: నవవధువు అనుమానాస్పద మృతి కేసు సంచలనంగా మారింది. పెళ్లై కేవలం 72 రోజులకే 28 ఏళ్ల అకృతి సుతార్ మృతి చెందడంతో పోలీసులు కట్న వేధింపుల కేసు నమోదు చేసి ఆమె భర్త అరస్తు సిక్కాను అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఢిల్లీలోని లోధీ కాలనీ ప్రాంతంలోని పాలికా కుంజ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ హత్య కలకలం రేపింది. అపార్ట్‌మెంట్ భవనం పై అంతస్తు నుంచి కిందపడిన స్థితిలో అకృతి తీవ్రగాయాలతో కనిపించింది. వెంటనే ఆమెను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.అకృతి తల్లి అను సాయ్ సుతార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కుమార్తెను భర్త అరస్తు సిక్కా, అత్తింటి కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపించారు. అకృతి ఈ ఏడాది ఏప్రిల్ 24న తన చిన్ననాటి స్నేహితురాలు అగస్టికా సోదరుడు అరస్తు సిక్కాను ప్రేమపెళ్లి చేసుకుంది. ఛత్తర్‌పూర్‌లోని ఓ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అకృతి, పెళ్లి తర్వాత కూడా ఉద్యోగం కొనసాగిస్తానని పెళ్లికి ముందే స్పష్టంగా చెప్పిందని ఆమె తల్లి తెలిపారు. ఆ షరతుకు అత్తింటి వారు అంగీకరించిన తర్వాతే వివాహానికి ఒప్పుకున్నామని వెల్లడించారు. పెళ్లి అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆమె ఆరోపించారు. ఉద్యోగం మానేయాలని, త్వరగా గర్భం దాల్చాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చారని, ఇంటి పనులతో ఇబ్బంది పెట్టి ఉద్యోగాన్ని వదిలేయాలనే పరిస్థితి సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లితో ఫోన్‌లో మాట్లాడినా, పుట్టింటికి వెళ్లినా అవమానించేవారని, మానసికంగా, శారీరకంగా వేధించేవారని ఆమె తెలిపారు.జూన్ 17న ఫోన్ సైలెంట్‌లో ఉండటంతో కాల్ అందుకోలేదనే కారణంగా భర్త బెల్ట్‌తో కొట్టాడని అకృతి తనకు చెప్పిందని తల్లి వెల్లడించారు. మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ భర్త తరచూ అనుమానాలు వ్యక్తం చేసేవాడని ఆరోపించారు. జూన్ 29న తనను చంపే అవకాశం ఉందని అకృతి భయపడుతూ ఫోన్‌లో చెప్పిందని తల్లి పేర్కొన్నారు. అదే రోజు తాను వండిన భోజనం వేడి చేయలేదనే కారణంతో మరోసారి భర్త దాడి చేశాడని ఆరోపించారు.ఆ తర్వాత అకృతి తన స్నేహితురాలు, మరదలు అయిన అగస్టికా ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని, అక్కడికి వచ్చిన అరస్తు మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు సర్దిచెప్పి ఇద్దరినీ ఇంటికి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆర్మీ ట్రయల్స్‌పరీక్షల్లో ఉగ్రమ్ రైఫిల్ సక్సెస్

హైదరాబాద్ స్టార్టప్ డ్విపా డిఫెన్స్ రైఫిల్‌కు రక్షణ కొనుగోళ్లు

న్యూఢిల్లీ,జులై 6: రక్షణ తయారీ సంస్థ డ్విపా డిఫెన్స్ దేశీయ రక్షణ తయారీలో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ అభివృద్ధి చేసిన ఉగ్రం 7.6251 మి.మీ. బ్యాటిల్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కీలక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ రైఫిల్‌ను పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది డీఆర్‌డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కలిసి ఈ రైఫిల్‌ను అభివృద్ధి చేశారు. కేవలం 100రోజుల్లోనే దీని రూపకల్పన, తయారీ పూర్తి కావడం విశేషం. ఇది దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చేసిన స్వదేశీ ఆయుధ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. డ్విపా డిఫెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిబు జోసెఫ్ మాట్లాడుతూ 2021లోసంస్థకు తయారీ లైసెన్స్ లభించిందని, తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 13 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో హైదరాబాద్‌లో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2021లో ప్రారంభమైన తమ ప్రయాణంలో ఇప్పటివరకు 100కు పైగా స్వదేశీ ఆయుధ వ్యవస్థలు, వాటి వేరియంట్లు అభివృద్ధి చేశామని, అందులో ఉగ్రామ్‌తమ ప్రధాన ఉత్పత్తిగా నిలిచిందని సిబు జోసెఫ్ పేర్కొన్నారు. భారత భద్రతా బలగాల కోసం ప్రపంచ స్థాయి రక్షణ ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఉగ్రామ్ రైఫిల్ విశ్వసనీయత, మన్నికకు సంబంధించిన విస్తృత పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసింది. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ కోసం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది.

గ్యాస్ ఆపరేటెడ్ రొటేటింగ్ బోల్ట్ వ్యవస్థతో రూపొందించిన ఈ రైఫిల్ బరువు నాలుగు కిలోల కంటే తక్కువ. దీని ప్రభావవం తమైన కాల్పుల పరిధి 500 మీటర్లు.డ్విపా డిఫెన్స్ ప్రస్తుతం అసాల్ట్ రైఫిళ్లు, కార్బైన్లు, సబ్ మెషిన్ గన్స్, అల్ట్రా లైట్ మెషిన్ గన్స్, యాంటీ డ్రోన్ వ్యవస్థలతో కూడిన స్వదేశీ ఆయుధాల శ్రేణిని కూడా అభివృద్ధి చేస్తోంది. ఆర్మీ ట్రయల్స్ విజయవంతంగాపూర్తికావడం, కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కావడంతో స్వదేశీ రక్షణ తయారీ కేంద్రంగా హైదరాబాద్ మరింత బలోపేతం అవుతుందని సంస్థ భావిస్తోంది.

9న ఆఖరి కార్యాచరణ: పాకిస్థాన్‌కు పిఒకె నేతల తుది హెచ్చరిక

ముజఫరాబాద్, జులై 6: పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకాశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) పాక్ సర్కారుకు అల్టిమేటమ్ ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పిఒకె ప్రజలు, ప్రవాస కాశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పిఒకెలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్రమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జెఎఎసి అభ్యర్థించింది. నిరసనల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జెఎఎసి డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమ కు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరో సారి హెచ్చరించింది.

భారత్ సహాయం కావాలి: కాగా.. జెఎఎసి నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓవిడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.' మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరతఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్లుగా ఆవిడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్ ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిందని అందులో ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

అణ్వస్త్రరహిత ప్రాంతంలో చైనా బాలిస్టిక్ క్షిపణి పరీక్ష

బీజింగ్, జులై 6: దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని అణ్వస్త్ర రహిత మండలంలో అణుశక్తి జలాంతర్గామి నుంచి చైనా దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని సోమవారం పరీక్షించింది. ఈ ప్రయోగం పలు ప్రాంతీయ దేశాల్లో ఆందోళనకు దారితీసింది. దీనిపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే, ఈ ప్రయోగం సైనిక వార్షిక శిక్షణలో భాగమే నని చైనా తెలిపింది. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే నిర్వహించామని, ఏ దేశాన్ని లేదా లక్ష్యాన్ని ఉద్దేశించి చేయలేదని పేర్కొంది. అందులో నిజమైన అణు వార్‌హెడ్‌కు బదులుగా డమ్మీ వార్‌హెడ్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఇదే తరహా పరీక్షను రెండేళ్ల కిందట కూడా నిర్వహించినట్లు చైనా తెలిపింది.

కీవ్‌పై రష్యా భారీ డ్రోన్ దాడి

కీవ్, జులై 6: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా భీకర దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో మాస్కో విరుచుకుపడటంతో అనేక భవనాలు ధ్వంసమయ్యాయని, 12 మంది ప్రాణాలు కోల్పోయారని కీవ్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నాటో శిఖరాగ్ర సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ కానున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. కీవ్‌లోని సైనిక–పారిశ్రామిక సౌకర్యాలు, ఇంధన, శక్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

తేజ్‌ప్రతాప్ పార్టీనుంచి వీణామాన్వీ బంకిపూర్ నుంచి పోటీ

పాట్నా,జులై 6: బీహార్‌లో బంకిపూర్ ఉప ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్ శక్తి జనతా దళ్ కూడా బరిలో దిగింది. సామాజిక కార్యకర్త వీణా మాన్వీని తమ అభ్యర్థిగా ప్రకటించింది. తేజ్ ప్రతాప్ యాదవ్ తన పార్టీ ఫారమ్‌ను ఆమెకు అధికారికంగా అందజేశారు. అనంతరం వీణా మాన్వీ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలియజేశారు. బంకిపూర్ ప్రజల గొంతుకగా నిలుస్తానని, పార్టీ అంచనాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

శ్రీలంక జైలులో రక్తపాతం..మృతుల సంఖ్య 25కు పెరుగుదల

కొలంబో, జులై 6: శ్రీలంక పశ్చిమ తీరంలోని నెగోంబో జైలులో జరిగిన ఘర్షణలు తీవ్ర విషాదానికి దారితీశాయి. ఖైదీల మధ్య చెలరేగిన హింసలో మృతుల సంఖ్య 25కు చేరింది. ఈ విషయాన్ని సోమవారం అక్కడి అధికారులు అధికారికంగా వెల్లడించారు. రెండు ప్రత్యర్థి ఖైదీ వర్గాల మధ్య ప్రారంభమైన ఘర్షణలు క్రమంగా హింసాత్మకంగా మారాయి. సోమవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగింది. కొందరు ఖైదీలు జైల్లోని ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో భద్రతా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 19 మంది మృతి చెందగా, వంద మందికిపైగా గాయపడ్డారు.

మోహన్‌లాల్‌ను వెంటాడుతున్న ఏనుగుదంతాల కేసు

తిరువనంతపురం,జులై 6: మలయాళ సూపర్ స్టార్, పద్మభూషణ్ మోహన్‌లాల్‌ను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ఏనుగుదంతాల అక్రమనిల్వ కేసు కేరళ హైకోర్టులో కొత్త మలుపు తిరిగింది. గతంలో ఆయన ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన వాలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందుకు వచ్చింది.ఆ పత్రాల ప్రకారం మోహన్‌లాల్ వద్ద కేవలం నాలుగు మాత్రమే కాకుండా, మొత్తం 10 ఏనుగు దంతాలతోపాటు దంతాలతో చేసిన మరో 1 కళాఖండాలు ఉన్నాయి. 2011 జూన్ నెలలో మోహన్‌లాల్‌కు చెందిన ఇళ్లు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొచ్చిలోని సొంత నివాసంలో నాలుగు ఏనుగు దంతాలు దొరికాయి.

దలైలామాకు ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,జులై 6: ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా 91వ పుట్టిన రోజును పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రపంచ శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.

ఎమ్మెల్సీ సీటుపై తమ్ముళ్ల గంపెడాశలు!

• త్వరలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో 2 స్థానాలు భర్తీ • పార్టీ అధిష్టానానికి దరఖాస్తు • అగ్రనేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు

విజయవాడ, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: శాసన మండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ సీట్ల కోసం టిడిపి నేతలు పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో వివిధ పదవులకు పోటీ భంగపడిన నేతలు ఈ పర్యాయం అధిష్టానం తమను కరుణిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. శాసనమండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో 2 స్థానాలు ఈ నెల 28తో ఖాళీ అవుతున్నాయి. మండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం, వైసిపి ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుంది. ఇందులో ఒకటి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు ఖాయం అంటున్నారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. దీనితో సీనియర్ అయిన ఆయనకు కనీసం ఎమ్మెల్సీ పదవి అయినా ఇవ్వడం ధర్మం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిసింది. 2027 జూన్ నెలలో మరో 23 స్థానాలు ఖాళీ అవుతాయి. అప్పుడు రామయ్యకు శాసన మండలి చైర్మన్ పదవి ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. లేదా మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశం ఉందంటున్నారు. 4 రాజ్యసభ స్థానాల్లో రెండు కమ్మ, బలిజ, బీసి వర్గాలకు ఒక్కొటి ఇచ్చారు. ఎస్సీలకు ఒక అవకాశం ఇవ్వలేదు. అలాగే రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఎస్సీ నుంచి రామయ్యకు, రాయలసీమ నుంచి ఒక రెడ్డికి అవకాశం కల్పించవచ్చు అనుకుంటున్నారు. తిరుపతికి చెందిన టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి సుధాకర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారని తెలిసింది. సైకాలజిస్ట్‌గా పేరున్న ఆయన 2020 నుంచి గత ఏప్రిల్ వరకు అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్.కె రోజా, కె.నారాయణస్వామి తదితరులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ కూడా అయిన తనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కడప నుంచి మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఆయన రాజ్యసభ సీటు ఆశించి విఫలం అయ్యారు. ఆయన భార్య మాధవీ రెడ్డి కడప ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీలో సీనియర్ నేతలు, గత ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికి, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో చాలా మంది నాయకులు పోటీ పడుతున్నారు. దేవినేని ఉమా మహేశ్వర రావు, టిడి జనార్దన్, పీతల సుజాత, జవహర్, కెఇ ప్రభాకర్, పిఠాపురం నుంచి ఎస్వీఎస్ఎన్ వర్మ, వర్ధ్వూరు నుంచి ఏలూరి సాంబశివరావు, వంగవీటి రాధా, బుద్దా వెంకన్న, కొమ్మాలపాటి శ్రీధర్ దువ్వారపు రామారావు, మోపిదేవి వెంకటరమణ రేసులో ఉన్నారు.

ఎపి సిఆర్‌డిఎ అధికారిక వెబ్‌సైట్‌లో యూనిట్ ఆఫీసుల వద్ద వార్షిక కౌలు వివరాలు

విజయవాడ, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి నిర్మాణానికై భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతుల సౌకర్యార్థం, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపి సిఆర్‌డిఎ) కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులకు అందించే వార్షిక కౌలు చెల్లింపుల స్థితిగతులను పారదర్శకంగా తెలియజేసే ఉద్దేశంతో పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరించింది. అలాగే రాజధాని గ్రామాలలోని కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాలవద్ద కౌలు చెల్లింపు వివరాలను ప్రదర్శించారు. రైతుల సౌకర్యార్థం ప్రతి యూనిట్ ఆఫీస్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి రైతులకు వార్షిక కౌలు చెల్లింపుపై తలెత్తిన సందేహాలను సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది వివరించడం జరుగుతోంది. అదే విధంగా సోమవారం రాయపూడిలోని ప్రధాన కార్యాలయంలో రైతుల ఎన్‌పిసిఐ, బ్యాంక్ లింకేజి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకుగాను హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా సీఆర్డీఏ సిబ్బంది పలువురు రైతులకు లింకేజి ప్రక్రియ పూర్తి చేశారు. వెబ్‌సైట్‌లో పొందుపర్చబడిన సమాచారంలో వార్షిక కౌలు జమ అయిన రైతుల వివరాలతో పాటు, ఇంకా కౌలు జమ కాని రైతుల వివరాలు, చెల్లింపులు నిలిచిపోవడానికి గల కారణాలను సైతం వెల్లడించారు. ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలను కలిగిన రైతుల జాబితాను సైతం అందుబాటులో ఉంచారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతున్న నేపథ్యంలో, విశిది। లింకేజీ సక్రమంగా లేకపోవడం లేదా బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా ఉండటం వంటి కారణాల వల్ల కొందరి ఖాతాలకు చెల్లింపులు జమ కావడం లేదు. అలాంటి రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని ఎపి సిఆర్‌డిఎ సూచించింది.

క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా వివరాలు: రైతులు తమ వార్షిక కౌలు చెల్లింపు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు సిఆర్‌డిఎ నుంచి క్యూఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత వెబ్‌పేజీలో రాజధాని రైతులు తమ వివరాలను చెక్ చేసుకోవచ్చు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే కౌలు లబ్ధి సమాచారం తెలుసుకునే సౌకర్యం కల్పించింది. కౌలు లబ్ధి పొందని రైతులు తమ పేర్లు, ఖాతా వివరాలు, ఏ కారణం చేత కౌలు జమ కాలేదోనన్న అంశాలను సైతం చెక్ చేసుకోవచ్చు. ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలలో కౌలు నగదు జమ చేయుట సాధ్యపడదు కనుక ఆధార్ ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాలు కలిగిన రైతులు వెంటనే ఆ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని కోరింది.

విద్యుత్ బస్సులు ఆర్టిసినే కొనుగోలు చేపట్టాలి

• ఆర్టిసి ఉద్యోగుల ఐకాస డిమాండ్

విజయవాడ, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్‌టిసి ద్వారానే చేపట్టాలని ప్రధాన డిమాండ్‌తో ఆ సంస్థ ఉద్యోగుల ఐక్యకార్యచరణ సమితి (జెఎసి) డిమాండ్ చేసింది, ఆర్‌టిసి సిబ్బందితోనే ఈబస్సుల నిర్వహణ చేయాలని కోరింది. ప్రైవేట్ ఆపరేటర్లతో బస్సులు నడుపుతామంటే అంగీకరించలేమని ఉద్యోగ సంఘాలు తేల్చిచెప్పాయి. ఉద్యోగుల సమస్యలపై ఆర్‌టిసి జెఎసి నేతలతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఇడిలు బ్రహ్మానందరెడ్డి, వర్మతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఉద్యోగసంఘాల నేతలతో ఇడి ఆపరేషన్స్ నాగేశ్వరరావు పలు కీలక అంశాల గురించి చర్చలు జరిపారు. అనంతరం స్పెషల్ సిఎస్, ఎండిలకు ఇడిలు వివరాలను తెలిపారు. మరోవైపు 'స్త్రీ శక్తి పథకానికి అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేసింది. స్త్రీ శక్తి పథకం వల్ల ప్రయాణికులు సంఖ్య బాగా పెరిగిందని, ఆర్‌టిసికి రావాల్సిన బకాయిలు వసూలు చేసి బస్సులు కొనాలని సూచించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయటం సహా 30 డిమాండ్లను ఆర్‌టిసి ఐకాస అధికారుల ముందుంచారు. ప్రకటించిన కార్యాచరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు ఉంటాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. తమ అజెండాపై ఇంకా స్పష్టత రాలేదని ఉద్యోగ సంఘాల కన్వీనర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఆర్‌టిసి ద్వారానే విద్యుత్ బస్సులు కొనాలని చెప్పగా దానిపై వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఆపరేటర్లతో విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేయడమే అవుతుందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశం మొక్కుబడిగా జరిగిందని ఉద్యోగ సంఘాల కన్వీనర్ దామోదర్‌రావు వివరించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇడిలు చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులతో విద్యుత్ బస్సుల కొనుగోలు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. మూసివేసిన డిపోలు పునరుద్ధరించాలి. పరిష్కరించాల్సిన సమస్యలపై 10 రోజుల్లో సమావేశం పెడతామన్నారు. మా పోరాటం వ్యక్తిగతం కాదు, ఆర్‌టిసిని రక్షించుకోవడమే అని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేసాయి.

త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలు, లోఓల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది జిల్లాల నుండి 52 మంది తమ సమస్యలు తెలిపారు. డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నానిని అరెస్టు చేయాలి

తిరుపతి, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రోత పనులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి ర్యాలీగా వచ్చారు. ప్రజాస్వామ్యంగా ఫిర్యాదు చేయడానికి వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు వెళ్లనీయలేదు. పోలీసుల అడ్డంకులను దాటుకుని ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్న తర్వాత కూడా ప్రధాన గేట్లు మూసివేసి లోపలికి వెళ్లకుండా నిలువరించారు. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రధాన ద్వారం ఎదుటే రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఫిర్యాదు చేసే హక్కును కూడా కాలరాస్తున్నారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనతో పాటు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు గేటు ఎదుటే నిరసనకు దిగగా, పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బైఠాయింపును విరమింపజేసేందుకు పోలీసులు బలవంతంగా ప్రయత్నించగా పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. కార్యకర్తలను చెదరగొట్టేందుకు యత్నించడంతో చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, శివశంకర్‌రాజుతో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను అడ్డుకునేందుకు పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు ఎస్పీని కలవనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

ఎపి సచివాలయంలో ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరం

విజయవాడ, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్‌లైన్ సబ్‌మిషన్, కొత్త ఓటర్లు ఎన్‌రోల్‌మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫొటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ఈ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఓ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలక్టర్ సాయికాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జాయింట్ సిఇఓ ఇ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సమాచారం

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలి కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో 'లెనిన్' చిత్రబృందం

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: సినీనటుడు అక్కినేని నాగార్జున, అక్కినేని అఖిల్, అమల కుటుంబంతో సహా "లెనిన్" చిత్రం బృందం సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈనెల 10వ తేదీ విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి ఆదివారం తిరుపతిలో ప్రి రిలీజ్ వేడుకలు జరిగాయి. అనంతరం సోమవారం తిరుమలకు చేరుకున్న చిత్ర బృందం నాగార్జున, అఖిల్‌తోబాటు సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, నటి భాగ్యశ్రీ, కమెడియన్ సునీల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి వెళ్ళారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయం చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన నటుడు నాగార్జున, అఖిల్‌ను చూసి అభిమానులు కరచాలనం, సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో సినీనటుడు మాధవన్, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధ్యప్రదేశ్ మంత్రి గోవింద్ సింగ్ రాజ్‌పుత్, ఉత్తరప్రదేశ్ ఎంపి గణేష్ సింగ్ కుటుంబసభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

దేశ విదేశాల నుండి 'శ్రీవారి వైద్యసేవ్ల'కు ముందుకొస్తున్న వైద్యులు

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి సేవ ప్రతి భక్తుడి జీవితంలో లభించే మహాభాగ్యమని, అదే స్ఫూర్తితో టిటిడి ప్రారంభించిన "శ్రీవారి వైద్యసేవ్ల కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా, విదేశాల్లోని నిపుణ వైద్యుల నుంచి విశేష స్పందన లభిస్తోందని టిటిడి జెఇఒ ఎ.శరత్ తెలిపారు. భక్తుల సేవలో విజయవంతంగా కొనసాగుతున్న శ్రీవారి సేవ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు వైద్య, పశువైద్య, ఇతర వృత్తి నిపుణులను స్వచ్ఛంద సేవలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో శ్రీవారి వైద్యసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మార్గదర్శకత్వంలో స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద కళాశాల, గోశాల, వైద్య విభాగం తదితర సంస్థల అధిపతులతో పలు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించిన అనంతరం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూడు నెలల ట్రయల్ రన్‌గా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఎస్వీ గోసంరక్షణ శాలలో జరుగుతున్న వైద్యసేవలను ఆయన నిపుణ వైద్యులతో కలిసి పరిశీలించారు. జూన్ 20 నుండి స్లాట్ బుకింగ్ ప్రారంభం కాగా ఇప్పటికే 488 మంది స్పెషలిస్టు వైద్యులు, వివిధ విభాగాల నిపుణులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు మూడు రోజుల సేవా అవకాశం, ఇతర వైద్యులకు ఏడు రోజుల సేవా వ్యవధిని కల్పించామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు నెల రోజులు, ఆరు నెలలు లేదా ఏడాది పాటు కూడా సేవలందించే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా ఆయా విభాగాధిపతుల ద్వారా సేవా స్లాట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

గోసేవకు అపూర్వ స్పందన: శ్రీవారి వైద్యసేవలో భాగంగా ప్రారంభించిన గోసేవ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని జెఇఒ శరత్ తెలిపారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌ల సేవా స్లాట్లు పూర్తిగా భర్తీ కావడం ఈ కార్యక్రమానికి లభిస్తున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. వారం రోజుల పాటు సేవలందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ జి.పద్మ నాభన్ తదితరులు ఈ సేవ తమ జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, ఈ అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చెప్పినట్లు తెలిపారు. గోశాలను రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సందర్శించి గోవులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. గోసేవలో పాల్గొంటున్న నిపుణ వైద్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులకు టిటిడి కల్పిస్తున్న వసతి, భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీయగా, వారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారధి, డాక్టర్ భువన, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ఎస్వీ గోసంరక్షణశాలకు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ-టెండర్ల ఆహ్వానం

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.వి. గోసంరక్షణశాల డెయిరీ ఫామ్ అవసరాల కోసం రెండు చాఫ్ కట్టర్ల కొనుగోలుకు ఇ టెండర్లను టిటిడి ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల సంస్థలు, సరఫరాదారులు హెచ్‌టిటిపిఎస్://టెండర్.ఎపిఇప్రొక్యూర్‌మెంట్. జివొవి. ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కరెంట్ టెండర్స్ విభాగంలో ఎస్వీ గోసంరక్షణ శాల డైరీ ఫామ్‌ను సర్కిల్/ డివిజన్‌గా ఎంపిక చేసి టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ప్రక్రియ సోమవారం సాయంత్రం 5గంటల నుండి ప్రారంభమైంది. టెండర్ పత్రాలను జులై 21 సాయంత్రం 5.05 గంటల లోపు సమర్పించాలి. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం 92814 13626 నంబర్‌లో సంప్రదించాలని టిటిడి కోరింది.



తిరుమలలో శ్రీవారి భక్తజనం

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలలో మోస్తరుగా భక్తులు ఉన్నారు. వారాంతం సెలవులు ముగియడంతో సోమవారం ఉదయానికి వైకుంఠమ్-2లో 27 కంపార్టుమెంట్లలో భక్తులు నిరీక్షిస్తుండగా సాయంత్రానికి 23 కంపార్టుమెంట్లలో ఉన్నారు. సర్వదర్శనం కోసం 16గంటలు సమయం పడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

తిరుమలలో గోగుల కుటుంబ సభ్యులపై పిడి యాక్ట్

ఇద్దరిని కడప సెంట్రల్ జైలుకు తరలింపు

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భక్తులను, స్థానిక వ్యాపారులను, విధుల్లో ఉన్న పోలీసు భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న గోగుల కుటుంబానికి చెందిన నేరస్థులపై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సాధారణ చట్టాల ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్(పిడి) యాక్ట్ అమలు చేశారు. గోగుల కోటయ్య(22), గోగుల శ్రీనివాసులు(20)లను అరెస్ట్ చేసి, శ్రీకాళహస్తి సబ్ జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గోగుల శ్రీకాంత్ (25) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అతనిపై కూడా పిడి యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. గోగుల నాగేష్ (44)తో కలిసి గత కొంతకాలంగా తిరుమలలో వివిధ నేరకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. తిరుమలలో అక్రమ హాకింగ్ నిర్వహించడం, భక్తులకు నామాలు పెట్టే పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడడం, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయించడం, తోటి వ్యాపారులను బెదిరించడం, ఎదిరించిన వారిపై దాడులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. పోలీసులు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసిన సమయంలో బ్లేడ్లతో తమను తాము గాయపరుచుకోవడం, గోడలకు తలలు బాదుకుని స్వీయ గాయాలు చేసుకోవడం ద్వారా పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేసే విధానాన్ని అనుసరిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం వీరి నేరశైలిగా గుర్తించారు.

గత రెండేళ్లలో తిరుమల వన్ టౌన్, టూ టౌన్, రేణిగుంట, యెర్పేడు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దొంగతనం, దౌర్జన్యం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర కేసులు నమోదయ్యాయి. బెయిల్‌పై విడుదలైన ప్రతిసారి తిరిగి నేరాలకు పాల్పడుతూ, పోలీసు అధికారులను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో వీరిపై పిడి యాక్ట్ అమలు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.

ఎర్రచందనం ముద్దాయి నాసర్ బాయ్‌పై పిడియాక్ట్

తిరుపతి, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం అటవీప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేరళకు చెందిన నాసర్ బాయ్(53)పై టాస్క్‌ఫోర్స్ అధికారులు పిడి యాక్ట్ అమలు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పిడి యాక్ట్‌లు అమలు చేస్తున్నారు. తాజాగా కేరళకు చెందిన నాసర్ కెఎన్ అనే నాసర్ బాయ్ తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా మెట్టుపాలయంలో ఉంటూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇతనిపై పిడి యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిపై ఆరు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. ఇతనిపై పిడి యాక్ట్ అమలులో భాగంగా నిందితుడ్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

టిటిడి ట్రస్ట్‌లకు రూ.31 లక్షలు విరాళం

తిరుమల, జూలై 6 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం టిటిడికి చెందిన వివిధ పథకాలకు రూ.31 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లయన్ సాయివెంకట్ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు స్వర్ణ విహార్ ఇన్ ఫ్రా ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున రూ.10 లక్షలు, జయహో రామానుజ సినిమా ఆగస్టు 15న విడుదల సందర్భంగా మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. అలాగే గుంటూరుకు చెందిన జి.లావణ్య వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.11,11,111 లక్షలు విరాళంగా అందించారు. ఈవిరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

దలైలామా శతాధిక కాలం జీవించాలి

జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సిఎం చంద్రబాబు

విజయవాడ, జూలై 6 ప్రభాత వార్త ప్రతినిధి: బౌద్ధమత గురువు దలైలామాకు ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఎక్స్" వేదికగా ఆయన ట్వీట్ చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, కరుణ, మానవత్వాన్ని పెంపొందించే తన పవిత్రమైన ఆశయ సాధనలో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు చేకూరాలని, శతాధిక కాలం జీవించాలని ప్రార్థిస్తున్నా. అని సిఎం అన్నారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
మంగళవారం 7, జూలై 2026

పీజీఆర్ఎస్‌కు వెల్లువలా వినతులు

- ఒక్కరోజే 813 అర్జీలు
- రెవెన్యూ, జీవీఎంసీ సమస్యలే అధికం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:
జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 813 వినతులు అధికారులకు అందాయి. శాఖల వారీగా పరిశీలిస్తే, రెవెన్యూ శాఖకు 204, జీవీఎంసీకి 110, పోలీసు శాఖకు 32, ఇతర శాఖలకు 467 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, శేషశైలజ, రామలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రతి అర్జీని సంబంధిత (తరువాయి 8వ పేజీలో)

నర్సీపట్నం మార్కెట్ యార్డ్ అభివృద్ధి పట్ల

పాలకవర్గం చిత్తశుద్ధి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 6, ప్రభాతవార్త:
నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం మార్కెట్ కమిటీ బోర్డు మెంబర్స్ తో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ముందుగా మార్కెట్ యార్డును పరిశీలించి అధికారులకు మరియు కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, నూతన మార్కెట్ కమిటీ ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పాలకవర్గం సాధించిన ప్రగతిని ఆయన అభినందించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన యార్డును, ఇప్పుడు గాడిలో పెట్టి ఒక క్రమపద్ధతిలోకి తీసుకువచ్చామని, ఆదాయం పెంచేందుకు చెక్ పోస్ట్ ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు వంటి పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం మార్కెట్ యార్డ్ ఆదాయపరంగా రెండో స్థానంలో నిలిచిందని ఆయన ప్రశంసించారు.

యార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని స్పీకర్ తెలిపారు. రైతులకు, వ్యాపారులకు మరింత లబ్ధి చేకూర్చేలా పది శాశ్వత దుకాణాల నిర్మాణం, రైతుబజార్ ఆధునికీకరణ, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు, ఉత్పత్తులను ఆరబెట్టుకునే యంత్రాల కొనుగోలు, మట్టి నమూనా పరీక్షా కేంద్రాన్ని తిరిగి తీసుకురావడం వంటి అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ఈ అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి డైరెక్టర్లందరూ బాధ్యతగా సమావేశాలకు హాజరవుతూ యార్డ్ ప్రగతికి సహకరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ చిటికెల కన్నయ్య నాయుడు, జనసేన పార్టీ ఇంచార్జ్ సూర్యచంద్ర, అధికారులు బోర్డు నెంబర్లు పాల్గొన్నారు.

గల్లంతైన తమ కుటుంబ సభ్యులు వస్తారని ఆశతో...

కడలి వైపు ఎదురుచూపులు..

- శక్తి వంచన లేకుండా వాయు మార్గం నీటి మార్గంలో గాలింపు
- ఎప్పటికప్పుడు అధికారుల తో సమాచారం తెలుసుకుంటున్న సీఎం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త :
మత్స్యకారులు వేట విరమం తర్వాత ఎన్నో ఆశలతో వేటకు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు ప్రమాదానికి గురయ్యారు అనే విషయం తెలిసింద దగ్గర నుండి సంద్రం వైపే చూస్తూ ఉండిపోయారు. ఏ క్షణానైనా వస్తారని చిన్న ఆశతో నిద్రాహారాలు మాని కన్నీరు మున్నీరవుతున్నారు. ఈలోపు గల్లంతయినవారిలో ఒక వ్యక్తి ఆచూకీ లభించింది అని తెలిసిన వెంటనే మిగతా వారి కుటుంబ సభ్యుల్లో ఆశ చిగురించింది. ఎప్పటికప్పుడు అధికారులతో తమ కుటుంబ సభ్యులు ఏమైనా తెలిసిందా అని ప్రాధాయపడుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి (తరువాయి 8వ పేజీలో)

గల్లంతైన ఏడుగురిలో

తీరానికి చేరిన కర్రి చిన్న

- నేవీ హెలికాప్టర్‌లో తీసుకు వచ్చిన నౌకా దళ సిబ్బంది
- చిన్న ఆరోగ్యం బాగానే ఉన్నాదని కలెక్టర్ వెల్లడి
- మిగతా వారికోసం గాలింపు కొనసాగుతుందన్న కలెక్టర్

విశాఖపట్నం, జూలై 6 ప్రభాత వార్త
విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా రక్షించిన మత్యకారుడు కర్రి చిన్న ను సోమవారం సాయంత్రం సురక్షితం గా తీరానికి తీసుని వచ్చినట్టు జిల్లా కలెక్టర్ ఎం. ఏ.కిషోర్ తెలిపారు. సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో నౌకా దళానికి చెందిన హెలికాప్టర్ సాయంతో ఐఎన్ఎస్ డేగా కు కర్రి చిన్న ను నావికా రక్షణ దళ సిబ్బంది తీసుకు వచ్చారాని కలెక్టర్ పేర్కొన్నారు. తీరానికి తీసుకొచ్చిన వెంటనే నౌకాదళ వైద్య అధికారులు చిన్న కు వైద్య పరీక్షలు నిర్వహించగా చిన్న ఆరోగ్యం గానే ఉన్నట్టు నేవీ వైద్యులు వెల్లడించి నట్టు కలెక్టర్ చెప్పారు. ఇదిలావుండగా .జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు (తరువాయి 8వ పేజీలో)

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు

గాలింపు చర్యలు కొనసాగింపు

- ఎమ్మెల్యే వంశీకృష్ణ, జేసీ విద్యాధరితో కలిసి వివరాలు వెల్లడించిన ఐజీ గోపీనాథ్ జెట్టీ
- భారత తీర రక్షక దళం, నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ సమన్వయంతో గాలింపు చర్యలు
- మరో ఘటనలోని 20 మంది సురక్షితం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాత వార్త:
విశాఖ సముద్ర తీరానికి సమీపంలో గల్లంతైన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులోని ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరాయంగా కొనసాగు తుందని విశాఖ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీనాథ్ జెట్టి తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, (తరువాయి 8వ పేజీలో)

వీఈఆర్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష

వర్చువల్‌గా పాల్గొన్న వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త :
నీతి ఆయోగ్ ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేయనున్న విశాఖపట్నం ఎకానిక్ రీజియన్ (వీఈఆర్) పై రాష్ట్ర ముఖ్య మంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి సమీక్షించారు. సోమవారం జరిగిన ఈ సమీక్షలో వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ వర్చువల్‌గా పాల్గొన్నారు. వీఈఆర్‌లో భాగంగా 9 జిల్లాల పరిధిలో ఆర్థికాభివృద్ధి కోసం దశల వారీగా చేసిన ప్రతిపాదనలు వివరించారు. వి ఈ ఆర్ కి సంబంధించి వివిధ రంగాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రతిపాదనలు, ఇటు పారిశ్రామికంగా, వాణిజ్య పరంగా , పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు, తద్వారా కలిగే ప్రయోజనాలు, అవకాశాలను వివరించారు. వి ఈ ఆర్ లో భాగంగా సిటీ ఎకనమిక్ రీజియన్ కోసం చేసిన ప్రతిపాదనలు వివరించారు. అదేవిధంగా విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు “బే సిటీ” పేరిట ప్రతిపాదించిన కైలాసగిరి నుంచి భీమిలి వరకు ఉన్న తీర ప్రాంతంలో 25 కి మీ మేర 40 చదరపు కి మీ విస్తీర్ణం తో చేపడుతున్న ప్రతిపాదించిన అభివృద్ధి పనులు వి ఈ ఆర్ కి ముఖ్యమైన గ్రోత్ ఇంజిన్ గా ఉంటుందని వివరించారు. అలానే వైజాగ్ “బే సిటీ” భవిష్యత్తులో విశాఖను ప్రపంచ స్థాయి తీర నగరంగా మారేందుకు సహకరిస్తుందని వివరించారు. అలానే పర్యాటకాభివృద్ధి కోసం ప్రత్యేక సెజ్ లు ఏర్పాటు, వివిధ రంగాల అభివృద్ధి కోసం కేటాయించిన స్థలాలకు రహదారుల అనుసంధానం వంటి అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వివరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ స్థానిక సభ్యులు, విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఎస్.కిషోర్, అదనపు కమిషనర్ శ్రీమతి దాట్ల కీర్తి, ఓఎస్‌డి కృష్ణ నాయక్, కార్యదర్శి మురళీ కృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారిణి శ్రీమతి దివ్య లత గారు, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పడవ ప్రమాదంలో మృతి చెందిన సింహాద్రి కుటుంబానికి

హోం మంత్రి అనిత ఫోన్‌లో పరామర్శ

ప్రభుత్వం అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా

ఎస్.రాయవరం, జూలై 6, ప్రభాతవార్త :
ఎస్.రాయవరం మండలం రేవుపోల వరం గ్రామానికి చెందిన చోడిపల్లి సింహాద్రి సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందగా, హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్లో పరామర్శించారు. సింహాద్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆమె, ధైర్యం చెప్పారు. సింహాద్రి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే విధంగా, మృతి చెందిన సింహాద్రి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షల నష్టపరిహారం మంజూరు చేసినట్లు ప్రకటిం చారు. అలాగే అంత్యక్రియలు, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు ఎస్.రాయవరం టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కోరుప్రోలు పిఏసిస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటరాజు, స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వాసపల్లి అడవిరాజు,కోవిరి బంగారి, మైలపల్లి అప్పలరాజు, చేపల రాము, చేపల రుద్రయ్య, చేపల బంగారు చిట్టీ, సూరాడ నూకరాజు,కొమర తాతయ్య,సూరాడ దానయ్య, జనసేన బొడ్డు అప్పలరాజు, బొంది బన్ని పాల్గొన్నారు.

ఇద్దరు గుమస్తాలకు

ఇద్దరు సూపరింటెండెంట్లా..?

- ‘గ్రేటర్’ ఆడిట్ విభాగంలో అదనపు పోస్టింగ్‌పై ఉద్యోగుల్లో విమర్శలు..
- ‘కాసుల కుర్చీల’కే పెద్దపీట అంటూ ఆరోపణలు

ప్రభాతవార్త-విశాఖపట్నం
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల్లో ఆడిట్ విభాగానికి మరో సూపరింటెండెంట్ ను నియమించడంపై ఉద్యోగుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఇప్పటికే ఇద్దరు గుమస్తాలకు ఒక సూపరింటెండెంట్ ఉండగా, మరో సూపరింటెండెంట్ ను అదే విభాగానికి పోస్టింగ్ ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తు న్నారు. జీవీఎంసీలోని ఇతర విభాగాలు, జోన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, ఆడిట్ విభాగానికి అదనంగా అధికారిని నియమించడం పలు అనుమానాలకు తావిస్తోందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. సాధారణంగా (తరువాయి 8వ పేజీలో)

ప్రక్షాళనతోనే ఏయూకి

పూర్వవైభవం!

- ఐదు కీలక సంస్కరణలు అవసరం
- ఖాళీల భర్తీ నుంచి పరిశ్రమల అనుసంధానం వరకు సమగ్ర కార్యాచరణపై నిపుణుల సూచనలు

(విశాఖపట్నం-ప్రభాతవార్త)
ఒకప్పుడు దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఆంధ్ర యూనివర్శిటీ (ఏయూ)ని మళ్లీ పూర్వవైభవంలోకి తీసుకురావాలంటే ప్రభుత్వం తక్షణమే నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. అధ్యాపక పోస్టుల భర్తీ, స్వయం ప్రతిపత్తి, పరిశ్రమలతో అనుసంధానం, పరిశోధనాభివృద్ధి, విద్యార్థి సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉందని (తరువాయి 8వ పేజీలో)

న్యాయంపూడి ఎర్ర చెరువు గర్భం

కళ్ళ ముందే కబ్జా.!

దృష్టి పెట్టని రెవెన్యూ అధికారులు..
సర్వే నెంబర్ 101 లో చెరువు గర్భాన్ని పూడ్చి అక్రమ నిర్మాణాలు..

నక్కపల్లి, జూలై 6, ప్రభాతవార్త:
పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నక్కపల్లి ప్రాంతంలో ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలు గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే కబ్జాలకు గురవుతున్న పరిస్థితులు.! కొంతమంది స్వార్థపరులు కొన్ని రకాల పలుకుబడిని ఉపయోగించి ఇటువంటి కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్న విమర్శలు పెద్ద ఎత్తున గ్రామాల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. జాతీయ రహదారిని అనుకుని ఉన్న భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కబ్జాదారులు కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇక దురాక్రమణాల విషయానికొస్తే, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయం పూడి రెవెన్యూ గ్రామంలో పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన (తరువాయి 8వ పేజీలో)

భార్య చేతిలో

భర్త బలి

భర్త డబ్బులతోనే సుఫారి ఇచ్చి చంపించిన భార్య

అనకాపల్లి, జూలై 6, ప్రభాతవార్త :
అనకాపల్లి జిల్లాలో దారుణ ఘటన వెలుగు చూసింది. అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో భార్య సుపారీ ఇచ్చి భర్త ను హత్య చేయించిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన భార్యతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల (తరువాయి 8వ పేజీలో)

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించిన

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:
సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసిన మహానేత, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. (తరువాయి 8వ పేజీలో)

రోగులకు భరోసా..

కార్పొరేట్‌కు ధీటుగా వైద్యం

సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్

జ్ఞానాపురం, జూలై 6, ప్రభాతవార్త
ప్రభుత్వ వైద్యం అనే చిన్న చూపు వద్దు ... కార్పోరేట్‌కు ధీటుగా వైద్యం అందిస్తాం. ఊపిరితిత్తులకు చెందిన ఏ వ్యాధికైనా ఉత్తమ చికిత్స అందించి రోగులను క్షేమంగా పంపించే బాధ్యత మాదంటున్న ప్రభుత్వ అంటువ్యాదుల, ఛాతి ఆసుపత్రి వైద్యులు. పెదవాల్తేరు అంటువ్యాదుల ఆసుపత్రిలో వైద్యంతో పాటు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని సూపరంటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. వేలాది మంది రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ వారికి ఆరోగ్య ప్రదాయినిగా నిలిచిన ప్రభుత్వ అంటువ్యాదుల ఆసుపత్రికి ప్రభుత్వం మరింత అవకాశాలు కల్పిస్తే ఎన్నో ప్రాణాలు కాపాడే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. నేడు విశాఖ మహానగరంలో విశిష్ట సేవలు అందించే అంటువ్యాదుల ఆసుపత్రి పెదవాల్తేరులో సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో 288 పడకలతో నిత్యం రోగులకు సేవలు అందిస్తోంది.

విశాఖ కుగ్రామంగా అంటే 1967లో ప్రస్తుతం సత్యం సెంటర్ వద్ద రోగులకు సేవలు అందించేది. అనంతరం ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో ఈ ఆసుపత్రిని పెదవాల్తేరుకు మార్పు చేసి ఆధునాతన రీతిలో నిర్మించారు. ఏటా సుమారు ఏడు వేల మంది రోగులు ఇన్‌పేషెంట్‌లుగా చేరుతున్నారు. అలాగే సుమారు 50వేల మంది రోగులకు పైగా (తరువాయి 8వ పేజీలో)

కడలి వైపు ఎదురు చూపులు

(7వ పేజీ తరువాయి)

సూచనల మేరకు అధికారుల సైతం శక్తి వంచన లేకుండా రాత్రి పగలు గాలింపు చర్యలు చేపడుతున్నారు. మంత్రి అచ్చ అచ్చెన్న నాయుడు , హోం మంత్రి అనిత ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ అధికారులను సమీక్షిస్తూ వివరాలు అందజేస్తున్నారు. గల్లంతైన మత్స్యకారుల కోసం హెలికాప్టర్లు, నౌకలతో ముమ్మర గాలింపు చర్యలు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలిస్తున్నారు. మరోవైపు

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం, భారత నౌకాదళం సమన్వయంతో సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు, సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. సమాచారం అందిన వెంటనే భారత తీర రక్షక దళానికి చెందిన ఐసీజీఎస్ కనక్ లతా బరువా , ఐసీజీఎస్ వీర నౌకలను గాలింపు ప్రాంతానికి మోహరించారు. అలాగే మూడు హెలికాప్టర్లను రంగంలోకి దింపి సముద్రంలో విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలను విశాఖపట్నంలోని రీజినల్ ఆపరేషన్స్ సెంటర్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. అదే విధంగా భారత నౌకాదళం ఈస్ట్రన్ నేవల్ కమాండ్ కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యమై రెండు యుద్ధ నౌకలు, ఒక సీ కింగ్ హెలికాప్టర్, ఒక అడ్వాన??స్డ్ లైట్ హెలికాప్టర్ ను మోహరించి గాలింపు కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ప్రస్తుతం సముద్రంలో బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ, గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు నౌకలు, హెలికాప్టర్లతో రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పారాదీప్ తీరానికి చేరుకున్న పది మంది రాష్ట్ర మత్స్య కారులు

విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి వెల్లడి

విశాఖపట్నం జులై 6 ప్రభాత వార్త :

ఇంజిన్ వైఫల్యానికి గురైన చేపల వేట పడవలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం 10 మంది మత్స్యకారులు విజయవంతంగా రక్షించబడి, సురక్షితంగా పారాదీప్ తీరానికి చేరుకున్నట్టు విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి ఒక ప్రకటన లో తెలిపారు. విశాఖపట్నం రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపీనాథ్ జట్టి, పర్యవేక్షణలో... ఇండియన్ కోస్ట్ గార్డ్, ఒడిశా మెరైన్ పోలీస్,ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ల సమన్వయ ప్రయత్నాలతో ఈ రక్షణ చర్యలు చేపట్టబడి నట్టు అయన పేర్కొన్నారు. ఈ విజయవంతమైన రక్షణ చర్యను గోపీనాథ్ జట్టి, అభినందించారు; అలాగే, సమర్థవంతమైన సమన్వయం,కృషి చేసినందుకు ఇచ్చాపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. చిన్నం నాయుడునుఐజీ జెట్టి ప్రశంసించారు.

తీరానికి చేరిన కర్రి చిన్న

(7వ పేజీ తరువాయి)

ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో కర్రి చిన్న ను ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురక్షితంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్ల ఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించిన సంగతి తెలిసినదే . తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడని పక్షంలో కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలికాప్టర్లతో కూడా గాలింపు చేసారు . ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాఇంతవరకు మిగతా అరుగు మత్యకారుల ఆచూకీ తెలియరేలేదని అధికార యంత్రాంగం చెబుతుండాడంతో గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని కుటుంబ సభ్యులు గత రెండు రోజులు నుంచి తీవ్రంగా తాళ్లడిళ్లుతున్నారు.గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్య ఉన్నారని , ప్రాణాలకు తెగించి కార్రి చిన్న మత్స్యకారుడిని రక్షించిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు.

ఇద్దరు గుమస్తాలకు ఇద్దరు సూపరింటెండెంట్లా..?

(7వ పేజీ తరువాయి)

ఇద్దరు గుమస్తా లు మాత్రమే పనిచేసే విభాగానికి ఇద్దరు సూప రింటెండెంట్లు అవసరమా? అంటూ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆడిట్ విభాగం ద్వారా ప్రతి చెల్లింపు దస్త్రానికి ఆడిట్ ఆమోదం అవసరం కావడంతో ఈ విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, అందుకే ఈ పోస్టుల కోసం తీవ్ర పోటీ నెలకొంటోందనే ప్రచారం సాగుతోం ది. ఈ నేపథ్యంలో అదనపు పోస్టింగ్ వెనుక సాధారణ పరిపాలన విభాగానికి చెందిన ఓ అధికారి కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, అనేక జోన్లు, విభా గాల్లో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వాటిని పూరించకుండా, ప్రధాన కార్యాలయంలోని కీలక విభాగాల్లోనే కొందరిని కొనసాగించడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, కొందరు అధికారులు, ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలోనే కీలక పోస్టుల్లో కొనసాగుతున్నారని వారు విమర్శిస్తున్నారు.

ఇటీవల 12 మంది ఉద్యోగుల బదిలీల్లో కూడా కొందరికి కీలక పోస్టులు కేటాయించడంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సిఫార్సులు, పైరవీల ఆధారంగా పోస్టింగ్‌లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండగా, పనితీరు, అవసరాల ఆధారంగా బదిలీలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కళ్ల ముందే కబ్జా.!

(7వ పేజీ తరువాయి)

ఎర్ర చెరువు సర్వేనెంబర్ 101 లో గల 4.34 ఎకరాల విస్తీర్ణంలోని కొంత భాగంలో స్థలాన్ని కొందరు దర్జాగా దురాక్రమణకు పాల్పడ్డారు. సుమారు 75 లక్షల రూపాయలు విలువ కాగల 10 సెంట్ల మేర ప్రభుత్వ చెరువు గట్టు స్థలం దురాక్రమణదారుని పాలవ్వడం పట్ల స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వెదుళ్ళపాలెం జంక్షన్ కు సమీపంలోని రఘు క్షేత్రంలోని ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న న్యాయంపూడి రెవెన్యూ గ్రామంలో కొందరు వ్యక్తులు ఇక్కడ గల ఎర్ర చెరువు గట్టు నుంచి చెరువు గర్భాన్ని దర్జాగా మట్టితో పూడ్చి అవసరం మేరకు ఎత్తు చేసుకుని అందులో ఒక షెడ్డు సహా బడ్డీ కొట్టును ఏర్పాటు చేయడం పట్ల చెరువు ఆయకట్టు దారులతో పాటు స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎంతో విలువైన ఈ చెరువు గర్భం స్థలాన్ని స్వార్థపరులు ఆక్రమించుకున్నా సంబంధిత అధికార విభాగం అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై అయోమయ స్థితిలో ఆయకట్టు రైతులు సహా స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాల అధికార యంత్రాంగం స్పందించి చెరువు గర్భం దురాక్రమణను తక్షణం తొలగించే చర్యలు చేపట్టాలని ఆయకట్టు దారులు ముక్తకంఠంతో కోరుతున్నారు. న్యాయం పూడి ఆక్రమణకు సంబంధించి బాధితులు తాసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆక్రమణ తొలగించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తాసిల్దార్ చిన్ని కృష్ణ వివరణ కోరగా అనాథరైజ్డ్ గా ఆ షెడ్డు వేశారు తప్ప ఎటువంటి అనుమతులు లేవని ఈ ఆక్రమణలకు సంబంధించి సర్వే చేయడం జరుగుతుందని తక్షణమే ఆ షెడ్ ను తొలగిస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను ఏ ఒక్కరు ఆక్రమణలు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పని హెచ్చరించారు.

భార్య చేతిలో భర్త బలి

(7వ పేజీ తరువాయి)

ప్రాథమిక సమాచారం ప్రకారం, శ్రీరామపురానికి చెందిన అప్పలనాయుడును అతని భార్య హైమా హత్య చేయించినట్లు దర్యాప్తులో తేలింది. గంగాధర్ అనే వ్యక్తితో హైమాకు అక్రమ సంబంధం ఉన్నట్లు, దీనికి భర్త అప్పలనాయుడు అడ్డుగా ఉండటంతో అతన్ని హత్య చేసేందుకు సుపారీ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

ఇంట్లోనే హత్యకు పాల్పడిన అనంతరం ఘటనను సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైమా, గంగాధర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు

గాలింపు చర్యలు కొనసాగింపు

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన గాలింపు చర్యల వివరాలను వెల్లడించారు. జూలై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పడవ జూలై 4న తిరిగి చేరుకోవాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రమాదానికి గురై గల్లంతైందన్నారు. పడవలో మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఉండగా, వారిలో కర్రి చిన్నను పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ వాణిజ్య నౌక సురక్షితంగా రక్షించిందని తెలిపారు. మిగిలిన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. జూలై 4 అర్ధరాత్రి సమయంలో సమాచారం అందిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు భారత తీర రక్షక దళం, భారత నౌకాదళాన్ని అప్రమత్తం చేసి సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత తీర రక్షక దళానికి చెందిన రెండు నౌకలు, భారత నౌకాదళానికి చెందిన రెండు నౌకలు ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిరంతర గాలింపు నిర్వహిస్తున్నాయన్నారు. అదేవిధంగా నౌకాదళం, తీర రక్షక దళానికి చెందిన డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్లు సముద్రంపై వైమానిక గాలింపు కొనసాగిస్తున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ ఆపరేషన్స్ స్టేషన్ (రోస్) ద్వారా ఎలక్ట్రానిక్ నిఘా కూడా నిరంతరం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం సముద్రంలో నాలుగు మీటర్ల వరకు ఎత్తైన అలలు, గంటకు సుమారు 50 నాటికల్ మైళ్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా గాలింపు, రక్షణ చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ అందుబాటులో ఉన్న అన్ని వనరులతో 72 గంటల ప్రామాణిక సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మరొక 24 గంటల పాటు తొలి విడత రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, తాజా సమాచారం అందిన వెంటనే వెల్లడిస్తామని గోపీనాథ్ జెట్టి తెలిపారు. బాధిత కుటుంబాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

మరొక ఘటనలో 20 మందిని సురక్షితంగా రక్షించారు

ఇదిలా ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇంజిన్ దెబ్బతిని సముద్రంలో చిక్కుకుపోయిన మరొక మత్స్యకార పడవలోని 20 మంది మత్స్యకారులను కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, భారత తీర రక్షక దళం, ఒడిశా మెరైన్ పోలీసు సంయుక్తంగా సురక్షితంగా రక్షించారని తెలిపారు . సమాచారం అందిన వెంటనే మత్స్యకారులతో సంబంధాలు ఏర్పరచుకుని వారి ఆచూకీని గుర్తించిన అధికారులు, సమీపంలో ఉన్న మరో మత్స్యకార పడవ లోకి 20 మందిని సురక్షితంగా తరలించారు. అనంతరం భారత తీర రక్షక దళం నౌక సహాయంతో ఆ పడవను ఒడిశాలోని తీర ప్రాంతానికి భద్రంగా తీసుకువస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చి అనంతరం విశాఖపట్నానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

ఆరు గంటల పాటు తిరిగబడిన బోటుపైనే ఉన్నారు : ఎమ్మెల్యేవంశీ

"నేను కర్రి చిన్నాతో మాట్లాడాను. ఆయన చెప్పిన దాని ప్రకారం. నాలుగో తేదీ సాయంత్రం 3.00 గంటల ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న బోటు సాంకేతక సమస్యల వల్ల తిరగబడిపోయింది. ఆ సమయంలోనే కర్రి చిన్న వాళ్ల అన్నయ్య బోటు కిందకు పోయారు. మిగిలిన వారంతా తిరగబడిన బోటుపైనే రాత్రి 9.00 గంటల వరకు ఉన్నారు. ఆ బోటు క్రమేపీ మునిగిపోయింది. తెడ్డు ఆధారంగా వారంతా కొంత దూరం ఈదుకుంటూ వచ్చారు. వస్తూ వస్తూ ఉండగా ఒకిద్దరు మధ్యలో ఆగిపోయారు. నలుగురు కొంతవరకు వచ్చి ఆగిపోయారు. చిన్న ఒక్కడే ఈదుకుంటూ వచ్చి అక్కడికి దగ్గరలో లంగరు వేసి ఉన్న పనామా జెండాతో ఉన్న షిప్ ను పట్టుకున్నడు. గట్టిగా అరవటంతో అందులో ఉన్న సిబ్బంది చూసి లైఫ్ జాకెట్ ఇచ్చి చిన్నాను రక్షించారు" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వివరించారు.

ప్రక్షాళనతోనే ఏయూకి పూర్వవైభవం!

(7వ పేజీ తరువాయి)

విద్యావేత్తలు, ఉన్నత విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను అత్యవసరంగా భర్తీ చేసి, రాజకీయ జోక్యం లేకుండా మెరిట్, పరిశోధన సామర్థ్యాన్ని ప్రామాణికంగా తీసుకుని శాశ్వత నియామకాలు చేపట్టాలని సూచిస్తున్నారు. కొత్తగా నియమితులయ్యే అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ కల్పించడం ద్వారా బోధన, పరిశోధన నాణ్యతను పెంచవచ్చని పేర్కొంటున్నారు. యూనివర్సిటీ పాలనలో రాజకీయ ప్రభావాన్ని తగ్గించి స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయాలని, విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులతో కూడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఏర్పాటు చేయడం ద్వారా నిర్ణయాలు మరింత పారదర్శకంగా ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. విశాఖలోని ఐటీ, ఫార్మా, ఉక్కు, పోర్టు తదితర రంగాల సంస్థలతో ఆంధ్ర యూనివర్సిటీకి భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచిస్తున్నారు. అదే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల సహకారంతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాల అభివృద్ధికి వినియోగించాలని సూచిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక కౌన్సెలింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, హైస్పీడ్ ఇంటర్నెట్, బాలికల హాస్టళ్ల విస్తరణ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా, జ్ఞానాన్ని సృష్టించే పరిశోధనా కేంద్రాలుగా ఎదగాలని, ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పాటు వాటి వినియోగం, పరిశోధన, ఉద్యోగ కల్పన, జాతీయ ర్యాంకింగ్‌లపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం, యూనివర్సిటీ యంత్రాంగం, పరిశ్రమలు, పూర్వ విద్యార్థులు సమన్వయంతో పనిచేస్తే ఆంధ్ర యూనివర్సిటీ మళ్లీ జాతీయ స్థాయిలో తన పూర్వ వైభవాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

రోగులకు భరోసా.. కార్పొరేట్‌కు ధీటుగా వైద్యం

(7వ పేజీ తరువాయి)

అవుట్ పేషెంట్‌లు చికిత్స పొందుతున్నట్టు ఆసుపత్రి సూపరంటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్ కుమార్ తెలిపారు.

ఈ రోగులకు ప్రత్యేక చికిత్స

ఊపిరితిత్తుల సమస్యా ... దగ్గుతున్నారా , ఆయాసంతో అవస్థ పడుతున్నారా , ట్యుబక్లోకస్ (టిబి)తో ఆరోగం కుదుటపడటం లేదా అలాంటి రోగులు వెంటనే పెదవాల్తేరు ప్రభుత్వ అంటువ్యాధుల ఆసుపత్రిలో చేరండి మేము అత్యుత్తమ వైద్యం అందిస్తాము. ప్రైవేటు ఆసుపత్రిలో చేరి లక్షలాది రూపాయలు వెచ్చించే కంటే ఉచితంగా ప్రైవేటు కంటే మెరుగైన వైద్యం అందిస్తామని సూపరంటెండెంట్ డాక్టర్ సునీల్ రోగులకు బరోసా ఇస్తున్నారు.

ఐదు యనిట్లతో రోగులకు సేవలు ..

అత్యాదునిక వైద్య పరికరాలతో అయిదు యనిట్లు ద్వారా రోగులకు ఈ ఆసుపత్రి సేవలు అందిస్తోంది. ప్రత్యేకమైన రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యనిట్ (ఆర్.ఐ.సి.యు)అందుబాటులో ఉందని సూపరంటెండెంట్ తెలిపారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుమారు 70 మంది అంటువ్యాదుల ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.మెడికల్, నాన్ మెడికల్ విధులు నిర్వహించేందుకు 320 మంది స్టాఫ్ అందుబాటులో ఉన్నట్టు డాక్టర్ సునీల్ తెలిపారు.

ప్రత్యేక వైద్యపరికరాలు

ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు బ్రాంకోస్కోపీ యనిట్లు అందుబాటులో ఉన్నట్టు ఆయన తెలిపారు. బ్రాంకోస్కోపి ద్వారా పిల్లలకు, పెద్దలకు మెరుగైన వైద్య సేవలు అందించే వీలుందన్నారు. కోటిన్నర రూపాయల విలువ చేసే ఎండోస్కోపి యనిట్ అందుబాటులో ఉంది. దీని ద్వారా గాలి గొట్టాలను ఊపిరితిత్తులలోనికి పంపించి వ్యాది నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. బస్ పరికరం ద్వారా కణజాలాన్ని బయాప్సీకి పంపి అంతుచిక్కని వ్యాదుల నిర్ధారణ చేస్తామన్నారు. అలాగే గురక వ్యాధికి 11 లక్షలతో ఏర్పాటు చేసిన ' స్లీప్ ల్యాబ్ ' ద్వారా చికిత్స అందిస్తామని డాక్టర్ సునీల్ తెలిపారు. అత్యంత ఆధునాతన మరిన్ని వైద్య పరికరాలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంతో కార్పోరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామంటున్నారు.

విశాఖ మత్స్యకార కుటుంబ సభ్యులు ధైర్యంగా వుండాలి

- గాలింపు చర్యలు ముమ్మరం చేశారు
- గల్లంతైన వారి కుటుంబాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శ
- వేటకు వెళ్లే వారికీ భీమా తప్పనిసరిగా చేయాలి

విశాఖపట్నం, జూలై 6 ప్రభాత వార్త:

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతు కావడం అత్యంత దురదృష్టకరమని, వారిని క్షేమంగా తీసుకురావడానికి ప్రభుత్వ యంత్రాంగాలు అన్నీ సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు.సోమవారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న ఆయన గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, కేంద్ర సంస్థలు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాయని భరోసా కల్పించారు.అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో ఘటనపై సమీక్ష నిర్వహించి గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ నౌకలు, ఇతర రక్షణ బృందాలతో గాలింపును

మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వేటకు వెళ్ళే మత్స్యకారులు కు ప్రమాద భీమా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది అదేవిధంగా లైఫ్ జాకెట్లు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయాలని ఆవిధంగా చేస్తే వారి ఆచూకీ తెలుసు కోవడానికి మార్గం సులభంగా ఉంటుందని అన్నారు. మెకనైజ్డ్ బోట్లుకు జిపిఎస్ అందుబాటులోకి తీసుకు రావడం తో రక్షణ చర్యలు పర్య వేక్షణ పెంచాలని, మత్స్యకారులు వేటకు వెళ్ళే మెకనైజ్డ్ బోట్లు కోస్టు గార్డ్ కార్యాలయానికి జిపిఎస్ విధానం అనుసంధానం చేయాలనిమాధవ్ సూచించారు. ప్రతి క్షణం విలువైనదేనని, గాలింపు చర్యల్లో ఎలాంటి అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 129 ఫిర్యాదులు

- టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకే అధిక వినతులు..
- పెండింగ్ ఫిర్యాదులపై అదనపు కమిషనర్ల ఆగ్రహం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో సోమవారం జీవీఎంసీకి మొత్తం 129 వినతులు అందాయి. ప్రజల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు వచ్చే పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ అధికారులను ఆదేశించారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ల వారీగా భీమిలి--3, మధురవాడ--16, ఈస్ట్--25, వెస్ట్--5, నార్త్--18, సౌత్--17, పెందుర్తి--14, గాజువాక--20, అనకాపల్లి--3, ప్రధాన కార్యాలయానికి 8 ఫిర్యాదులు అందాయి.

విభాగాల వారీగా పరిశీలిస్తే టౌన్ ప్లానింగ్ విభాగానికి అత్యధికంగా 60 ఫిర్యాదులు, ఇంజినీరింగ్ విభాగానికి 28, రెవెన్యూ విభాగానికి 23, జోనల్ అడ్మినిస్ట్రేషన్‌కు 7, ప్రజారోగ్య

విభాగానికి 6, యూసీడీకి 3, అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్‌కు 1, డీడీహెచ్‌కు 1 ఫిర్యాదు నమోదైంది.

అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు అదే రోజు పరిశీలించి, ఫిర్యాదుదారులతో నేరుగా సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కమిషనర్లు ఆదేశించారు. ప్రతి వారం ఒకే సమస్యపై ప్రజలు తిరిగి ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

పురమిత్ర, పీజీఆర్ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి. విజయభారతి, వివిధ విభాగాల అధికారులు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై

అవగాహన

గాజువాక,జులై 6,ప్రభాతవార్త :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్సార్ఆర్) కార్యక్రమంలో భాగంగా 66వ వార్డు పరిధిలోని 210, 211, 212, 220 బూత్‌లలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల నుంచి దరఖాస్తు ఫారాలను సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో పాటు కూటమి నాయకులు అన్సర్ వల్లి, ఫరీద్ బాబా, నెమత్, మోతి ఖాన్, సాలిహిన్, రబ్బాని, షకీల్, అన్వర్, బుజ్జి, మౌలా భాష, ఇమామ్, షబ్బీర్, నంబాల రమణ, తిరుమలరావు, వెంకటలక్ష్మి, పద్మప్రియ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు అర్పించిన

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్

(7వ పేజీ తరువాయి)

ప్రజాసేవ, నిజాయితీ, సమాన అవకాశాల కల్పనలో ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధే నిజమైన ప్రగతికి నాంది అనే భావనతో ఆయన చేసిన సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి. వనజ, చీఫ్ జనరల్ మేనేజర్లు డి. సుమన్ కళ్యాణి, బి. అశోక్ కుమార్, ఎస్. రాజబాబు, ఎల్. మహేంద్రనాథ్, ఎస్. విజయ్ ప్రతాప్, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు.

పీజీఆర్ఎస్‌కు వెల్లువలా వినతులు

(7వ పేజీ తరువాయి)

శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా, కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఆక్రమణల క్రమబద్ధీకరణతో పాటు ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ పలు ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ కలెక్టర్ గోవిందు, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి అక్కడికి చేరుకుని ఆందోళనకారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:

జీవీఎంసీ వెస్ట్ జోన్ పరిధిలోని 59వ వార్డులో గణపతి నగర్ కొండ ప్రాంతంలో ఉన్న 450 కిలోలీటర్ల సామర్థ్యం గల తాగునీటి రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సంతోషి తెలిపారు. ఈ మేరకు హిమాచల్ నగర్, లక్ష్మీనగర్, గణపతి నగర్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ, గంగానగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాలకు రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు.

మరమ్మతుల కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి సహకరించాలని కోరిన ఆమె, అత్యవసర అవసరాల కోసం ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీరు అవసరమైన వారు 59వ వార్డు ఇన్‌చార్జి సహాయక ఇంజనీరు 8184811639ను సంప్రదించాలని సూచించారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాటు లు అభివృద్ధి పనులను పరిశీలించిన ఈవో

సింహాచలం, జూలై 6, ప్రభాత వార్త :

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో కొండపై, కొండక్రింద జరుగుతున్న పలు ఇంజనీరింగ్ అభివృద్ధి పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గిరి పౌర్ణమి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే నేపథ్యంలో, అడవివరం సెంటర్ నుంచి గాంధీనగర్ మీదుగా స్వామివారి పుష్కరిణి వరకు భక్తులు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆలయ డీఈ ఇన్‌చార్జి రామరాజు, సింహాచలం మాజీ కార్పొరేటర్ పీవీ నరసింహాతో కలిసి రహదారిని పరిశీలించారు. అనంతరం స్వామివారి తొలి పావంచ వద్ద నిర్మాణంలో ఉన్న టెన్సైల్ షెడ్ పనులను పరిశీలించి, గిరి పౌర్ణమి నాటికి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ ఇన్‌చార్జి రామరాజుకు సూచించారు. అలాగే గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేకంగా గట్టర్ల ఏర్పాటు విషయమై అధికారులతో చర్చించారు. కొండపై భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు బ్లూ స్టార్ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన వాటర్ కూలర్లను క్యూ లైన్లలో ఏర్పాటు చేసే పనులను పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ డీఈ ఇన్‌చార్జి రామరాజు, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ , సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 40 వినతులు

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 40 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి వోల్టేజ్ లో హెచ్చుతగ్గులు, వేలాడుతున్న వైర్లు, నూతన విద్యుత్ కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, లైన్ షిఫ్టింగ్, పేరు మార్పు, డీటీఆర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్‌కు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం (ఓడీఎస్) పి.సాల్మన్ రాజు, జనరల్ మేనేజర్లు ఎం.ఝాన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, వి.వి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు టీకా తప్పనిసరి

ఆనందపురం, జూలై 6, ప్రభాతవార్త:

ప్రతి పెంపుడు కుక్కకు వాటి యజమానులు ప్రతి ఏడాది తప్పనిసరిగా యాంటీ రాబీస్ టీకా వేయించాలని ఆనందపురం, శొంట్యాం పశు వైద్యశాలల వైద్యులు సంతోష్, అశ్విని చెప్పారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పశువైద్యశాలల్లో సోమవారం కుక్కలకు ఉచిత యాంటీ రాబీస్ (పిచ్చికుక్క వ్యాధి) టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ రేబీస్ అనేది జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే ప్రాణాంతక వ్యాధి అని తెలిపారు. వీధి కుక్కలు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బునీటితో బాగా కడిగి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రాబీస్ చికిత్స తీసుకోవాలని సూచించారు. రేబీస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, టీకాల ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆనందపురంలో 35 కుక్కలకు, శొంట్యాంలో 32 కుక్కలకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రభావతి, సహాయకులు సుజాత, సరస్వతి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

జనసంఘ్ స్థాపకుని 125వ జయంతి వేడుకలు

గాజువాక,జులై 6,ప్రభాతవార్త:

దేశ సమగ్రత, ఐక్యత కోసం శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు కొనియా డారు. పాత గాజువాక మండలం ఎల్ఎల్‌వీ నగర్ లోని 111వ బూత్‌లో సోమవారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి కృష్ణంరాజు, పార్టీ సీనియర్ నాయ కుడు బాట శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షురాలు దీనం కొండ పావని మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాల రూపకల్పనలో, పార్టీ నిర్మాణంలో ముఖర్జీ కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ 70వ వార్డు మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరసపల్లి భవాని, ఓబీసీ మోర్చా నాయకుడు వి.శ్రీనివాసరావు, మండల కోశాధికారి బి.వీరయ్య, ఎస్సీ మోర్చా నాయకుడు అరసాడ తాతబాబు, యువమోర్చా నాయకుడు డి.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పి జి ఆర్ ఎస్ కు 120 ఫిర్యా దులు

విశాఖపట్నం, జూలై 6 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 120 ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) నిర్వహిస్తున్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత భాగ్చి, ప్రత్యక్షముగా నగర పోలీసు సమావేశమందిరం నందు ఉండి, నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు ఈ సందర్భంగా సిపి ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఎస్సై బి.రాజేశ్వరి

ఆరిలోవ, జులై 6, ప్రభాతవార్త

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆరిలోవ శాంతిభద్ర తల ఎస్సై బి.రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం పైనాపిల్ కాలనీలో సీఐ ఎస్. శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డ్రగ్స్ వినియోగం, విక్రయం వల్ల కలిగే దుష్పరిణామాలు వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, విద్య, ఉపాధి సమాజంపై కలిగే తీరమైన ప్రతికూల ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ ను కొనుగోలు చేయడం, వినియోగ చేయడం, నిలువ ఉంచ డం, రవాణా చేయడం, డ్రగ్స్ విక్రయించడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని ఆమె తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

గాజువాక,జులై 6,ప్రభాతవార్త :

దేశ నిర్మాణంలో, సామాజిక సమానత్వ సాధనలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కొనియాడారు. పెదగంట్యాడ 76వ వార్డు జగ్జీవన్‌రామ్ కాలనీలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కొల్లి మనోహర్ అధ్యక్షతన సోమవారం ఆయన వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నరసింగరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈలకర్ర భువనేశ్వరి, వి.అనిత, జి.శంకరరావు, బి.ఎల్లాజీరావు, జె.శ్రీను, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, కేవీ.రమణ, రాము, ఏసురత్నం పాల్గొన్నారు.

గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు

వైస్సార్సీపీ నేత జి.వి. రామచంద్రరావు భరోసా

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త :

విశాఖపట్నం తీరంలో వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సముద్రంలో వేటకి వెళ్లిన మత్స్యకారులు తిరిగి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ) రాష్ట్ర కార్యదర్శి జి.వి. రామచంద్రరావు తక్షణమే స్పందించారు. బాధిత మత్స్యకార కుటుంబాలను ఆయన స్వయంగా పరామర్శించి, వారికి కొండంత ధైర్యాన్ని ఇచ్చారు.

'నేనూ మత్స్యకార బిడ్డనే.. గల్లంతైన వారంతా నా బంధుమిత్రులే'

గల్లంతైన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కన్నీరుమున్నీరవు తున్న కుటుంబాలను ఓదారుస్తూ ఆయన భావోద్వే గానికి లోనయ్యారు. తాను కూడా ఒక మత్స్యకార కుటుంబానికి చెందిన వాడినని, సముద్రంపై వేటకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న వారంతా తన బంధుమిత్రులేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కష్టసమయంలో తన సొంత కుటుంబ సభ్యులకు అండగా నిలబడినట్లే, వారందరికీ తాను చేదోడు వాదోడుగా ఉంటానని గట్టి భరోసా ఇచ్చారు. నేను కూడా మత్స్యకార కుటుంబం నుండి వచ్చిన వాడినే. సముద్రంలో గల్లంతైన వారంతా నా సొంత బంధు మిత్రులే. వారి కుటుంబాల ఆవేదన, కష్టం నాకు బాగా తెలుసు. మత్స్యకారుల జీవితాల్లో ఇలాంటి సంఘటనలు జరగడం అత్యంత విచారకరం. గల్లంతైన వారు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గాలింపు చర్యలను వేగవంతం చేయాలి.

బాధితులకు అన్ని విధాలా అండగా నిలబడతాం."

తక్షణ సహాయక చర్యలకు డిమాండ్

మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్ మరియు విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి ఆధునిక సాంకేతికతతో గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను కోరారు. మత్స్యకార కుటుం బాలకు అవసరమైన తక్షణ ఆర్థిక, నిత్యావసర సాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని, వారి సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని రామచంద్ర రావు స్పష్టం చేశారు. ఒక సొంత మనిషిలా వచ్చి నాయకుడు పరామర్శించడంతో బాధిత కుటుంబా ల్లో కొంతైనా ధైర్యం నెలకొంది.

జీవో 396 రద్దుకు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

రెండు రోజుల పాటు విధుల బహిష్కరణ రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

ఆనందపురం, జూలై 6, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ అర్బన్ జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఆనందపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సోమవారం దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు రెండు రోజుల పెన్‌డౌన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులను బహిష్క రించి నిరసన చేపట్టారు. ఈ సంద ర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, రిజి స్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు పేరుతో రిజిస్ట్రేష న్ శాఖ సేవలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రభు త్వం వెంటనే విరమించుకోవా లని కోరారు. జీవో 396 వల్ల దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తుల భద్రత, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత కోసం ప్రస్తుతం అమలులో ఉన్న విధానమే అనుకూలమని పేర్కొంటూ, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులను ప్రభుత్వం పునః సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్ర మంలో ఆనందపురం దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు వై.సత్యరావు, ఎం.ప్రసాదరావు, పి. గణేష్, వి.వి.వేణుగోపాల్, ఏ.పార్థసారథి, కే.ఎస్. ఎన్. మూర్తి, ఎస్.వి.రవికుమార్, ఎం.వి.ఏ. ఎస్.ఎన్. పాత్రుడు, అంగటి గణేష్, బి. జగదీష్, కే. చిన్నారావు, పి. రామకృష్ణ, పి. సంతోష్, ఎస్. శివాజీ, తాతారావు, ప్రశాంత్‌తో పాటు స్టాంప్ వెండర్లు వై.అప్పలరాజు, కే. గౌరీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కీ.శే.పద్మశ్రీ ఆదినారాయణ పుట్ బాల్ టోర్నమెంట్ ఫైనల్ విజేత ఎస్.పి.ఎమ్.ఎఫ్.సి టీం

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త:

కీ.శే పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్.సి ఆదినారా యణ జ్ఞాపకార్థం పుట్ బాల్ టోర్నమెంట్ 27-06-2026 నుంచి 5-07-2026 వరుకూ జిల్లా పుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా విశాఖ రైల్వే బంతాట మైదానంలో ఫైనల్ మ్యాచ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఫైనల్ కి ముఖ్య అతిథులు గా జిల్లా కాపు సంఘం నాయకులు తోట రాజీవ్, సంఘ సేవా కర్త వెంకట రమణ, వ్యాపారవేత్త సునీల్,ద్యాన్ చంద్ అవార్డ్ గ్రహీత (బాక్సర్) నగిశెట్టి ఉష, ముస్తఫాలు పాల్గొన్నారు. టైటిల్ కోసం 23 పుట్ బాల్ టీం లు పోటీ పడగా ఆదివారం నాడు రైల్వే స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ హోరా హోరీ గా జరిగిన ఫైనల్ లో ఈస్ట్ నేవల్ మరియు పోలమాంబ పుట్ బాల్ టీం లు పోటీపడగా 1-0 గోల్స్ తో పోలమాంబ టీం విజేతగా నిలిచారు.ముఖ్య అతిథులు చేతులు మీదుగా విన్నర్ టీం కు 30 వేలు,రన్నరఫ్ టీం కు 20 వేలు నగదు బహుమతి తో పాటు ట్రోపి లు అందజేశారు. ఈ సందర్భంగా అక్కరమాని చోహిత చినబాబు మాట్లాడుతూ పద్మశ్రీ డా.ఆది నారాయణ (ప్రేమ హాస్పటల్ అదినేత) పుట్ బాల్ వీరాభిమాని అంతే కాకుండా విశాఖ జిల్లా పుట్ బాల్ క్రీడకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. గతంలో అల్ ఇండియా ఫుట్బాల్ సభ్యులుగా కొనసాగారు అలాగే పిఫా ఫుట్బాల్ టోర్నమెంట్ లో అతిధి గా పాల్గొని పాల్గొన్నారని తెలిపారు.

ఈ టోర్ని కి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన జిల్లా కాపు సంఘం నాయకులు తోట రాజీవ్, నక్కా వెంకట రమణ, పైడి కొండ సునీల్ కి అక్రమని చోహిత చినబాబు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ తన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా పుట్ బాల్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, రాజారావు, బాబు, శ్రీను, గణేష్ కోలా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంపొందించాలి

- ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి
- ప్రతి ఒక్కరూ వంద విత్తనాల బంతులు తయారు చేయాలి

విశాఖపట్నం, జులై 6 ప్రభాత వార్త :



విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంపొందించాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం విశాఖపట్నం లోని కెవిఎన్ ఎం బాలికల ఉన్నత పాఠశాల లో శాంతి హెడ్ మాస్టర్ అధ్యక్షతన, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో విత్తనాల బంతులు తయారు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. మనం తినె దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలి అని పిలుపునిచ్చారు. పూనే కి చెందిన ఫ్లేమ్ విశ్వవిద్యాలయం సైకాలజి విద్యార్థిని నందినీ రోయ్ మాట్లాడుతూ అడవులు తగ్గి పోవడం, కార్బన్ డై ఆక్సైడ్ పెరిగి పోవడం, ఆక్సిజన్ శాతం తగ్గడం దృష్టిలోనికి తీసుకుని ప్రతి ఒక్కరూ విత్తనాల బంతులు తయారు చేయడం అవసరం అని వివరించారు. గడిచిన 40 సంవత్సరాలుగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం సీడ్ బాల్స్ తయారు చేసి విద్యార్థులతొ, నావికా దళానికి చెందిన హెలికాప్టర్లతొ కొండల మీద జల్లు తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది అటవీశాఖ అధికారులు రత్నం శిక్షణ ఇవ్వడం ద్వారా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేసి కొండల మీద జల్లడం జరుగుతోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేథ్స్ టీచర్ కె సునీత, అధ్యాపకులు మాధవి, డ్రిల్ మాస్టర్ డాక్టర్ ఆనంద్, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి, ఎన్ సి సి 13వ బెటాలియన్ హవల్దార్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెందుర్తి పోలీసులు

విశాఖపట్నం, జూలై 6, ప్రభాతవార్త :

విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమంపెందుర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆదేశాలు, పెందుర్తి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సుమిత్ కుమార్ చైతన్య స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహనతో పాటు విద్యార్థులు అటువంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువు, వ్యక్తిత్వం, కుటుంబ జీవితం భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాల జోలికి వెళితే జీవిత లక్ష్యాలు దూరమవుతాయని, మంచి విద్య, క్రమశిక్షణ, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పట్ల గౌరవం, సత్సంగతితోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని, పెందుర్తి పోలీసుల అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు ఆదర్శం

గాజువాక,జులై 6,ప్రభాతవార్త:

దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పాత కర్నవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమ వారం ముఖర్జీ 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింగరావు మాట్లాడుతూ.. 'ఒకే దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదు' అని ముఖర్జీ నాడు పోరాడారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకాశ్మీర్‌ను దేశంలో విలీనం చేశారని గుర్తుచేశారు. నాడు ఆయన స్థాపించిన జనసంఘ్.. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.శంకరరావు, సోంబాబు, బి.ఎల్లాజీరావు, నాగేశ్వరరావు, రోహిణి, భువనేశ్వరి, కట్టా పద్మ, జె.శ్రీను, రంగనాయకులు, బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

విశాఖపట్నం జూలై 6 ప్రభాతవార్త

పొర్లుపాలెం గ్రామంలో యువతకు మత్తు పదా ర్థాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ ఆదేశాలు, సూచన ల మేరకు, సబ్ ఇన్స్పెక్టర్ జిలాని పొల్లుపాలెం గ్రామంలో యువతతో "ముఖాముఖి" కార్యక్రమాన్ని నిర్వహిం చి, మత్తు పదార్థాల నివారణ తో పాటు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పిం చారు. సబ్ ఇన్స్పెక్టర్ జిలాని మాట్లాడుతూ, మత్తు పదా ర్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా, వారి ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం సమాజంలో వారి గౌరవాన్ని దెబ్బతీ స్తాయని వివరించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి, క్రమశిక్షణ, మంచి స్నేహాలు, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని యువతకు సూచించారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొని, పెందుర్తి పోలీసుల ప్రజా చైతన్య కార్యక్రమాన్ని అభినందించారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్‌లో బదిలీలు

ఏసీపీ, టీపీఓ స్థాయిలో అధికారుల స్థానచలనం..

సిఫార్సులకే పెద్దపీట అంటూ ప్రచారం

విశాఖపట్నం, జూలై 6 ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో సిఫార్సులకు పెద్దపీట వేశారనే ప్రచారం అధికార వర్గాల్లో సాగుతోంది. ఉత్తర్వుల ప్రకారం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మధురవాడ జోన్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా విధులు నిర్వహిస్తున్న శాస్త్రి సభనంను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. అలాగే, రాజాం మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)గా పనిచేస్తున్న డి. తేజేశ్వరరావును జీవీఎంసీకి బదిలీ చేశారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ)లో అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ (ఏపీవో)గా పనిచేస్తున్న పి. గౌరును డిప్యూటేషన్‌పై జీవీఎంసీలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించారు.

ఈ బదిలీలు సాధారణ పరిపాలనా అవసరాల మేరకే జరిగాయా? లేక సిఫార్సుల ఆధారంగా చేపట్టారా? అనే అంశంపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆనందపురం, జూలై 6, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలోని బోయిపాలెం గ్రామంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిపాలెం గ్రామానికి చెందిన బట్ట అప్పలనరసయ్య గత రెండేళ్లుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంభం సభ్యులు తెలిపారు.ఇదిలా ఉండగా ఆయన భార్య, కుమారుడు పనిమీద పార్వతీపురం వెళ్లగా, అప్పలనరసయ్య ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో పురుగుల మందు తాగారు. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆయన అస్వస్థతను గమనించి ప్రశ్నించగా, పురుగుల మందు సేవించినట్లు చెప్పారు.

వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. కాగా అప్పలనర్సయ్య చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మృతుడి కుమారుడు బట్ట ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసుని ఆనందపురం పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు.

బడుగుల అభ్యున్నతికే జగ్జీవన్‌రామ్ కృషి

గాజువాక,జులై 6,ప్రభాతవార్త :

దళిత, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ రెండు కళ్లలా నిలిచారని గాజువాక, పెందుర్తి మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి కొనియా డారు. పెద్దగంట్యాడ 75వ వార్డు జంక్షన్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన 40వ వర్ధంతి నిర్వహించారు. వైకాపా గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డితో కలిసి వారు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ కేంద్రంలో ఏడు శాఖలకు కేబినెట్ మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పార్లమెంట్‌లో ఆమోదం పొంది, పక్కాగా అమలయ్యేలా ఆయన ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.పరదేశి, జి.గోవింద, జి.పైడిరాజు, గొందేసి శ్రీనివాసరెడ్డి (బుజ్జి), జి.మహేశ్వర్‌రెడ్డి, కొయ్య భారతి, డాక్టర్ రాజారావు, ఎ.దీపక్, ఎస్.ఈశ్వరరావు, జి.రాజారాణి పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై కళ్యాణ కోదండరాముడు గ్రామోత్సవం

గొలుగొండ జులై 6 ప్రభాతవార్త

జానకిరామ్పురంలో వెలసి ఉన్న శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా పెండ్లి కొడుకుగా చంద్రప్రభ ప్రభా వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడు రోజుల కళ్యాణ మహోత్సవంలో మొదటిరోజు పెండ్లి కొడుకుగా గ్రామోత్సవం లో పరిసర గ్రామాల్లో పల్లకిలో తిరుగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. జానకిరాంపురం కోదండరామ స్వామి ఆలయం నుండి బయలుదేరి నర్సింగపల్లి పరిసర గ్రామాలలో పెండ్లికొడుకుగా ఊరేగుతూ హారతులు అందుకున్నారు. మహిళలు పెద్దలు భక్తులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి కోదండ రాముని దర్శించుకుని మొక్కుని సమర్పించుకున్నారు. ఏడో తేదీ ఉదయం 9 గంటలకు కోదండ రామస్వామి కళ్యాణం, అనంతరం అన్న సమారాధన, ఎనిమిదో తేదీ ఉదయం శ్రీ పుష్పయాగం పంచామృత స్నానం అదే రోజు సాయంత్రం శ్రీ పుష్పయాగం మూడు రోజుల కార్యక్రమం ముగుస్తుందని శ్రీ కోదండరామ ఆలయ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో పాటు నిత్య కృషివల్యుడు నెల్లిపూడి సూరిబాబు కుమారి దంపతులు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణానికి దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన

అనకాపల్లి, జూలై 6 (ప్రభాతవార్త)

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంతో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన, ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, క్రియాశీల కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ కమెడియన్ ఆటో రాంప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను కొణతాల రామకృష్ణ ఆప్యాయంగా పలకరించి, జరుగుతున్న సంస్థాగత నిర్మాణ కార్యక్రమంపై చర్చించారు. అనంతరం రాంప్రసాద్ జనసైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ తరఫున ప్రచారంలో రాంప్రసాద్ హాజరై కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారని అన్నారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో విశాఖపట్నంలోని దస్పల్ల హోటల్‌లో నిర్వహించిన పార్టీ సారథుల సమాచార సేకరణతో పాటు వివిధ సంస్థాగత పదవుల కోసం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విశేష స్పందనతో విజయవంతంగా ముగిసింది. కొణతాల నేతృత్వంలో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నదని నాయకులు పేర్కొన్నారు. దీంతో పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి: వైకాపా మండల అధ్యక్షుడు గిరిప్రసాద్

గూడెం కొత్తవీధి జులై 6 ప్రభాతవార్త

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైకాపా జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు బుధవారం (ఈ నెల 8న) ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు, 16 పంచాయతీల అధ్యక్షులు,56 పోలింగ్ బూత్ కమిటీల సభ్యులు,కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రేబీస్ టీకాల శిబిరం

అనకాపల్లి జూలై 6 (ప్రభాత వార్త)

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గాంధీనగర్, అనకాపల్లిలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత రేబీస్ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా వెటర్నరీ హాస్పిటల్, అనకాపల్లి డా. చి. గణేష్, ఉప సంచాలకులు, అసిస్టెంట్ డైరెక్టర్ డా. బి. సౌజన్య ఆధ్వర్యంలో డా. పి. రాజేష్, డా. బి. పృథ్వి సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో బి.వొకేషనల్ డెయిరీయింగ్ అండ్ యానిమల్ హస్బెండ్రీ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులపై, ముఖ్యంగా రేబీస్ నివారణ , టీకాల ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని వారు ఆసక్తిగా వీక్షించి, ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పొందారు. విద్యార్థుల భాగస్వామ్యం ద్వారా సమాజంలో ప్రజారోగ్యం, పశు సంక్షేమం జూనోటిక్ వ్యాధుల నివారణపై అవగాహన మరింత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నాణ్యతతో పూర్తి చేయాలి

భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి

అనకాపల్లి, జూలై 6 (ప్రభాత వార్త):

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ - 2026(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ లతో కలసి మునగపాక గ్రామం, సచివాలయం - 2 పరిధిలోగల పోలింగ్ స్టేషన్ నెంబర్ 165 సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలు, వాటి పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియ, నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి దశను జాగ్రత్తగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని ప్రధాన కార్యదర్శి కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆయేషా, ఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి

అనకాపల్లి, జూలై 6 (ప్రభాత వార్త):

గవరపాలెంలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారిని సోమవారం ఉదయం భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.బి. జోషి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆయనకు దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్ ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ఆర్డీవో అయేషా, జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, పైడ్రాజు,యర్రవరపు సంతోషి కుమారి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 396 మీద ప్రభుత్వం పునరాలోచన చేయాలి

దస్తావేజులేఖర్లు నిరసన

అనకాపల్లి, జూలై 6 ;(ప్రభాత వార్త)

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలలో ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకుని వచ్చిన జీవో నెంబర్ 396 అమల మీద పునర్ఆలోచన చేయాలని కోరుతూ దస్తావేజులేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల లో దస్తావేజులేఖర్లు పెన్డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం అనకాపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రర్ వారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజులేఖరులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలలో ప్రైవేటు భాగస్వామ్యం వలన స్థిరాస్తులు విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నదని ఈ విషయాన్ని గుర్తించాలని వారు కోరారు. ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల్స్ శాఖ సేవలు అందించిన విషయంలో దశాబ్దాల కాలంగా దస్తావేజులేఖర్ల వృత్తినే తమ జీవనోపాధిగా భావించి జీవనం సాగిస్తున్న రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి వేలాదిమంది దస్తావేజు లేఖరులు వారి సహాయకులు టిడిపి ఆపరేటర్లు స్టాంప్ వెండర్లు ఈ విధంగా లక్షలాదిమంది రోడ్డున పడే ప్రమాదం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతాద దృష్టితో ఆలోచించి జీవో నెంబర్ 396 అమల మీద పునరాలోచన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అనకాపల్లి దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ దేవత గుడికి గ్రావెల్ రోడ్డు నిర్మాణం

గొలుగొండ జులై 6 ప్రభాతవార్త

కసిమి పంచాయితీ ధోనెపాలెంలో గ్రామదేవత ఆలయానికి గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు కవల మహేష్ సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్తుల కోరిక మేరకు సొంత నిధులతో గ్రామ దేవత గుడికి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తమకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి బాబురావు,బూత్ కన్వీనర్ ఈ బుచ్చిబాబు, కార్యదర్శులు కె సాయి, హెచ్ శివ, హెచ్ రాజు, కె రాము,ఈ మచ్చిరాజు, జి మహేష్ మరియు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా సమాచార,పౌర సంబంధాల అధికారిగా కె. అన్నమ్మ బాధ్యతల స్వీకరణ

పాడేరు,జూలై6,ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా సమాచార అండ్ పౌర సంబంధాల అధికారిగా కె. అన్నమ్మ బాధ్యతలు స్వీకరించారు. డీపీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ టి. నిశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ కి తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ శాఖ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేస్తూ, నూతన బాధ్యతలు స్వీకరించిన కె అన్నమ్మకు కలెక్టర్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కె అన్నమ్మ గతంలో విశాఖపట్నం ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించారు. అలాగే హైదరాబాద్‌లోని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సంస్థలో ఐదు సంవత్సరాల పాటు ప్రాజెక్ట్ మేనేజర్ గా సేవలందించారు. పరిపాలనా రంగంలో విశేష అనుభవం కలిగిన ఆమె ప్రస్తుతం అల్లూరి జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

కేజీబీవీ పదవ తరగతి గిరి విద్యార్థిని మృతి

దుంబ్రిగుడ, జులై 6 ప్రభాతవార్త:

స్థానిక కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. హోమ్సిక్ తో సెలవు తీసుకుని కుటుంబీకులతో గడిపి హఠత్తుగా అస్వస్థతకు గురై ఆసుపత్రికి చేరి గంట వ్యవధిలోనే గిరి విద్యార్థిని మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హఠత్తుగా అస్వస్థతకు గురై కుమార్తె మృతి చెందడంపై ఆ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది. వివరాలు తెలిసిన ఇలా ఉన్నాయి. దుంబ్రిగుడ కస్తుర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి బడ్నాయిని లక్ష్మీదేవి(15) పదో తరగతిలో విద్యనభ్యసిస్తోంది పాఠశాల పునఃప్రారంభం నుంచి విద్యార్థిని పాఠశాలలోనే ఉంది ఈనెల 4న విద్యార్థిని తండ్రి బడ్నాయిని రామస్వామి పాఠశాలకొచ్చి (హోమి సిక్)పై సెలవు అడిగి స్వగ్రామానికి తీసుకెళ్లారు శనివారం సాయంత్రం విద్యార్థినికి అజీర్థి ఉండడంతో బాధిత కుటుంబీకులు పోదును రాసారు. ఆదివారం ఉదయం కూడ ఇదే పద్ధతిలో పోదును రాసారు మధ్యాహ్నం హఠత్తుగా అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక పీహెచ్సీ దుంబ్రిగుడలో బాధిత విద్యార్థిని తరలించారు. ఇక్కడి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య నిమిత్తం ఆదివారం సాయంత్రం అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు బాధిత కుటుంబీకులు బోరుమంటూ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ విషయంపై ఆ పాఠశాల యాజమాన్యానికి సంప్రదించగా ఆరు నుంచి పది వరకు విద్యనభ్యసించిన బాధిత విద్యార్థిని ఇప్పటికీ అనారోగ్యానికి గురి కాలేదన్నారు నిత్యం ఆరోగ్యంగానే ఉంటూ అందరి పిల్లలతో సరదగా గడిపేదన్నారు. ఈనెల 4న బాధిత విద్యార్థిని తండ్రి పాఠశాలకొచ్చి (హోమ్సిక్)పై సెలవును అడిగి ఇంటికి తీసుకెళ్లారని సిబ్బంది పేర్కొన్నారు విద్యార్థిని అస్వస్థతకు గురైనట్లు ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబీకులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఆ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మ తెలిపారు. అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకునేలోపు విద్యార్థిని మృతి చెందిందన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బాధిత విద్యార్థిని స్వగ్రామానికి చేరుకుని కుటుంబీకులను పరామర్శించడం జరిగిందన్నారు విద్యార్థిని మృతిపై ఉన్నత అధికారులకు నివేదికను అందజేయనున్నామని ఆమె తెలిపారు.

ఎస్ఐఆర్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

దుంబ్రిగుడ, జులై 6 ప్రభాతవార్త:

ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బీఎల్ఎలు ఇంటింటికెళ్లి సర్ ప్రక్రియను చేపట్టాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పదని ఎమ్మెల్యే మత్స్యలింగం హెచ్చరించారు. మండలంలోని కొల్లాపుట్టు, గసభ, అరుకు, కొర్రాయి, సొవ్వా సచివాలయలను ఆకస్మికంగా ఎమ్మెల్యే తనిఖీ చేశారు ఓటరు నమోదు ప్రక్రియ పురోగతి, బీఎల్ ఓల పనితీరు, కొత్త ఓటర్ల నమోదుపై అడిగి తెలుసుకున్నారు. సచివాలయల వారిగా సిబ్బంది విధి నిర్వహణపై రికార్డుల తనిఖీ చేశారు బీఎల్ ఓలు అలసత్వం వహిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హెచ్చరించారు. అనంతరం సొవ్వా గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేసిన ఆయన గిరిజన విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ ఆనందరావు, నాయకులు రాంప్రసాద్, ఆశోక్కుమార్, కురంజన్, బీమరాజు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

జూలై 10 లోగా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలి -ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూలై6,ప్రభాతవార్త:

అల్లూరి జిల్లావ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి. నిశాంతి అధికారులను ఆదేశించారు. జూన్ 15, 2026 నుండి ప్రారంభమైన ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని, అయితే జూలై 10వ తేదీ లోగానే 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలని స్పష్టం చేశారు. మిగిలిన రెండు రోజులను కేవలం వివరాల వెరిఫికేషన్ (తనిఖీ) కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. సోమవారం ఆమె అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా నియమించబడిన 624 మంది బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్ల వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అరకు వ్యాలీ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల మొత్తం 4,99,752 మంది ఓటర్లకు సంబంధించి, ఎలక్టోరల్ స్పెసిఫిక్ ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ దాదాపు వంద శాతం పూర్తయిందని ఆమె పేర్కొన్నారు.

ముమ్మరంగా డిజిటలైజేషన్ ప్రక్రియ:

ముద్రించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 45.96 శాతం (2,29,689 ఫారాలు) డిజిటలైజేషన్ పూర్తయింది. నియోజకవర్గాల వారీగా ప్రగతి పరిశీలిస్తే:

అరకు వ్యాలీ నియోజకవర్గం:

ఈ నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లో (ముంచింగిపుట్టు, పెదబయలు, హుకుంపేట, దుంబ్రిగుడ, అరకు వ్యాలీ, అనంతగిరి) 2,48,665 ఓటర్ల ఫారాల పంపిణీ 100% పూర్తి కాగా, 48.01% డిజిటలైజేషన్ పూర్తయింది. ఇందులో ముంచింగిపుట్టు మండలం 52.16 శాతంతో జిల్లాలోనే ముందంజలో ఉంది.

పాడేరు నియోజకవర్గం

ఈ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో (జి.కె.వీధి, కొయ్యూరు, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు) 2,51,087 ఓటర్లకు గానూ 2,51,083 ఫారాల పంపిణీ పూర్తయింది. ఇక్కడ ప్రస్తుతం 43.93% డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. నిర్ణీత గడువు జూలై 10 లోగా డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి, ఆ తర్వాత తప్పుల సవరణలు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఈ ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ అధికారులు, ఏఆర్ఓలు, సంబంధిత ఎన్నికల సిబ్బందిని కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్ తప్పదు - జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరిక:

జిల్లా కలెక్టర్ డజిల్లా ఎన్నికల అధికారి టి.నిశాంతి:

భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అడిషనల్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ లుగానియమితులైన ప్రతి ఒక్క జిల్లా అధికారి తమకు కేటాయించిన ఎన్నికల విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి. నిశాంతి స్పష్టం చేశారు.ఈ ఆదేశాలను అతిక్రమించి, విధులకు గైర్హాజరైనా లేదా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైనా అటువంటి అధికారుల ప్రవర్తనను అత్యంత తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై ఈరోజే సస్పెన్షన్ తో కూడిన తక్షణ క్రమశిక్షణా చర్యలు ప్రారం భించబడతాయని ఆమె తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అధికారులకు ఇదే చివరి హెచ్చరిక అని, దీనిపై మళ్లీ ఎలాంటి రిమైండర్లు లేదా నోటీసులు జారీ చేయబడవని స్పష్టం చేశారు. అధికారులు ఎవరూ ఎలాంటి సాకులు చెప్పకుండా తక్షణమే తమ విధుల్లో నిమగ్నం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశించారు.

ఎస్ ఐ ఆర్ పై అవగాహన

దుంబ్రిగూడ, జూలై 6 ప్రభాతవార్త

ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు కార్యక్రమంపై మండల కేంద్రంలోని అల్లూరి కమ్యూనిటీ భవనంలో సోమవారం ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం దేనికి చేపడుతున్నామని దానిపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనం తరం ఓటర్ల నమోదు పత్రాలను తీసుకుని ఆన్లైన్లో నమోదు చేశారు. స్థానిక పంచాయితీ కార్యదర్శి గౌతమి, వీఆర్వో సత్యనారాయణ, బి ఎల్ ఓ శాంతి కుమారి ఓటర్లు పాల్గొన్నారు.



గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు కృత్రిమ మేధస్సును, ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలి

ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన యువతకు సాంకేతిక రంగంలో అద్భుతమైన అవకాశాలు కల్పించేందుకు పాడేరుఐటిడిఏ పరిధిలోని అర్హత కలిగిన షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టి) యువత కోసం "ఆరోహణ్" (అడ్వాన్స్ ఏఐ రెడీనెస్ అపర్చునిటీ హబ్ ఫర్ అస్పిరేషనల్ నావిగేటర్స్) ఏఐ డిజిటల్ స్కిల్స్ పైలట్ ఫెలోషిప్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు పాడేరు ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ పేర్కొన్నారు. సోమవారం పాడేరు ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మొదట విడతగా 14 మంది విద్యార్థులతో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశల వారీగా మూడు బ్యాచులలో ఆరు నెలల కాల వ్యవధిలో ఆన్లైన్, ఆఫ్ లైన్ నందు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రాంత గిరిజన యువతలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ), డిజిటల్ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం, ఆంగ్ల కమ్యూనికేషన్, వృత్తిపర్య వికాసం పెంపొందించి, సాంకేతిక రంగంలో ఉన్నత సామర్థ్యం కలిగిన గిరిజన యువతను గుర్తించి ప్రోత్సహించడం ఈ శిక్షణా తరగతుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన షెడ్యూల్ ట్రైబ్ (ఎస్ టీ) యువత అయి ఉండి, 18 నుండి 28 సంవత్సరాల లోపు వయసు కలవారై, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా,డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఎంపిక చేసిన యువతీ యువకులకు ఈ శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గిరిజన యువతీ యువకులు ఈ సుభ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ పిటిజి ఏపీవో వెంకటేశ్వర్లు, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు: ఇద్దరు బూత్ లెవెల్ అధికారులపై సస్పెన్షన్

జిల్లా కలెక్టర్అండ్ జిల్లా ఎన్నికల అధికారి టి.నిశాంతి

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

కొయ్యూరు మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి. నిశాంతి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కొయ్యూరు గ్రామంలో 75,76 బూతులు ఉన్న ఓటర్లు ఇవ్వబడి పనుచేస్తున్నట్లు అందిన నివేదికల ఆధారంగా ఇద్దరు బూత్ లెవెల్ అధికారులపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొయ్యూరు మండలం కొయ్యూరు గ్రామం, కొయ్యూరు గ్రామపంచాయతీ కి చెందిన బూత్ నంబర్--76కు అదనపు బూత్ లెవెల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బూత్ నంబర్--75కు బూత్ లెవెల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీ జి. శివశంకర్ (ఇంజినీరింగ్ అసిస్టెంట్) శ్రీమతి ఎ. సవభారతి (వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్), ఓటరు జాబితా ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల మేరకు సక్రమంగా నిర్వహించకపోవడంతో వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒ జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమని, ఇందులో పాల్గొనే జిల్లా నుండి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులు, ఉద్యోగులు తమ విధులను పూర్తి బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఏ అధికారి లేదా ఉద్యోగిపైనా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో పై కఠిన చర్యలు తప్పవని అన్ని మండలాల అధికారులను హెచ్చరించారు.

విశాఖ జోన్-1 పరిధిలోని వివిధ ఉద్యోగ సంఘాలతో సమీక్షా సమావేశం

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

ప్రాంతీయ సంచాలకులు, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, విశాఖ పట్నం కార్యా లయంలో ఇంచార్జి ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి. మీనాక్షి అధ్యక్షతన సోమ వారం రాష్ట్రపతి ఉత్తర్వులు - 2025 నేపథ్యంలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలపై విశాఖ జోన్-1 పరిధిలోని వివిధ ఉద్యోగ సంఘాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశాఖ జోన్-1 పరిధిలోని ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చలు జరిపారు. సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు: రాష్ట్రపతి ఉత్తర్వులు – 2025 ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లాను పూర్వ విశాఖపట్నం జోన్-1 నుండి జోన్-2 పరిధిలోకి మార్చడం వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు. ఈ మార్పు వల్ల స్థానిక హక్కులకు భంగం ఉద్యోగుల సీనియారిటీ, పదోన్నతుల్లో గందరగోళం పరిపాలనా ఇబ్బందులు విద్యార్థులు,లోకల్ స్టేటస్ సమస్యల కుటుంబ విభజన, ఆరోగ్య, సేవా సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయ ని సంఘ నాయకులు ఆమెకు వివరించారు. అల్లూరి జిల్లాను యథావిధిగా పూర్వ విశాఖపట్నం జోన్--1లోనే కొనసాగించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371-డి స్ఫూర్తిని కాపాడుతూ, వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభ్యర్థుల స్థానిక హక్కులను పరిరక్షించాలి. జోన్ మార్పు వల్ల ఏర్పడుతున్న సీనియారిటీ, బదిలీలు, పదోన్నతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్ళారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిశంకర్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఎల్.రవీంద్రబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుల్లేలి సింహాద్రి, పాడేరు సిటీ యూనిట్ అధ్యక్షులు కంబిడి సుబ్రహ్మణ్యం, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చిన్నబాబు ఉద్యోగ సంఘ నాయకులు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ డ్రైవ్‌ను పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ

గూడెం కొత్తవీధి జూలై 6 (ప్రభాతవార్త):

మండలంలోని డి. అగ్రహారం గ్రామంలో గల 23వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ సోమవారం సంద ర్శించారు. ఈ సందర్భం గా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక ఈఎఫ్ (ఎలక్టోరల్ ఫారం) సేకరణ డ్రైవ్‌ను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్రజల నుంచి మొత్తం 73 ఈఎఫ్ దరఖాస్తులను అధికారులు సేకరించారు. సేకరించిన ఈ దరఖాస్తులన్నింటినీ సోమవారం రాత్రికే పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ (ఆన్‌లైన నమోదు) చేయనున్నట్లు సంబంధిత సిబ్బంది వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పనులను అత్యంత పారదర్శకంగా,వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీ.కే వీధి తాసిల్దార్ హెచ్ అన్నాజీ రావు, రెవిన్యూ సిబ్బంది పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో 50.69 శాతం పురోగతి

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

అల్లూరి జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ--2026 కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 50.69 శాతం పురోగతి నమోదైంది. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని మండలాల అధికారులు, బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు), గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశాల మేరకు జూలై 10 నాటికి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అధికారులు ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్య సాధనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రపంచ జూనోసెస్ దినోత్సవం

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

"ఒకే ఆరోగ్యం జంతువుల రక్షణ, మానవాళి సురక్ష!" 1885లో లూయిస్ పాశ్చర్ రేబీస్ వ్యాక్సిన్‌ను కనుగొన్న చారిత్రక రోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జూలై 6న వరల్డ్ జూనోసెస్ డే సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఉచిత రాబీస్ వ్యాధి నివారణ టీకాలు పెంపుడు కుక్కలకు పాడేరు పశువుల ఆస్పత్రిలో వైద్యులు వేశారు. జంతువుల నుండి మనుషులకు వ్యాపించే వ్యాధుల పట్ల (రేబీస్, కోవిడ్-19, ఆంత్రాక్స్ మొదలైనవి) అవగాహన పెంచడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్త రేబీస్ నిర్మూలన ప్రచారంలో భాగంగా మన అల్లూరి జిల్లా, పాడేరు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వ్యాక్సినేషన్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు. 146 పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ-రేబీస్ వ్యాక్సిన్ పాడేరు పశువుల హాస్పిటల్‌లో వేశారు. రేబీస్ వ్యాధి లక్షణాలు బయటపడితే అది 100% ప్రాణాంతకం, కానీ సకాలంలో వ్యాక్సిన్ వేయిస్తే 100% నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. పాడేరు వెటర్నరీ హాస్పిటల్‌లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ సంవత్సరం పొడవునా అందుబాటులో ఉంటుందని ఏదైనా కారణంతో పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించని యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీకు వీలైనప్పుడు మీ పెంపుడు జంతువును తీసుకురావచ్చు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని ప్రతి సంవత్సరం తప్పనిసరిగా వేయించాలన్నారు. పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ కార్యక్రమంలో వైద్యులు డా.రాజేష్, డా.ప్రియదర్శిని, డా.భాగ్యలక్ష్మి, డా.వేణుమాధవ్, అసిస్టెంట్స్ కృష్ణ, సాయి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూలై6,(ప్రభాతవార్త):

ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.నిశాంతి సోమవారం పాడేరు మండలంలోని పోలింగ్ స్టేషన్ నెం. 270 - నడిమివీధిను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ, నమోదవుతున్న పురోగతిని పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియను జూలై 10వ తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు మండల కేంద్రంలో టీడీపీ ఓటర్ల జాబితా సమీక్ష

గూడెం కొత్తవీధి,జూలై 6, (ప్రభాతవార్త

నేడు గూడెం కొత్తవీధి మండల కేంద్రంలోని 'వెలుగు' కార్యాలయ వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా కార్యక్రమంపై కీలక సమీక్ష నిర్వహించనున్నారు.ఈ సమావేశానికి పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరవుతా రని గూడెం కొత్తవీధి టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రూరు కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 పంచాయతీలకు చెందిన క్లస్టర్,యూనిట్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు,56 బూత్‌ల బీఎల్ఏలు,వివిధ సంఘాల చైర్మన్లు,మాజీ ప్రజాప్రతి నిధులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు ఈ సమావేశానికి సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కొండలరావు కోరారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు

పాడేరు,జూలై,(ప్రభాతవార్త):

ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఎం.వి.ఎస్. లోకేశ్వర రావు సోమవారం ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు చేశారు.

టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ చేసిన సూచనలు ఇవీ..

జిల్లాలోని అన్ని సచివాలయాలు రాబోయే మూడు రోజుల పాటు 24 గంటలు పనిచేస్తూ, ఫారాల డిజిటలైజేషన్‌కు పూర్తి సహకారం అందించాలి. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను జూలై 10 నాటికి 100 శాతం పూర్తి చేయాలి. ప్రతి రోజు కనీసం 15 శాతం కంటే ఎక్కువ పురోగతి సాధించేలా లక్ష్యాలు నిర్దేశించుకుని పని చేయాలి. 50 శాతం కంటే తక్కువ పురోగతి సాధించిన బీఎల్ఓలు పై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మూడు రోజుల పాటు అన్ని సచివాలయాలను నిరంతరం తెరిచి ఉంచి ప్రజలకు సేవలు అందించాలి. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ కోసం ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, ఆధార్ నంబర్ ఉన్నా సరిపోతుంది. ఫొటో విషయంలో భౌతిక (ప్రింట్) కాపీ కోసం పట్టుబట్టకుండా, డిజిటల్ ఫొటోను కూడా స్వీకరించాలి. మండల డిప్యూటీ ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయించాలి. ఈ ప్రక్రియకు సంబంధించిన వ్యయ బిల్లులను కలెక్టర్ కార్యాలయానికి సమర్పిస్తే, తక్షణమే బిల్లులు క్లియర్ చేస్తామని డీఆర్ఓ తెలిపారు.

ఆకులూరిలో అధ్వానంగా కల్వర్టు నిర్మాణం

గూడెం కొత్తవీధి జూలై 6 (ప్రభాతవార్త

మండలం పరిధిలోని గాలికొండ పంచాయతీ ఆకులూరి గ్రామంలో రోడ్డు కల్వర్టు నిర్మాణం అధ్వానంగా తయారైంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాణ్యతా లోపం కారణంగా ఈ కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రమాదకర స్థితికి చేరుకుంది. ప్రస్తుతం చేపట్టిన నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని బేస్‌మెంట్ మరియు సిమెంట్ కట్టుబడి పనులు చాలా నాసిరకంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పులు, తుఫాను ముప్పు కారణంగా నాణ్యత లేని కల్వర్టు మట్టి కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షం వస్తే ఆకులూరి గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి

పీఎం పాలెం, (ప్రభాతవార్త

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఆయన జయంతోత్సవాలు దేశ వ్యాప్తంగా (పతి బూత్ లో కూడా జరపాలని భారతీయ జనతా పార్టీ జాతీయ పార్టీ ఇచ్చినటువంటి ఆదేశాల మేరకు ఈరోజు పిఎం పాలెంలో గల 267 వ బూత్ లో మండల అధ్యక్షులు సి హెచ్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కె ఎన్ పి చక్రవర్తి హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ ఐక్యత కోసం పోరాడి ఒక దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదని ఆర్టికల్ 370 కి వ్యతిరేకంగా పోరాడి కాశ్మీర్ లోకి ప్రవేశించిన వెంటనే 42 రోజుల్లో అనుమానాస్పదంగా మరణించిన విధానాన్ని తెలియచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ ఐక్యత కోసం పోరాడి బలిదానం ఐన మొట్టమొదటి వ్యక్తి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కామేష్ అయ్యగారి, మహిళామోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరత్నం, మండల ఉపాధ్యక్షులు పెద్దాడ శ్రీనివాస్, సుబ్బరాజు, ఎల్లపు ఈశ్వరరావు, రత్నశేఖర్, కృష్ణంరాజు, అప్పలరాజు, పట్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు

మరమ్మతు పనుల కారణంగా 7న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పీఎం పాలెం, జూలై 6, (ప్రభాతవార్త

11 కేవీ చిన్నముషిడివాడ ఫీడర్ లైన్‌పై మరమ్మతులు, వైరులు మార్పిడి పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూలై 7 (మంగళవారం) ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ప్రాంతాలు పాత ఊరు, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏరియా, ఎస్సీ--బీసీ కాలనీ, నాగేంద్ర కాలనీ, సాయినగర్, అశోకనగర్, ద్రోణంరాజు నగర్, చిన్నయ్య కాలనీ, శారదా పీఠం పరిసర ప్రాంతాలు తదితర ప్రాంతాలు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని, అసౌకర్యానికి చింతిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీహరిపురంలో 'కరెంట్' కష్టాలు!

అడ్డగోలుగా కనెక్షన్ల మంజూరు.. కుదేలవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు -రాత్రి, పగలనక నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా -ఉప ప్రాంతీయ కార్యాలయ అధికారిపై వినియోగదారుల ఆగ్రహం

గాజువాక,జూలై 6,(ప్రభాతవార్త

ఏపీ ఈపీడీసీఎల్ జోన్-2 పరిధిలోని శ్రీహరిపురం విద్యుత్ ఉప ప్రాంతీయ కార్యాలయం పరిధిలో కరెంట్ కష్టాలు వినియోగదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముందస్తు సమాచారం లేకుండా రాత్రి, పగలనే తేడా లేకుండా గంటల తరబడి నిలిచిపోతున్న విద్యుత్ సరఫరాతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వుడా కాలనీ, సీతారాంనగర్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, శ్రీహరిపురం పరిసర ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా కనెక్షన్లు మంజూరు చేయడం వల్లే ఈ సమస్య తలెత్తుతోందని వినియోగదారులు మండిపడుతున్నారు.

మింగేస్తున్న 'లోడ్'.. పేలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

నిబంధనల ప్రకారం గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లు, లిఫ్టులు ఉన్న భవనాలకు ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే, సదరు విద్యుత్ ప్రధాన అధికారి కాసుల కక్కుర్తితో నిబంధనలను పక్కనబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 20 కిలోవాట్ల కంటే ఎక్కువ లోడ్ ఉన్న అపార్ట్‌మెంట్లకు సైతం కేవలం మీటర్లతో సరిపెట్టేస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల సాధారణ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ విపరీతంగా పెరిగిపోయి తరచూ ట్రిప్ అవ్వడం, కొన్నిసార్లు పేలిపోవడం జరుగుతోంది. ఫలితంగా గంటల తరబడి అంధకారం నెలకొంటోంది.

ఫిర్యాదులు చేసినా నిర్లక్ష్యమే...

సమస్య తీవ్రతపై స్థానికులు మొరపెట్టుకుంటున్నా సదరు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని బల్ల కింద చేతులు మారుతున్నాయంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ అధికారి అవినీతిపై ఉన్నతాధికారులు, ఏసీబీ, విజిలెన్స్ విభాగాలకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందినప్పటికీ.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సిబ్బందిపై ఉన్నతాధికారుల 'కన్నెర్ర'...

సదరు అధికారి ఆరోపణలకు సాక్షాత్తు ఎస్ఈ, డీఈ స్థాయి ఉన్నతాధికారులు కొమ్ముకాస్తున్నట్లు సిబ్బందిలోనే అంతర్గత దుమారం రేగుతోంది. ఇటీవల నిర్వహించిన సిబ్బంది సమావేశంలో కొందరు అధికారులు సదరు అధికారి తప్పును మాట్లాడుతూ.. సిబ్బందిపై కన్నెర్ర చేసినట్లు సమాచారం. "ఆమె అక్కో పెట్టో అయితే ఇలానే చేస్తారా? సిబ్బంది అంతా సహకరించాల్సిందే" అని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ సహకరించకపోతే అరకు, చింతపల్లి, పాడేరు వంటి మారుమూల ప్రాంతాలకు బదిలీ చేస్తామని క్షేత్రస్థాయి సిబ్బందిని బెదిరిస్తున్నారంటే జోన్‌లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్రీహరిపురం విద్యుత్ సమస్యను పరిష్కరించి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేత

విశాఖపట్నం, జూలై 6, (ప్రభాతవార్త):

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో న్యాయం చేయాలని కోరుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) డాక్టర్ మీనాక్షికి వినతిపత్రం అందజే శారు. రేషపువానిపాలెంలోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వం ఉన్న ఉద్యోగులకు బదిలీల సమయంలో వారు కోరుకున్న ప్రాంతాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అంధులు, బధిరులకు కేటాయించిన పదోన్నతి ఖాళీలు భర్తీ కాకపోతే, క్యారీ ఫార్వర్డ్ నిబంధనల ప్రకారం శారీరక దివ్యాంగ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. జోన్ల మార్పుల కారణంగా శారీరక దివ్యాంగ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీనియారిటీ జాబితాలో అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని రీజినల్ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు తంగేటి వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు షైనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో రోడ్ల విస్తరణకు వేగం

ప్రతిపాదిత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూలై 6, (ప్రభాతవార్త):

పెందుర్తి జోన్ పరిధిలో రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. 97వ వార్డులోని క్రమశక్తి నగర్, చిన్న ముషిడివాడ పాత గ్రామం ప్రాంతాల్లో ప్రతిపాదిత రహదారి విస్తరణ పనులను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్రమశక్తి నగర్‌లో సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున 60 అడుగుల వెడల్పుతో ప్రతిపాదించిన రహదారి విస్తరణను పరిశీలించిన కమిషనర్, ఇప్పటికే ఉన్న 60 అడుగుల రహదారిని మిగిలిన భాగంలోనూ కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ విస్తరణతో ఎదురయ్యే ఆస్తుల ప్రహరీ గోడలు ప్రభావితమవుతాయని అధికారులు వివరించారు. అనంతరం చిన్న ముషిడివాడ పాత గ్రామంలో ప్రస్తుతం 30 అడుగుల వెడల్పు ఉన్న 1.2 కిలోమీటర్ల రహదారిని 60 అడుగులకు విస్తరించే ప్రతిపాదనను పరిశీలించారు. ఈ పనుల వల్ల 61 ఆస్తులు ప్రభావితమవుతాయని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ప్రభావిత ఆస్తుల వివరాలు, అంచనాలు, మ్యాపులతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరగా సమర్పించాలని జోనల్ కమిషనర్ హెచ్. శంకరరావు, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డిలకు ఆదేశాలు జారీ చేశారు. పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, రోడ్ల మరమ్మతులపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 97వ వార్డులో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కమిషనర్ సమీక్షించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లను నమోదు చేయాలని, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి మిగిలిపోకుండా పారదర్శకంగా కార్యక్రమాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ అధికారులు, సర్వేయర్లు, శానిటరీ సూపర్వైజర్లు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్ కాలువ పూడికతీతల పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి జూలై 7 ప్రభాతవార్త:

బొబ్బిలి మండలం, కోటిగెడ్డ నుంచి రామన్న దొరవలస మీదుగా గున్నతోటవలస దగ్గర ఉన్న కమలాపుచెరువు వరకు ఉన్న వెంగళరాయసాగర్ కాలువ ద్వారా పంటపొలాలకు వెళ్ళే సాగునీటికి, పూడికల కారణంగా కలుగుతున్న ఇబ్బందులను రైతులు శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) దృష్టికి తీసుకురాగా, ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి, ఆ కాలువ పూడికతీతల కోసం నిధులను మంజూరు చేయించి పనులను మొదలుపెట్టారు. ఎమ్మెల్యే బేబీనాయన ఇరిగేషన్ అధికారులతో కలిసి వెళ్లి ఆ పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఈ కాలువలో పూడికల ఏర్పడ్డాయని, వాటిద్వారా ప్రవహించే అరకొర నీటిని రైతులు వినియోగం చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం కోసం కోటిగెడ్డ నుంచి రామన్నదొరవలస వరకు సుమారు 4-5 కి.మీ మేరకు అదనంగా కాలువ తవ్వించి, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వెనుక ఉన్న చెక్ డ్యామ్ దగ్గర నుంచి గున్నతోటవలస దగ్గర ఉన్న కమలాపుచెరువుకి నీరు అందేలా చర్యలు చెప్పట్టేలా ప్రణాళిక చేసి, పనులను ప్రారంభించామని తెలిపారు.. రైతుల అభ్యర్ధనను సానుకూలంగా స్వీకరించి, ఈ పనులు అయ్యేందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప-ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నిమ్మల రామానాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మండలం టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ గున్నతోటవలస సర్పంచ్ సింగనపల్లి ఈశ్వర్రావు, పలు గ్రామాల సర్పంచులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి -విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాసరావు, రాంబాబు డిమాండ్

విజయనగరం, జూలై 6, ప్రభాతవార్త

విశ్వబ్రాహ్మణ కులస్తులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, వెనుకబడిన విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ పొలిటికల్ వింగ్ జిల్లా చైర్మన్, మాజీ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోసూరు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు 25 లక్షలు ఉన్నారని వారు వివరించారు. ఈ ప్రాతిపదికన రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థల వల్ల కుల వృత్తుల వారికి అన్యాయం జరుగుతున్నదని వివరించారు. విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల వారు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తమను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, పూచీకత్తులు లేకుండా సబ్సిడీ రుణాల మంజూరు చేయాలని, స్కిల్ యూనివర్సిటీ ద్వారా అత్యాధునిక శిక్షణ ఇప్పించాలని, ఆధునిక పరిమిట్లను యంత్రాలను ఉచితంగా సరఫరా చేయాలని వారు కోరారు. అలాగే దేవాదాయ ట్రస్ట్ బోర్డులో విశ్వబ్రాహ్మణులను అర్చకులుగా నియమించాలని, ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమించాలని శ్రీనివాసరావు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సంతోష్ కుమార్, శేఖర్, లక్ష్మణరావు, సురేష్, దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

86 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

కురుపాం, జూలై6 ప్రభాతవార్త

స్థానిక పశువైద్యాశాలలో జాతీయ జూనోసిస్ డే సందర్భంగా సహాయ సంచాలకులు డా. సంధ్య పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు కార్యక్రమం నిర్వహించారు, సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమం లో 86 పెంపుడు కుక్కలకు ఉచితంగా గా రేబిస్ టీకాలు వేశారు .డాక్టర్ సంధ్య మాట్లాడుతూ పశువుల నుండి మనుషులకు వచ్చే వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అని అంటరాని, అందులో రేబిస్ వ్యాధి అత్యంత భయంకరమైన సంక్రమిత వ్యాధి అని ఈ వ్యాధి రాకుండా ముందుగా టీకాలు మాత్రమే వేయించుకోవాలి తప్ప మరో చికిత్స ఉండదు అని ఆమె తెలిపారు. ముఖ్యంగా సమయనుకూలంగా టీకాలు వేసిన యెడల సంక్రమిత వ్యాధులను అరికట్టవొచ్చునని , ప్రతీ జంతుప్రేమికులు అలవారుచుకోవాలని సూచించారు. ఏదైనా కుక్క కరిచిన యెడల వెంటనే దగ్గర లో గల పశు వైద్యాశాలకు సంప్రదించాలని, కరిచిన ప్రదేశం లో వెంటనే పారుతున్న నీటితో అంటి సెప్టిక్ మందు తో కడగాలని వెనువెంటనే చికిత్స నిమ్మితం తీసుకువెలాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు .ఈ కార్యక్రమం లో లైవ్ స్టాక్ అసిస్టెంట్ గుంటముక్కల అఖిలేష్, యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక విద్యుత్ సమస్యకు స్పందించిన మండలటిడిపి అధ్యక్షుల యుగంధర్

కృతజ్ఞతలు తెలిపిన కేసలి గ్రామస్తులు

పాచిపెంట జూలై 6 ప్రభాతవార్త

మండలంలో కేసలి గ్రామంలో గత 7 సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో వినియోగదారులు తరచూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక టిడిపి గ్రామ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆకులు సాయి పలువురు మీసాలమోహన మీసాల విశ్వ, టిడిపినాయకులు మండల టిడిపి టిడిపి అధ్యక్షులు జి యుగంధర్కి తెలియజేయడంతో ఆయనతక్షణమే స్పందించి విద్యుత్ శాఖ ఏ ఈసింహాచలం తో సంప్రదించి తక్షణ చర్యలకు చేపటం కోరారు .ఆ మేరకు ఆయన తన సిబ్బందిని కేసలి గ్రామానికి తరలించి సంవత్సరాలు తరబడి అతుకులతో ఉన్న 250 మీటర్లు విద్యుత్ వైర్ ను తొలగించి దాని స్థానంలో కొత్త వైరును ఏర్పాటు చేసి గ్రామంలో వైర్లకు అడ్డంగా పూర్తిగా చెట్లు తొలగించి ఉదయం నుండి రాత్రి 9 గంటల వరకు చెట్లు తొలగించి విద్యుత్ సరాపాలను యధావిధిగా గ్రామానికి పునరుద్ధించారు. ఎన్నో ఏళ్లగా విద్యుత్ సమస్యతో బాధపడుతున్న కేసలి గ్రామస్తులు విద్యుత్ సమస్య పరిష్కరించి విద్యుత్తు పునరుద్ధించడంతో హమ్మయ్య విద్యుత్ కష్టాలు పోయావని ఆనందం గ్రామస్తులు వ్యక్తం చేశారు. విద్యుత్ ఆటంకం లేకుండా విద్యుత్ దీపాలు వెలగడం ఆ గ్రామం అంతా విద్యుత్ కాంతం వెలజిల్లాయి. ఏడు సంవత్సరాలు గా విద్యుత్ సమస్య తో బాధపడుతున్న ప్రజలకు ఆదివారం రాత్రికి విద్యుత్తు రావడంతో యుగంధర్ స్పందించిన తీరు సేవా దృక్పథమును కేశలి ప్రజలు పెద్దలు ఆయనను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. పదవి వచ్చిన అనంతకాలంలో ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా ఉండే విధంగా ప్రజల సమస్య పట్ల చిత్తశుద్ధి,తమ సమస్యగా స్పందించి ఆయన పరిధిలో చేసుకుంటూ పరిధి మించిన మంత్రి సంధ్యారాణి దృష్టిలో తీసుకువచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించ దిశగా ఆయన పయనిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. అదేవిధంగా పార్టీ బలోపేతానికి మండలంలో అందరి గ్రామస్థాయి నాయకులతో మండల స్థాయి నాయకులతో కలిసిమెలిసిగా ఉండి పార్టీ అభివృద్ధికి ఆయన ముందుకు వెళ్తున్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి బలైపోయిన నిండుప్రాణం ...!

లారీ ఓవర్ స్పీడ్ తో ఢీకొనగా స్పాట్లోనే వ్యక్తిమృతి

సాలూరు జూలై 6 ప్రభాతవార్త

సాలూరు పట్టణ బైపాస్ రోడ్ లో లారీ ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సోమవారం రూరల్ ఎస్ఐ రవీంద్రరాజ్ తెలియజేసిన వివరాలు ప్రకారం స్థానిక బంగారమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పాలవలస. సూర్యనారాయణరావు(51) బైపాస్ రోడ్ లో ఉన్న ఇటుకబట్టి దగ్గర సుమారు ఒంటిగంట సమయంలో రోడ్డు దాటుతుండగా ఒడిస్సా నుండి అటువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగంగా ఢీకొనడంతో స్పాట్లోనే అతను మృతి చెందడం జరిగిందని తెలిపారు.అలాగే మృతి చెందిన వ్యక్తి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించమన్నారు.దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్రరాజ్ తెలియజేశారు.

సర్ కార్యక్రమం తప్పులు లేకుండా త్వరితంగా చేయాలి : ఎంపిడివో రత్నం

రామభద్రపురం, జులై 6, ప్రభాతవార్త

ఈరోజురామభద్రపురం మండలంలో సర్ సర్వే యొక్క పురోగతిని పెంచాలి అని బుసాయవలస, కోటసిర్లం, మరియు రామభద్రపురం స్వర్ణ గ్రామానికి తనిఖీ చేయడం జరిగినది. అందరూ కూడా 100% శాతం కంప్లీట్ చేయాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ప్రజలందరూ స్వర్ణ గ్రామము సిబ్బంది వచ్చినప్పుడు వారికి సహకారాలు అందించాలని పబ్లిక్ కూడా తెలియజేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రత్నం,డిప్యూటీ ఎంపీడీవోలు, ఏ వో సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరు ముఖ్యం కాదు..

జిందాల్ నిర్వాసితులు..

శృంగవరపుకోట,జూలై6,ప్రభాతవార్త..

శిలాఫలకంపై పేరు లేకపోయినా జిందాల్ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఎల్లప్పుడూ మాగుండెల్లో నిలిచి పోయారని జిందాల్ నిర్వాసితులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బొడ్డవరలో ఎమ్మెల్సీ రఘురాజుకు జిందాల్ రైతులు పూలమాలలుతో ఘనంగా సత్కరించారు.అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిందాల్ ఎంఎస్ఎంఈ పార్క్ శంఖుస్థాపన కార్యక్రమంలో భాగంగా శిలాఫలకంపై ఎమ్మెల్సీ రఘురాజు పేరు లేకపోవడంతో వారు విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఏడాదికి పైగా ఎమ్మెల్సీ రఘురాజు నిరంతరం శ్రమించారని మాకు అన్ని విధాలైన అండదండలుగా ఉంటున్న ఎమ్మెల్సీ రఘురాజు పేరు శిలాఫలకంపై లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షగా భావిస్తున్నామన్నారు.శిలాఫలకంపై పేరు లేనంత మాత్రనా ఎమ్మెల్సీ శ్రమ కృషి వృధా కాదని ఈరోజు జిందాల్ రైతులను ఆదుకున్న వ్యక్తి ఒక్క ఎమ్మెల్సీ రఘురాజుగా మేము మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నామని రైతులు తెలిపారు.

మొయిదలో ఘనంగా ఎమ్మెల్సీ సురేష్ బాబు జన్మదినోత్సవం

నెల్లిమర్ల, జూలై 6, ప్రభాతవార్త

శాసనమండలి సభ్యులు డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు)జన్మదిన వేడుకలు మండలంలోని మొయిదలోని ఆయన స్వగృహంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వైయస్సార్సీపి రాష్ట్రఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రేగాన మాట్లాడుతూ మాజీ మంత్రి స్వర్గీయ పెనుమత్స సాంబశివ రాజు వారసత్వాన్ని ఆయన కుమారుడు డాక్టర్ సురేష్ బాబు కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు, పార్టీ నాయకులు మొయిద లక్ష్మణరావు. అట్టాడ కనకారావు. అట్టాడ శ్రీను, యడ్ల ధర్మ, జమ్మూ సూర్యసత్యం,నడుపూరు వెంకట రమణ, సామంతుల రమణ, సూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాలు ఎక్కువ విఆర్వోలు తక్కువ

దత్తిరాజేరు జులై 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని 46 రెవెన్యూ.గ్రామాలు మరియు 17 సచివాలయాలు కలవు అందులో పదిమంది విఆర్వోలు పనిచేస్తున్నారు మిగతా 7 సచివాలయాలు అనగా పోరలి చిన్నకాద పేదకాద గడసాశీ రామచంద్రపురం పాచలవలస కే కొత్తవలస సచివాలయాలకు విఆర్ఓ ఖాళీగా ఉన్నాయని రీసర్వే డిటి రత్నకుమారి స్థానిక విలేకరులు తెలిపారు ఇక్కడ పనిచేసిన ఐదుగురు విఆర్వోలు బదిలీ అయ్యారు బదిలీ అయిన వాటి స్థానానికి ఎవర్ని భర్తీ చేయకపోవడంతో గ్రామాల్లో రైతులుకు మరియు విద్యార్థులకు ఆరకోర సేవలు అందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇన్చార్జి విఆర్వోలు అందుబాటులో దొరకడం లేదని రైతులంటున్నారు గ్రామాల్లో భూములు రీ సర్వే జరుగుతున్నాయి కావున రెగ్యులర్ మండల సర్వేర్. ని నియమించాలన్నారు ఏడు మంది విఆర్ఓ లేకపోవడం వల్ల వర్క్ పెండింగులు ఉండిపోతున్నాయి అన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న సచివాలయలకు వీఆర్వోలును భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

సాలూరులో సర్ ప్రక్రియ వేగవంతం చెయ్యండి : జేసీ ఆర్ వైశాలి

సాలూరు జూలై 6 ప్రభాతవార్త

సాలూరు పట్టణ పర్యటనలో భాగంగ జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి పలువార్డుల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సర్ ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. సోమవారం ఉదయం పట్టణానికి చేరుకున్న జేసీ వైశాలి తాసిల్దార్ సురేష్ తో కలసి 40,43,51,66 ఇంకా 68 పలు పోలింగ్ కేంద్రాల పరధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబీతా సవరణ (సర్) ను పరిశీలించారు.అలాగే పోలింగ్ కేంద్రాల్లో స్వీకరిస్తున్న ఓటర్ల దరఖాస్తుల్లో మార్పులు ఇంకా చేర్పులు పూర్తి పారదర్శకంగా చేయాలని బిఎల్ఓ లకు సూచనలు చేశారు.అంతేకాకుండా ఎన్యుమరేషన్ ఫారం నింపేందుకు ఓటరుకు సహకరించాలని అలాగే ప్రత్యేక శ్రద్దవహించి ఈ నెల 14వ తేదీలోపు సర్ ప్రక్రియ పూర్తి చేయాలని క్లారిటీ ఇచ్చారు.మేనేజర్ శివప్రసాద్, జగదీష్,తాసిల్దార్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

396 జీవోను రద్దు చేయాలని డిమాండ్

చీపురుపల్లి జూలై 6 ప్రభాతవార్త

396 జీవో రద్దు చేయాలంటూచీపురుపల్లి మండలంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డిమాండ్ చేస్తూ చీపురుపల్లి జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పీపీపీ విధానంలో ఆర్ ఎస్ కె మోడల్ సేవలను ప్రవేశపెట్టేందుకు జారీ చేసిన జీవో నెం.396 కారణంగా డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకుని, డాక్యుమెంట్ రైటర్ల హక్కులు, ఉపాధిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, జూలై 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవోను రద్దు చేయాలని కోరుకుంటూ ఈ నిరసన కార్యక్రమంలో చీపురుపల్లి జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు, సీనియర్ రైటర్లు మరియు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుమిలి భూములపై వేలంపాట నిర్వహణ

నెల్లిమర్ల, జులై 6, ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామ స్వామి వారి దేవస్థానంకు చెందిన పూసపాటిరేగ మండలం, కుమిలి గ్రామం లోని వ్యవసాయ భూముల యందు వ్యవసాయం చేసుకొనుటకు దేవస్థానం వద్ద సోమవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటకు దేవదాయ ధర్మాదాయ శాఖ తరపున చీపురుపల్లి, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం, కార్యనిర్వహణాధికారి ఎస్. నానాజీ పర్యవేక్షణ అధికారిగా హాజరయ్యారు. రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం ఈవో వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ వేలం పాట జరిగింది. కుమిలి గ్రామంలో ఉన్న దేవస్థాన భూములో సర్వే 414 పార్ట్లో గల ఎకరం 33 సెంట్లు కు సంబంధించి సోమవారం ఈ వేలం పాట నిర్వహించారు. సంవత్సరం కి 2,200 రూపాయలు చెల్లింపున కు వేలంలో హెచ్చు పాట దారుడుగా ఏ ఎస్ బి .ప్రసాద్ బహిరంగ వేలం పాట పాడుకున్నారు. ఈ బహిరంగ వేలములో కుమిలి గ్రామ రైతులు, నెల్లిమర్ల పోలీస్ సిబ్బంది, రామతీర్థం దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రైవాడ కాలువపై వంతెనలు నిర్మించండి

విశాఖ జీవీఎంసీ కమిషనర్ను కోరిన గ్రామస్తులు

వేపాడ ,జూలై 6, ప్రభాతవార్త

వేపాడ మండలం చినగుడిపాల గ్రామం లో రైవాడ లింకు కెనాల్ పై రెండు వంతెనలు నిర్మించి సహకరించాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. సోమవారం విశాఖపట్నం మహా నగర పాలకసంస్థ కమిషనర్ వారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కొత్తవలస-దేవరాపల్లి రోడ్ నుండి చినగుడిపాల వెళ్ళే మార్గం లో రైవాడ లింక్ కెనాల్ 9.5 కిలోమీటర్ వద్ద వంతెన కూలడానికి సిద్ధంగా ఉందని, తక్షణమే నూతన వంతెన నిర్మించాలని కోరారు . అలాగే నాయుడు చెరువు వద్ద సిరపరపు శివారు గ్రామస్తులు స్మశాన వాటిక కు వెళ్ళేటపుడు రైవాడ లింక్ కెనాల్ 10 కిలోమీటర్ వద్ద వంతెన లేక కాలువ దాటేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ పరిస్థితుల్లో వంతెన నిర్మాణం చేపట్టాలని కమిషనర్ కరెనా గార్గ్, అడిషనల్ కమిషనర్ పల్లి నల్లనయ్య లను కోరినట్టు మాజీ సర్పంచ్, జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు బోజంకి రామునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు కోట అప్పలనాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం, ప్రచార కమిటీ కార్యదర్శి లండ అప్పన్న యాదవ్, వీ టి పి నాయుడు, రమణ పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం

25

వార్త

మహిళల సంరక్షణ ప్రధాన లక్ష్యం: ఎస్సై పి.ఉమా వెంకటేశ్వరరావు

చీపురుపల్లి జూలై 6 ప్రభాతవార్త

మహిళల సంరక్షణ ప్రధాన లక్ష్యముగా పోలీస్ శాఖ పనిచేస్తుందని చీపురుపల్లి ఎస్సై పి ఉమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి పట్టణంలోని మెట్ట కాలనీలో గల కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కళాశాలలో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు..ఈ సందర్భంగా చీపురుపల్లి సబ్ ఇన్స్పెక్టర్ గారు మహిళల భద్రతకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వివరించారు. ముఖ్యంగా ఉమెన్ సేఫ్టీ గురించి మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికలు తమ రోజువారీ జీవితంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు గురిచేసినా వెంటనే కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రత్యేకించి గుడ్ టచ్ & బ్యాడ్ టచ్ అంశంపై విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. మంచి స్పర్శ మరియు చెడు స్పర్శ మధ్య తేడాను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని, ఏదైనా అసౌకర్యంగా అనిపించినప్పుడు వెంటనే పెద్దలకు చెప్పాలని సూచించారు. బాలికలు తమ భద్రత విషయంలో ధైర్యంగా వ్యవహరించాలని ప్రోత్సహించారు. అదేవిధంగా రోడ్ సేఫ్టీ గురించి మాట్లాడుతూ, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించడం, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా అనుసరించడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. చిన్న నిర్లక్ష్యంపెద్దప్రమాదాలకుదారితీస్తుందని హెచ్చరించారు. అదే విధముగా సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పిస్తూ, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, పాస్వర్డ్లు ఇతరులతో పంచుకోకూడదని, ఆన్లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఫేక్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అలాగే గంజాయి మరియు మత్తు పదార్థాల దుష్ప్రభావాలు గురించి విద్యార్థినులకు వివరించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రత, బాధ్యత, చట్టాల పట్ల అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంతువుల నుండి సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గరివిడి పశువైద్య కళాశాలలో ఘనంగా జునోసిస్ దినోత్సవం

గరివిడి ,జూలై 6, ప్రభాత వార్త:

పశువుల నుండి సంక్రమించే వ్యాదుల పట్ల ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రి డెప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ఆర్.కుమార్ అన్నారు. గరివిడి పశువైద్య కళాశాల లో కళాశాల డిపార్ట్ మెంట్ ఆఫ్ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కుమార్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సకాలంలో ర్యాబిస్ టీకాలు వేయడం అనివార్యం మన్నారు. జునోటిక్ వ్యాధులు, వాటి వ్యాప్తి, నివారణోపాయాలు పై పశువైద్య ప్రొఫెసర్లు తమతమ ప్రసంగాల్లో పశువైద్య విద్యార్థుల కు వివరించారు. ఈ సందర్భంగా 85 పెంపుడు జంతువులకు ఏంటీ ర్యాబిస్ వ్యాక్సిన్(ఏ ఆర్ వి) పశువైద్య నిపుణులు వేశారు. కాగా పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నెక్కంటి ధనలక్ష్మి,వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ వి. దేవీ ప్రసాద్, పశువైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రవి కుమార్, ప్రొఫెసర్ లు సుధారాణి, ప్రకాష్,మురళీ ధర్,సునీత,అరుణ,చరణ్,వినీత, సునీత మనసా,రేష్మ, సమీప పెంపుడు జంతువుల పెంపకం దారులు తమ జంతువుల తో కార్యక్రమంలో పాల్గొన్నారు. పెంపుడు జంతువుల కు సకాలంలో యాంటీ ర్యాబిస్ టీకాలు వేసి సురక్షిత సమాజం కోసం పాటు పడాలని వక్తలన్నారు.

అర్జీదారునితో మాట్లాడండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

విజయనగరం, జులై 06,ప్రభాతవార్త:

ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజా సానుకూలతను పెంచాలని, అదేవిధంగా ప్రజల సంతృప్త స్థాయిని మెరుగుపర్చేందుకు అన్నిశాఖలు కృషి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఐవిఆర్ఎస్ కాల్స్, ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజా సానుకూలత, సర్ తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్త స్థాయిని పెంచేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అలాగే పీజీఆర్ఎస్ పై సమీక్షిస్తూ, ఫిర్యాదుదారునితో తప్పనిసరిగా మాట్లాడాలని, దానివల్ల చాలావరకు అర్జీలను పరిష్కరించేందుకు, సమస్యను పూర్తిగా అర్ధం చేసుకొనేందుకు అవకాశం లభిస్తుందని సూచించారు. నిబంధలనకు విరుద్ధంగా పిజిఆర్ఎస్ ధరఖాస్తులను మూసివేసిన మూడు శాఖలకు చెందిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుని సంతృప్తే లక్ష్యమని పేర్కొన్నారు. తమ శాఖకు సంబంధంలేని ధరఖాస్తు తమకు వచ్చినపక్షంలో, దానిని సంబంధిత శాఖకు పంపించాలే తప్ప, దానిని మూసివేయకూడదని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ ధరఖాస్తులకు సంబంధించి ఎట్టిపరిస్థితిలోనూ నిర్ణీత గడువు దాటకూడదని చెప్పారు. ఐవిఆర్ఎస్ సర్వేలో అంతగా సానుకూలత వ్యక్తం కాని ప్రభుత్వ శాఖలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించి, సానుకూలతను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సర్ లో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించాఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఆన్లైన్ ద్వారా ఆర్డిఓలు, తాహసీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

జిల్లాలో వేగంగా సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ . జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామ సుందర్ రెడ్డి

విజయనగరం, జూలై 6: ప్రభాతవార్త

విజయనగరం జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామ సుందర్ రెడ్డి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై సోమవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్లో జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,78,949 మంది ఓటర్లకు గాను 15,78,439 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, ఇది 99.97 శాతం పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటివరకు 9,12,232 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి కాగా, ఇది 57.77 శాతంగా నమోదైంద న్నారు. నియోజకవర్గాల వారీగా పురోగతి రాజాం నియోజకవర్గం: మొత్తం 2,29,879 ఫారాలను (100%) పంపిణీ చేయగా, 1,40,298 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 61.03 శాతం నమోదైంది.బొబ్బిలి నియోజకవర్గం: 2,33,621 ఫారాలను (100%) పంపిణీ చేయగా, 1,35,717 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 58.09 శాతం నమోదైంది.చీపురుపల్లి నియోజకవర్గం: 2,07,471 ఫారాలను (100%) పంపిణీ చేయగా, 1,23,387 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 59.47 శాతం నమోదైంది.గజపతినగరం నియోజకవర్గం: 2,07,402 ఫారాలను (100%) పంపిణీ చేయగా, 1,26,914 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 61.19 శాతం నమోదైంది.నెల్లిమర్ల నియోజకవర్గం: 2,14,339 ఫారాలను (99.96%) పంపిణీ చేయగా, 1,16,173 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 54.18 శాతం నమోదైంది. విజయనగరం నియోజకవర్గం: 2,60,900 ఫారాలను (99.85%) పంపిణీ చేయగా, 1,30,429 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 49.92 శాతం నమోదైంది.

శృంగవరపుకోట నియోజకవర్గం

2,24,827 ఫారాలను (99.99%) పంపిణీ చేయగా, 1,39,314 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 61.96 శాతం నమోదైంది. జిల్లాలో అత్యధిక డిజిటలైజేషన్ శాతం ఈ నియోజకవర్గంలో నమోదైంది.జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయినందున, మిగిలిన ఫారాలను కూడా త్వరితగతిన సేకరించి, జూలై 14వ తేదీలోపు శతశాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ ఎస్. రామ సుందర్ రెడ్డి సంబంధిత ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు మరియు సిబ్బందికి ఆదేశించారు. సమన్వయంతో పనిచేసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

7 -7Pg9th cheli.qxd:7 -7Pg9th cheli.qxd 1/1/02 6:43 AM Page 1

జింక్ లోపం ఉంటే ..

జింక్ అనేది ఒక ట్రేస్ ఎలిమెంట్. ఇది చాలా ముఖ్యమైంది. థైరాయిడ్ గ్రంథి పనితీరులో క్రోమియం, జింక్, సెలీనియం వంటి మినరల్స్ ప్రధాన పాత్ర పోషిస్తుంటాయి. సాధారణంగా జింక్ స్థాయి 70 ఎంసిం/డిఎల్ నుంచి ఎంసిం/డిఎల్ వరకు ఉండాలి. జింక్ స్థాయి తక్కువగా ఉన్నప్పుడు జుట్టు రాలిపోవడం, చర్మం పొడిబారడం, తొందరగా అలసిపోవడం, నిద్ర ఎక్కువగా రావడం, బద్ధకం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. థైరాయిడ్ లక్షణాలు కూడా దాదాపు ఇదేవిధంగా ఉంటాయి. జింక్ లోపం ఉన్నవారు దానిని భర్తీ చేసుకోవడానికి జింక్ ఉన్న మల్టీ విటమిన్ మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇతర విటమిన్ల లోపం ఏదైనా ఉందా. అనేది కూడా చెక్ చేసుకోవడం మంచిది. ముఖ్యంగా క్రోమియం, సెలీనియం, బి 12, బి 1, విటమిన్ సి, విటమిన్ డి-3 కూడా చెక్‌చేయించుకోవాలి. ఒక్కో విటమిన్ లోపం ఉన్నప్పుడు ఒక్కో సమస్య ఉంటుంది. ఉదాహరణకు బి 12 తక్కువైతే తిమ్మిర్లు, బి 1 లోపిస్తే మతిమరుపు వంటి సమస్యలు వస్తుంటాయి. కాబట్టి, మీకు ఏయే విటమిన్ల లోపం ఎక్కువగా ఉందో వాటిని భర్తీ చేసే మల్టీ విటమిన్ మాత్రలను వైద్యుని సలహాతో ప్రతి రోజూ వేసుకుంటే సమస్య నుంచి బయటపడచ్చు. అలాగే ఆయా పోషకాలు అధికంగా లభించే పదార్థాలను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. ◻

జుట్టు రాలిపోకుండా..ఇలా !

జుట్టు రాలిపోయే సమస్య ఉన్నవారికి మేలు చేసే ఆయుర్వేద మూలికలు ఇవే.. ఎలా వాడాలంటే.. జుట్టు రాలిపోవడం ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. మార్కెట్లో లభించే అనేక హెయిర్ ట్రీట్‌మెంట్లు ఉపయోగించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతే, సహజ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మంచిదని ఆయుర్వేదం సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో పిత్త దోషం పెరగడం వల్ల జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. జుట్టు రాలిపోవడం ప్రస్తుతం చాలా మందిని వేధిస్తున్న సాధారణ సమస్యగా మారింది. మార్కెట్లో లభించే అనేక హెయిర్ ట్రీట్‌మెంట్లు ఉపయో గించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోతే, సహజ పద్ధతుల వైపు మొగ్గు చూపడం మంచిదని ఆయుర్వేదం సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం శరీరంలో పిత్త దోషం పెరగడం వల్ల జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. శరీరంలో అధిక వేడి, ఒత్తిడి, అసమతుల్య జీవనశైలి కారణంగా జుట్టు బలహీనపడుతుంది. ఈ నేపథ్యంలో కొన్ని సహజ మూలికలు, నూనెలు జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచ డంలో సహాయపడతా యని చెబుతు న్నారు. పిత్త దోషాన్ని నియం త్రించేందుకు ధూమ పానం, మద్యం, అధికంగా కాఫీ, టీ సేవించడం తగ్గించాలి. అలాగే పుల్లని ఆహారాలను పరిమితంగా తీసుకోవడం, తగినంత నిద్ర పోవడం, ఒత్తిడిని తగ్గించు కోవడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

జలకాలాటలలో ఏమి హాయిలే.. హలా !

ఈ నదిలా.... నా పరువం ఉరకలు వేస్తోంది ! అనుకుంటూ ఆ యౌవ్వనాల జవ్వని వొళ్లంతా తడుపుకుని ఈత కొడుతోందని అనుకుంటున్నారా ? అదేం కాదు. ఆమె నదీ పరవశంలో ఉంది. ఆ నదిని ఆమె పెళ్లి చేసుకుంది .ఇది మూడేళ్ల క్రితం మాట. తాజాగా ఆమె ఇంకా తన పెళ్లి 3వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. తమ లక్ష్యం నెరవేరినట్లు లేదు. అయినా ఆమె ముందుకు సాగుతూనే ఉంది. తాను స్నేహ బృందం సాక్షిగా మను వాడిన ఎవాన్ నదికి హక్కులన్నీ దఖలు పడితే తప్ప ఆమె పట్టిన పట్టు విడిచి పెట్టేటట్లు లేదు. వాళ్లంతా నదీ ప్రక్షాళన కోసం ఎంతవరకైనా వెళ్దామను కుంటున్నారు. **ఇంతకీ ఎవరామె.?**అదేనండి! ప్రపంచంలో సాధారణంగా మనుషులు ఒకరినొకరు వివాహం చేసుకుంటారు. అయితే బ్రిటన్‌కు చెందిన పర్యావరణ ఉద్యమకారిణి మెగ్ అవన్ ఇంగ్లండ్ నైరుతి ప్రాంతంలోని 'అవన్' నదిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆమె అసలు పేరు మెగ్ ట్రంప్.. కానీ 'నదీ పరిణయయం' మెగ్ అవన్'గా మార్చుకున్నారు. 17 జూన్ 2023లో ..అవన్ నదితో ప్రతీకాత్మకంగా వివాహం చేసుకోవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది చట్టబద్ధమైన వివాహం కాదు. కానీ నదుల కాలుష్యం, మురుగునీటి సమస్యలు, పర్యా వరణ పరిరక్షణపై ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు నిర్వహించిన ఒక సృజ నాత్మక ఉద్యమం మాత్రమే. మెగ్ అవన్ అభిప్రాయం ప్రకారం, నదులను కేవలం సహజ వనరులుగా కాకుండా జీవవ్యవస్థలో అంతర్భాగంగా చూడాలి. నదులకు కూడా చట్టపరమైన హక్కులు ఉండాలని, వాటిని కాలుష్యం నుంచి రక్షించే బాధ్యత సమాజానిదేనని ఆమె ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమం వల్ల మెగ్ అవన్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆమె ప్రచారం వార్తల్లో నిలిచింది, డాక్యు మెంటరీలు రూపొందాయి, పర్యావరణ పరిరక్షణపై మరింత మంది చర్చించడం ప్రారంభించారు. ఈ కోణంలో

చూస్తే ఆమె సందేశం ఎక్కువ మందికి చేరింది. ఆమెకు వ్యక్తిగతంగా ఎటువంటి చట్టబద్ధమైన వివాహహక్కులు, ఆర్థిక లాభాలు లేదా ప్రత్యేక చట్టపరమైన ప్రయోజనాలు లభించలేదు. ఆమె ఆశించనూ లేదు. ప్రపంచం లోని కొన్ని దేశాల్లో నదులకు చట్టపరమైన వ్యక్తిత్వ హోదా వ్వాలనే ఉద్యమాలు జరుగుతున్నాయి. అలాంటి హోదా లభిస్తే, నది తరఫున కోర్టులో కేసులు వేయ డం, కాలుష్యానికి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని ఉద్యమ కారులు భావిస్తున్నారు. మెగ్ అవన్ కూడా ఇదే లక్ష్యంతో అవన్

సమయం కేటాయించాలి!

ఇల్లు, ఆఫీసు, పిల్లల స్కూల్ పనులతో రోజంతా బిజీగా ఉంటాం. అయితే రాత్రి నిద్రపోయే ముందు పిల్లల కోసం కేటాయించిన సమయంలో ఆ రోజు గురించి ప్రశ్నించాలంటు న్నారు నిపుణులు. దాంతో వాళ్ల ఆలోచనాతీరును గుర్తించొచ్చు అని చెబుతున్నారు. పిల్లలు జీవితంపై ఆ రోజు ఎటువంటి ప్రభావాన్ని చూపిందో అడగాలి. ఇది వాళ్ల ఆలోచనలు, భావోద్వే గాలను బయటపడేలా చేస్తుంది. వాళ్ల అవసరాలూ గుర్తించొచ్చు. అలాగే ఆ రోజుల్లో ప్రత్యేకంగా అనిపించిన విషయమేదో అడగాలి. సానుకూల అంశాలతో పాటు ప్రతికూలంగా అనిపించినవీ చెప్పమనాలి వీటినిబట్టి పిల్లల మానసికస్థితిని అంచనా వేయొచ్చు. వారిని బాధపెట్టిన విషయాన్ని అడగాలి. ఎదుటి వారివల్ల వారు పడుతున్న ఇబ్బందు లతోపాటు వాళ్లలోని భావోద్వేగ మేధస్సునూ గుర్తించొచ్చు. చుట్టూ ఉన్న వ్యక్తులను వారెలా అర్థం చేసుకోగలుగుతున్నారో తెలుసుకోవచ్చు. అలాగే పిల్లల సమస్యలను పరిష్కరిస్తే, తమకంటూ తల్లిదండ్రులు తోడున్నారనే భరోసా, నమ్మకం వాళ్లలో కలుగుతుంది. మనసులోని విషయాలను అమ్మానాన్నతో స్వేచ్ఛగా చెప్పడం అలవరుచుకుంటారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకున్నారేమో అడగాలి. వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నందుకు ప్రశంసించాలి.

ఇది వారిని మరిన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంచుతుంది. ఏదైనా విషయం ఆ రోజు పిల్లలకు ఛాలెంజ్‌గా అనిపించిందేఎలా ప్రశ్నించాలి. దాన్ని సవాల్‌గా తీసుకొని ఎలా దాటొచ్చనేది సలహా ఇవ్వాలి. సమస్య ఎదురైతే ధైర్యంగా నిలబడగలుగుతారు. కొత్త స్నేహితులతో పరిచయాలు చదివిన పుస్తకం గురించి లేదా వాళ్లకు ఆ రోజు నచ్చిన సంభాషణ వంటివన్నీ పిల్లలతోకబురు చెబుతూనే తెలుసుకోవచ్చు. స్నేహం విలువ, ప్రముఖ వ్యక్తుల గురించి తెలుసుకోవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలుసుకుంటారు. గడిచిన రోజుఎంత విలువైందో అలాగే మరుసటి రోజుకు మరింత ప్రాముఖ్యత ఇవ్వడమెంత ముఖ్యమో నేర్చుకుంటారు. ◻

చాణక్యుడి నిజాయతీ

చంద్రగుప్తమౌర్యుడి రాజ్య సలహాదారుడు, అర్థశాస్త్ర రచయిత అయిన చాణక్యుడిని కలవడానికి ఓసారి ఒక గ్రీకు రాయబారి వెళ్లాడు. చాణక్యుడు ఓ పూరిగుడిసెలో ఉండటం చూసి 'ఇంతటి గొప్పవాడు ఈ సాధారణ గుడిసెలో ఎలా ఉంటున్నాడు? అనుకుని ఆశ్చర్యపోయాడు. ఆ ఇంట్లో దీపం వెలుగులో ముఖ్యమైన కాగితాలు చూస్తూ ఉన్నాడు చాణక్యుడు. ఆ రాయబారిని చూసిన వెంటనే.. ఉన్న దీపం ఆర్పేసి మరో దీపం వెలిగించాడు. 'రండి కూర్చోండి. మీరెవరు? ఏ పని మీద వచ్చారు? అని ప్రశ్నించాడు. అప్పుడా గ్రీకు రాయబారి 'అయ్యా! అది చెబుతా కానీ ముందు నా సందేహం తీర్చండి. ముందునన దీపానినన ఆర్పేసి మరో దీపం ఎందుకు వెలిగించారు? అని అడిగాడు. దానికి చాణక్యుడు.. 'నేను దేశం కోసం చేసే పనులకు సంబంధించి ఆ దీపం వెలుగులో చేస్తాను. దాని నూనె ఖర్చులనురాజుగారు భరిస్తారు. ప్రస్తుతం మీరు నాతో సొంత విషయాలు మాట్లాడటానికి వచ్చారు. అందువల్ల ఆ దీపం ఆర్పేసి ఇది వెలిగించాను దీనికయ్యే నూనె నా జీతం డబ్బులతో కొన్నాను' అని బదులిచ్చాడు. ఆ సమాధానం విన్న రాయబారి చాణక్యుడి నిజాయతీ చూసి ఆశ్చర్యపోయాడు. ◻

తేనీరుకు బదులు ..

వేపుడు కూరలు తినొద్దు. కాయగూరలను ఉడికించి తాలింపు పెడితే మంచిది అంటున్నారు ఆహార నిపుణులు. అలా కూరగాయల్ని ఉడికించాక.. ఆ నీటిని పారబోస్తున్నారా! ఆ నీళ్ల తాగటం వల్ల ఎన్ని ప్రయోనాలు ఉన్నాయి. కూరగాయాలు ఉడికించిన నీళ్లలో చిటికెడు ఉప్పు జోడించి తాగారంటే.. శరీరానికి అవసరమైన విటమిన్లు. ఖనిజాలు అందుతాయి. ఇంకా రుచిగా ఉండాలంటే కాస్త మిరియాల పొడి జోడిస్తే సరి. ఈ నీరు తేలిగ్గా జీర్ణమై వెంటనే శక్తి కలుగుతుంది. వెచ్చగా ఉన్నప్పుడు తాగితే.. అలసట పోయి ఉత్సాహంగా ఉంటుంది. కాఫీ ఛాయ్‌లకు బదులు ఈ నీటిని తాగటం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సురక్షితం. బరువు తగ్గాలనుకునే వారికి ఈ నీరు ఔషధంలా పనిచేస్తుంది. గోరుచిక్కుడు, క్యారెట్, క్యాబేజ్, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, దోస.. వంటివి కొద్దికొద్దిగా చేర్చి ఉడికించి తాగితే మరింత ఉపయోగం. రక్తహీనత నుంచి బయటపడొచ్చు. ఆ నీటిని అలాగే తాగటం ఇష్టం లేకపోతే.. సూప్.. పులుసు, న్యూడుల్స్, పాస్తా ఫ్రైడ్ రైస్ వంటి వాటిల్లో ఉపయోగించండి. ◻

తెర

'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం`లెనిన్‌. ఈ మూవీకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జూలై 10న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. .'నందు ముందుగా శ్రీరామపురంలో జరిగే కథ అని చెప్పారు. నాన్న శ్రీరామపురం లో అనే ఊర్లోనే పుట్టారు. నందు చెప్పిన కథ నాకెంతో నచ్చింది. ప్రతీ పాత్రలో రకరకాల కోణాలున్నాయి. సెకండాఫ్‌లో వచ్చే ట్విస్టుల్ని ఎవ్వరూ ఊహించలేరు. ప్రేమ కోసం రాజ్యాలు కూలిపోయాయి.. యుద్ధాలు జరిగాయి.. 'లెనిన్' లోనూ ఓ ప్రేమ కథ ఉంది. హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. .. 'లెనిన్'తో నేను మీ (అభిమానులు) ఇంటిలో ఒకడిని అవ్వాలని ప్రయత్నం చేశాను. సీమ బిడ్డ నందు నాకు అద్భుతమైన కథ చెప్పారు. నా జర్నీ, నా పెయిన్ అంతా కూడా ఈ కథలోనే కనిపించింది. అందుకే నేను వెంటనే ఒకే చెప్పాను. నిర్మాత సూర్య దేవర నాగవంశీ మాట్లా డుతూ.. 'లెనిన్' కోసం అఖిల్ చాలా కష్టపడ్డాడు. నేనే అఖిల్‌ను ఎక్కువ ఇబ్బంది పెట్టాను. 'లెనిన్' చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. సినిమాలో చాలా సర్ ప్రైజ్‌లు ఉంటాయి. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లా డుతూ.. 'లెనిన్'లో నేను భారతి అనే పాత్రను పోషించాను. ఇలాంటి గొప్ప పాత్రను నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. నా కెరీర్‌లో భారతి అనే పాత్ర నిలిచి పోతుంది. నటుడు శివాజీ మాట్లాడుతూ..అన్నపూర్ణ బ్యానర్, నాగార్జునవల్లే నా సినీ కెరీర్ ప్రారంభమైంది. లెనిన్‌నా హార్ట్‌కి దగ్గరైన చిత్రం. మేం ఇప్పుడు ఎక్కువగా మాట్లాడం. రిలీజ్ అయ్యాక సినిమానే మాట్లాడుతుంది.

అన్నీ తానై తానే అన్నీ !

ఆయన అందమైన స్వరద్రూపి కాకపోవచ్చు అలా అని ఏదో జోకర్‌లా ఉంటాడనీ కాదు. తన ముందున్న ప్రేక్షకుల్ని నవ్విస్తాడు. కవ్విస్తాడు. ఇప్పుడాయన ఒక పాన్ ఇండియా చిత్రంలో ఏకంగా 11 విభిన్న పాత్రలను పోషించేందుకు ముందుకొచ్చారు. ఆయనెవరో కాదు తమిళ హాస్య నటుడు యోగిబాబు. గతంలో అక్కినేని నాగేశ్వరరావు నవరాత్రి 'చిత్రంలో 9 పాత్రలలో కనిపించారు. కమలహాసన్ దశావతారాం చిత్రంలో దశపాత్రధారిగా అలరించారు. ఇప్పుడు యోగిబాబు ఒక ఆకు ఎక్కువ చదివి నవరసాలూరించే 11 పాత్రలను ఒకే చిత్రంలో అభినయించనున్నారు. తమిళ సినిమా చరిత్రలోనే ఒక ప్రతిష్టాత్మకమైన, యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రముఖ హాస్యనటుడు యోగి బాబు, రాబోయే భారీ బడ్జెట్ పాన్‌ఇండియన్ చిత్రంలో 11 విభిన్న పాత్రలను పోషించి అరుదైన రికార్డు సృష్టించనున్నారు . తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న ఆర్. కిషోర్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైఆక్టేన్ కామెడీ యాక్షన్‌థ్రిల్లర్‌లో, యోగి బాబు ప్రధాన కథానాయకుడి నుండి ప్రతి నాయకుడి వరకు అన్ని పాత్రలనూ ఆయనే పోషిస్తూ సందడి చేయనున్నారు. అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ మిషన్ చుట్టూ తిరిగే యాక్షన్ థ్రిల్లర్ యోగి బాబు హీరో, విలన్, ఇంకా తొమ్మిది విభిన్న పాత్రలలో కనిపించనున్నారు. ఈ పాత్రలు ద్విపాత్రాభినయాలు, ప్రతి పాత్రకు విభిన్నమైన రూపం, హావభావాలు, ఇంకా ప్రత్యేకమైన భాష లేదా యాస కూడా ఉంటాయి. ఇది అతని కెరీర్‌లో ఒక కీలక మలుపు. భారత సైన్యానికి చెందిన హెలికాప్టర్ గందరగోళంగా కూలిపోవడంతో కథ ప్రారంభమవుతుంది. ప్రమాదం వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీయడానికి, హెలికాప్టర్‌లో పోయిన బ్లాక్ బాక్స్‌ను తిరిగి తీసుకురావాలనే సవాలుతో కూడిన ఓ పనిని బృందం చేపడుతుంది. ఈ అన్వేషణలో వారు అనేక మలుపులు, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు హాస్యభరిత దృశ్యాలను చూడగలం. ఈ చిత్రంలో యోగి బాబుతో పాటు అదితి రవి, రెడిన్ కింగ్స్లీ, విటివి గణేష్, పంజు సుబ్బు ఎ. వెంకటేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొదటి షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది, తదుపరి దశ చిత్రీకరణ యునైటెడ్ కింగ్‌డమ్ , కెన్యాలో జరగనుంది.తమిళ చిత్రసీమలో అత్యంత బిజీగా ఉండే హాస్యనటుడి స్థాయి నుండి, 'ధర్మ ప్రభు', 'గుర్ఖా', 'మండేలా', 'యాన్లై ముగత్తాన్', 'లక్కీ మ్యాన్', 'బూమర్ అంకుల్', 'తూకుదురై' వంటి విజయవంతమైన నటుడిగా యోగి బాబు ప్రేక్షకులను అలరించారు. 'కోలమావు కోకిల' వంటి చిత్రాలలో ఆయన పోషించిన సహాయక పాత్రలు కూడా ఎంతో గుర్తింపు తెచ్చాయి. ఒకే చిత్రంలో తాజా ప్రాజెక్టు ఒక ప్రత్యేకమైన వినోదాత్మక చిత్రంగా నిలుస్తుం దన్న భారీ అంచనాలు ఉన్నాయి.

'చెన్నై లవ్ స్టోరీ' మార్క్ క్రియేట్ చేయాలి: ఎస్‌కెఎన్



జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి కల్ట్ ప్రొడ్యూసర్‌గా ఎదిగారు ఎస్‌కెఎన్. టాక్సీవాలా, బేబి వంటి చిత్రాలు ప్రొడ్యూసర్‌గా ఆయన అభిరుచికి నిదర్శనంగా నిలు స్తాయి. రాజీ పడకుండా కథ కోరుకున్నవన్నీ సమకూర్చి సినిమా నిర్మించడమే కాదు ఆ చిత్రాన్ని ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లడంలో వినూత్నంగా ఆలోచిస్తుంటారు ఎస్‌కెఎన్. స్ట్రాంగ్ కంటెంట్‌తో సినిమాలు చేస్తూ బ్లాక్ బస్టర్స్ అందుకుంటున్న ఈ రైజింగ్ ప్రొడ్యూసర్.. ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. మన తెలుగు జంట నివసిస్తుంటారు. అందుకే చెన్నై లవ్ స్టోరీ అని సినిమా టైటిల్ పెట్టాం. బేబి సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత మేకర్స్‌గా మాపై అంచనాలు పెరిగాయి. అందుకే ఒక మంచి మూవీతోనే ఆడియెన్స్ ముందుకు రావాలని ఏడాది సమయం తీసు కున్నాం. ప్రస్తుతం మా సినిమా తెలుగు రిలీజ్ వర్క్స్ స్పీడ్‌గా జరుగుతున్నాయి. తమిళ్ రిలీజ్ అదే వారం చేయాలా, ఒకట్రెండు వారాలు ఆగి చేయాలా అనేది ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. మేము అనుకున్న కథకు కిరణ్ అబ్బవరం వందశాతం న్యాయం చేశారు. ఆయన ఇప్పటిదాకా బాయ్ నెక్స్ట్‌డోర్ క్యారెక్టర్స్ చేశారు. మాస్ క్యారెక్టర్స్‌లో నటించారు. కిరణ్ నటనలోని ఒక మెచ్యూరిటీని ఈ సినిమాలో చూస్తారు. సాయి రాజేష్ కథల్లో హీరోయిన్స్‌కు మంచి ప్రాధాన్యత ఉంటుందని మీకు తెలుసు.ఈ సినిమా కథ అనుకున్నాక, ఇంత బలమైన పాత్ర ఎవరు చేస్తే బాగుంట.,? తొలిప్రేమ అయినా మలిప్రేమ అయినా మన జీవితం లో భాగమే. తొలి ప్రేమ దక్కని వారిలో మళ్లీ ప్రేమ పుట్టదని చెప్పలేం. ఏదైనా జీవితం ముందుకు సాగాల్సిందే. బేబి సినిమాను తొలి ప్రేమ నేపథ్యంగా నిర్మించాం.

'అమీర్ లోగ్' టీజర్ విడుదల

అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో రమణారెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'అమీర్ లోగ్' ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో వేద జలంధర్ , రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి పలువురు కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో.. వంశీ నందిపాటి మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' మూవీని నేను ఆల్రెడీ చూశాను. డబ్బు పరంగా రిచ్ అని అనుకుంటారు. కానీ స్నేహం, ప్రేమ విషయంలో రిచ్. మిడిల్ క్లాస్ జీవితాల్ని చూపించారు. సినిమాని చూస్తూ నేనెంతో ఎంజాయ్ చేశాను. దర్శ కుడు రమణా రెడ్డి మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చి టీజర్‌ను రిలీజ్ చేసిన వంశీకి థాంక్స్. ..ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సందీప్ మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు...కామ్రేడ్ కళ్యాణ్ నిర్మాత వెంకట కృష్ణ మాట్లాడుతూ.. .అమీర్ లోగ్ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. రమణరెడ్డికి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. ..మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి మాట్లా డుతూ.. 'అమీర్ లోగ్' నాకెంతో ప్రత్యేకం. షూటింగ్ అంతా లంగర్ హౌజ్‌లో, మ్యూజిక్ అంతా కాచిగూడలో జరిగింది. నటుడు మనోజ్ మాట్లాడుతూ.. 'అమీర్ లోగ్'టీజర్ లాంచ్‌కి వచ్చిన వంశీకి థాంక్స్. మాకు సపోర్ట్ చేస్తున్న స్పిరిట్ మీడియాకి థాంక్స్. మా అందరినీ ఎంకరేజ్ చేసిన రమణకి థాంక్స్ నటుడు విశ్వేందర్ రెడ్డి మాట్లాడుతూ.. .'అమీర్ లోగ్' నా మనసుకు నచ్చిన చిత్రం. ఈ కథ అంతా కూడా బిర్యానీ చుట్టూనే తిరుగుతుంది.

'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' టీజర్ లాంచ్

'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' టీజర్ లాంచ్ ఈవెంట్..... మహేష్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' చిత్ర టీజర్‌ను చిత్రబృందం నేడు ఘనంగా విడుదల చేసింది. ఈ చిత్రం విభిన్నమైన కథనంతో తెరకెక్కుతోంది. "ది పాయింట్ ఆఫ్ వ్యూ" అనే ట్యాగ్‌లైన్‌నే కథలోని ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తోంది. టీజర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా మీడియా సమావేశాన్ని నిర్వహించింది.నిర్మాత సత్య చౌదరి మాట్లాడుతూ.... "మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. నేను వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. కానీ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. దాదాపు పదేళ్ల క్రితం మహేష్ ఈ కథను నాకు వినిపించారు. ఒక మహిళా ప్రధాన కథతో మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాను" అన్నారు. హీరోయిన్ సోనియా నాయుడు మాట్లా డుతూ....స్టేజ్‌పై మాట్లాడటం ఇదే మొదటిసారి. నాకు ఈ అవకాశం ఇచ్చిన సత్యకి, మహేష్‌కి ధన్యవాదాలు. హీరోయిన్ పూజా రెడ్డి మాట్లాడుతూ.. "మా టీజర్ విడుదల కార్యక్రమానికి వచ్చిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. మహేష్ కథ చెప్పిన వెంటనే ఇది నాకు మంచి అవకాశం అని భావించాను. ఈ సినిమాలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ..దర్శకుడు మహేష్ కాంపెల్లి మాట్లాడుతూ.... "ఇది నా తొలి దర్శకత్వ చిత్రం. నేను ఇంతకుముందు ఏ దర్శకుడి దగ్గరా పని చేయలేదని నిర్మాత సత్యకి ముందే చెప్పాను. అయినప్పటికీ నేను రాసుకున్న కథపై పూర్తి నమ్మకం ఉంది.

'నాగబంధం'కు విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు

థియేటర్‌లో ప్రేక్షకుల రియాక్షన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది: థాంక్స్ మీట్‌లో హీరో విరాట్ కర్ణ

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ నాగబంధం. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటించారు. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఘన విజయం సాధించి, థాంక్స్ మీట్‌లో హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. 'మేమందరం కొత్తవాళ్లం కలిసి ఇంత భారీ బడ్జెట్‌తో ఒక కొత్త ప్రయత్నం చేశాం. ఈ ప్రయత్నానికి ఆడియన్స్ అందరూ కూడా థియేటర్‌కు వచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. హీరోయిన్ నభా నటేష్ మాటాడుతూ.. మా టీమ్ రెండున్నర ఏళ్ల కష్టానికి ప్రేక్షకులు అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చారు. దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ.. ఇది నా మొదటి చిత్రం. నేను విమర్శకులకు, రివ్యూ రైటర్లకు అందరికీ గౌరవం ఇస్తాను. అంతిమంగా ప్రేక్షకుల నిర్ణయమే తుది నిర్ణయం. ఆడియన్స్ రెస్పాన్స్ మేరకు ఫస్ట్ హాఫ్‌లో ఒక సాంగ్ లెంగ్త్ ఎక్కువగా ఉందని భావించి దాన్ని తొలగించాం. అలాగే క్లైమాక్స్ కూడా కొంచెం ఎక్కువగా ఉందని ట్రిమ్ చేశాం. కానీ కొంతమంది సినిమా రిలీజ్ కాకముందే రివ్యూలు ఇవ్వడం నాకు ఆశ్చర్యంగా అనిపించిందినిర్మాత నిశిత మాట్లాడుతూ..తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. ఈ సినిమాకు ఎంతో ప్రేమ, ప్రోత్సాహం అందించారు

ప్రముఖ దేవాలయాల దర్శనం చేసిన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తమ్మినేని గీత

ఆమదాలవలస, జూలై 6 (ప్రభాతవార్త)
సోమవారం మంగళగిరి, అమరావతిలోని ప్రముఖ దేవాలయాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, భర్త రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ దర్శిం చుకున్నారు. మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి, పానకాల నరసింహస్వామి ఆలయాల తో పాటు అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కుటుంబ సభ్యులకు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు గీత, విద్యాసాగర్ దంపతులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ విభాగం ప్రైవేట్ పరం చేయొద్దు

ఇచ్ఛాపురం, జూలై 6 ప్రభాతవార్త:
రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రైవేట్ పరం చేయొద్దని డాక్యుమెంట్ రైటర్లు కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కింతలి తవిటి నాయుడుకు స్టాంప్ వెండర్లు, దస్తావేజు లేఖరులు, సహాయకులు వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేటు భాగస్వామ్యం విషయమై విడుదలైన జి.వో.ఎం.యస్.నెం.396ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజప్తి చేశారు. ప్రైవేటీకరణ విధి విధానాలను మేము వ్యతిరేకిస్తున్నామని రిజిస్ట్రేషన్ కార్యలయాలలో ఫ్రంట్ ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని కార్పోరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం వల్ల దస్తావేజులు లేఖరులు, సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. చట్టబద్ధత లేని ప్రైవేటు సంస్థల పరం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా దారుణమని ఇలాంటి మార్పుల వల్ల అవకతవకలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానం ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప్పాడ సోమేశ్వరరావు రెడ్డి, చెన్నూరు గుప్తా రాజు, జల్లు జగదీష్, కేశవపట్నం మోహన్, వెంకట రమణ కామేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

ఇచ్ఛాపురం, జూలై 6 ప్రభాతవార్త:
భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా స్థానిక వీకేపీ ఫంక్షన్ హాల్‌లో పట్టణ బిజెపి అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి వి.క్రిష్ణ ప్రసాద్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రంగా, మాజీ పట్టణ అధ్యక్షులు బాబురావు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వి.క్రిష్ణప్రసాద్, రంగా ప్రసంగిస్తూ అయన జీవిత చరిత్ర, జనసంఘ్‌లో అతను పాత్రను వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వీక్లీ స్టాల్

కంచిలి, జూలై 6 ప్రభాతవార్త
కంచిలి మండలం ఎం డి ఓ ఆఫీస్ దగ్గర ప్రతి సోమవారం మండలములో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, బియ్యం, బెల్లం మొదలగునవి అన్ని రకాలు ఆహార ఉత్పత్తులను స్టాల్స్‌లో పెట్టి అమ్మడం జరుగుతుంది. ప్రతి వారం కూడా కంచిలి మండలం ప్రభుత్వ అన్ని కార్యాలయ అధికారులు మరియు పత్రిక రిపోర్టర్స్ మరియు స్థానిక స్థానిక వినియోగదారులు కూడా ప్రతి వారం ఇక్కడకు తెచ్చిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు క్యూ ఆర్ కోడ్ ఉన్న రైతులు మాత్రమే ఈ స్టాల్‌లో విక్రయించడం జరుగుతుంది. మండల ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ శివానందం, కామరాజు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈ స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.

జీవో 396ను తక్షణమే రద్దు చేయాలి

-పెన్ డౌన్ నిరసన చేపట్టిన దస్తావేజు లేఖర్లు

రణస్థలం, జూలై 6 ప్రభాతవార్త
ఎన్నో తరాలుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధిలా సేవలు అందిస్తున్న దస్తావేజు లేఖర్ల వ్యవస్థను రద్దు చేసి, ఈ రంగాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులు నిరసన కార్యక్రమంలో భాగంగా రణస్థలం దస్తావేజు లేఖర్లు సోమవారం మండల కేంద్రంలో రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పెన్ డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎంతోమంది దస్తావేజు లేఖర్ల ఉపాధి దెబ్బతింటుందని,

వారి పొట్ట కొట్టేందుకే ఈ జీవోను తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు నమ్మకంగా సేవలు అందిస్తున్న తమ ఉపాధిని దెబ్బతీసే ఇలాంటి ప్రజా వ్యతిరేక జీవోలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు. అనంతరం వారు సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ దస్తావేజు లేఖర్లు జల్లేపల్లి ప్రకాశరావు, మీసాల రామారావు, రాజపాత్రుని మౌళీశ్వరరావు, సురావజ్జుల శివకుమార్, పులగుర్త మల్లిబాబు, బలివాడ శ్రీనివాసరావు, బైరి రామారావు, పారుపూడి వెంకటేశ్వరరావు, గుగ్గిలాపు స్వప్న, బొడ్డ మల్లిబాబు, పట్నాయకుని ధనుంజరావు, యతిరాజుల గోపాలకృష్ణ, తరిగొప్పుల శ్రీనివాసరావు, దుక్క ప్రసాద్, మామిడి తారకేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

9న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు వేలం

సీతంపేట, జూలై 6 ప్రభాతవార్త
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎక్సైజ్ కేసులో పట్టుబడిన వాహనాలను ఈ నెల 9న సీతంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఎస్ఐ వై.అమ్మన్నారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో పికప్, ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్‌కు ఈ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేలం పాటలో ఎవరైనా ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని తెలిపారు.

ఐతం విద్యార్థులకు ఉద్యోగాలు!

టెక్కలి, జూలై 6 ప్రభాతవార్త
టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 2026 గ్రాడ్యుయేషన్ మెకానికల్, సివిల్, ఈఈఈ విభాగాలకు చెందిన 14 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు సాధించారు. ప్రముఖ సీటీఆర్ఎల్ఎస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో వీరు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికంగా రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు వేతనం ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డీన్ డా. ఎం.సంతోష్ కుమార్, డా. శ్రీకాంత్, విభాగాధిపతులు అభినందించారు.

ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

కవిటి, జూలై 6 ప్రభాతవార్త
ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రాపాకపుట్టుగ గ్రామంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ పాల్గొని గ్రామస్తులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని అన్నారు. ఓటరు జాబితాలో, పేర్లలో తప్పులు ఉంటే సవరణ చేయించుకోవడం, చిరునామా మారిన వారు అవసరమైన మార్పులు నమోదు చేయించుకోవడం వంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి ఓటు దేశాభివృద్ధి, మంచి పాలనకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజల్లో ఓటు హక్కుపై మరింత చైతన్యం పెంపొందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. మద్దెల ఈశ్వరరావు, ఎలమంచి నీలయ్య, ధర్మాన బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో రేపు విద్యుత్ కోత

ఇచ్ఛాపురం, జూలై 6 ప్రభాతవార్త
ఇచ్ఛాపురం పట్టణం మరియు రూరల్ ఏరియా, రైల్వే స్టేషన్ ఏరియా, గొల్లవీధి, పకీర్‌పేట, వికె పేట, రత్తకన్న, మండపల్లి, బుడ్డుపుపేట, తోటూరు, మశాఖపురం, జగన్నాథపురం గ్రామాలలో బుధవారం ఉదయం 9 నుండి 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పలాస ఈఈ జి.యజ్ఞేశ్వర రావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణంకు తరలించిన వర్మీ కంపోస్టు బస్తాలు

టెక్కలి, జూలై 6 ప్రభాతవార్త
టెక్కలి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తయారైన 1000 కేజీల వర్మీ కంపోస్ట్ బస్తాల రూపంలో, 30 కేజీలు ప్యాకెట్ల రూపంలో ధోని కొండలరావు రైతు డిపో (ఎరువులు దుకాణం)కి టెక్కలి ఎంపీడీవో ఎం.రేణుక ఆధ్వర్యంలో అమ్మడం జరిగింది. ఈ సహజ సిద్ధమైన ఎరువు అమ్మకం ద్వారా వచ్చిన రూ .10,600/ రూపాయలను గ్రామపంచాయతీ ఖాతాకు జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ ఎంపీడీవో కే.సింహాద్రి, పంచాయతీ సిబ్బంది మరియు క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

కోటబొమ్మాళి, జూలై 6 ప్రభాతవార్త:
మండలం లఖందిడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థులు కొనారి సంధ్య, స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిట్ట మణికంఠకు, స్థానిక జూనియర్ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన పైల వనితలకు రూ.5వేలు చొప్పున్న స్పందన ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పేదవారు నాణ్యమైన విద్య పొందుటకు పేదరికం అనేది కారణం కాకూడదని, మా సంస్థ ద్వారా ఇప్పటి వరకు చాలా మంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, అలాగే ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు అందజేశామని తెలిపారు. ఇంకా ఎవరైనా పేదవారు తమ విద్య కొనసాగింపుటకు సహాయం కావాలంటే తమకు సంప్రదించాలని సంస్థ సభ్యులు షణ్ముఖ మాస్టర్, భూషన్‌రెడ్డిలు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలినాయుడు, సభ్యులు నాగేశ్వరరావు, బైరాగి, చిన్న, శోభన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గిరిజనుడు మృతి

సీతంపేట, జూలై 6 ప్రభాతవార్త
సీతంపేట పీఎంఆర్సి జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో అడ్డుబంగి పంచాయతీ సిక్కింగూడకు చెందిన సవర మల్లయ్య (80)కు తీవ్ర గాయాలు తగలడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాలకొండ నుంచి సీతంపేట వైపు ఆర్టీసీ బస్సు వస్తున్న సమయంలో కుడి వైపు నుంచి వస్తున్న మల్లయ్యను డ్రైవర్ గమనించకపోవడంతో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో మల్లయ్య రెండు చేతులు విరిగిపోయాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడుకు నలుగురు పిల్లలు ఉన్నారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్ డ్యామ్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే మామిడి

హిరమండలం, జూలై 6 ప్రభాతవార్త
మండలంలోని ధనుపురం గ్రామంలోని పొగడ వెల్లి గెడ్డపై ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పథకం కింద రూ.29 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరులు కల్పించేందుకు చెక్ డ్యామ్‌ల నిర్మాణం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ధనుపురం గ్రామ రైతులకు ఈ చెక్ డ్యామ్ ద్వారా సాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తెజేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు అన్ని శాఖల మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

పలు రహదారులను ప్రారంభించిన కేంద్ర మంత్రి

కొత్తూరు, జూలై 6 ప్రభాతవార్త :
గొట్ట గ్రామం నుంచి నివగాం వరకు గులుమూరు, ఆకులతంపర, సోమరాజుపురం గ్రామాల మీదుగా సుమారు రూ.2.80 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన నూతన తారు రహదారిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ముఖ్యంగా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో గొట్ట, గులుమూరు, ఆకులతంపర, సోమరాజుపురం, నివగాం గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు. అదేవిధంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవడానికి, అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి రావడానికి ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని వారు వివరించారు. ఐదు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఇప్పిలి

కంచిలి, జూలై 6 ప్రభాతవార్త
కంచిలి గ్రామానికి చెందిన మన్యాల శ్రీలక్ష్మి ఇటీవల తగరపువలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయిన విషయం తెలిసిందే. వీరిని సోమవారం వైయస్సార్ పార్టీ జెడ్పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు పరామర్శించారు.

జన సైనికుడికి అండగా ఉంటాము

ఆమదాలవలస, జులై 6 ప్రభాతవార్త :
ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఆమదాలవలస మండలం కట్టాచార్యుల పేట గ్రామానికి చెందిన జన సైనికుడు తమ్మినేని వెంకటేష్‌ను నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పేడాడ రామ్మోహన్‌రావు సోమవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేడాడ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమాను వెంకటేష్‌కు అందజేసేలా చూస్తామని తెలిపారు. జన సైనికులకు అండగా జనసేన పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో జనసేన నాయకులు పేడాడ నర్సింగరావు, శిర్లపు గణేష్, మజ్జి రాంబాబు, పొట్నూరు ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు గురుకుల విద్యార్థుల శ్రమదానం

సీతంపేట, జూలై 6 ప్రభాతవార్త
ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ పిలుపునిచ్చిన నేపథ్యంలో సీతంపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సోమవారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణతో పాటు పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు ఏరి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే హానిపై అవగాహన కల్పిస్తూ, పరిశుభ్రమైన పరిసరాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు వివరించారు.

సామరెల్లిలో ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం..

సామరెల్లి ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఏ డిప్యూటీ డీఎం హెచ్‌వో విజయ పార్వతి హాజరై విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. నాటు వైద్యానికి దూరంగా ఉండి, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కరరావు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

రైతులకు మొదటి విడత ఎరువులు పంపిణీ

మండల వ్యవసాయాధికారి దానకర్ణుడు

మెళియాపుట్టి, జూలై 6 ప్రభాతవార్త
మెలియాపుట్టి మండలంలో రైతులకు ఏపీఎఐఎంఎస్ ద్వారా ఎరువులు పంపిణీ మొదలైనట్లు మండల వ్యవసాయాధికారి యస్.దానకర్ణుడు తెలిపారు. సోమవారం కోసమల గ్రామంలో పీఏసీఎస్ ఛైర్మన్ సలాన మోహన్‌రావు అధ్యక్షతన రైతులకి పీఏసీఎస్ ద్వారా యూరియా 10 టన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులకి వాళ్ల సాగు చేస్తున్న భూమి వివరాలు ప్రకారం ఏపీఎఐఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం జరిగిందని తెలిపారు. యూరియా ఎరువు రైతులకి 3 విడతలలో పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు. ఇప్పటివరకు యూరియా 33 టన్నులు, డీఏపీ 18 టన్నులు రైతులకి అందించినట్లు తెలిపారు. రైతులు డీఏపీ కి ప్రత్యామ్నాయంగా ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులు వాడాలని కోరారు. 18 రైతు సేవా కేంద్రాలలో యూరియా 180 టన్నులు, డీఏపీ 60 టన్నులు ఉన్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌లో 25 టన్నులు యూరియా, ప్రైవేట్ దుకాణాలలో 10 టన్నులు యూరియా, డీఏపీ 5 టన్నులు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకు క్రాంతి,మండల టిడిపి అధ్యక్షులు నంబల్ల వెంకటరావు,గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మండల టిడిపి కార్యదర్శి బొచ్చు ప్రసాద్, కూటమి నాయకులు వెంకటరావు, ధర్మారావు,హేమంత్ కుమార్ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలి

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పూర్తిస్థాయిలో మందులు పంపిణీ చేయాలి

కవిటి, జూలై 6 ప్రభాతవార్త:
మండలంలోని బెలగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ డా.రాకేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆసుపత్రి పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వ అభివృద్ధి నిధుల వినియోగం, మౌలిక వసతుల మెరుగుదల తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా సి కె డి పేషెంట్లకు అవసరమైన 14 రకాల మందులలో కేవలం ఎనిమిది రకాల మందులు మాత్రమే ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని మిగతా వాటిని కూడా ప్రభుత్వం ఆసుపత్రులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, పరిశుభ్రత, రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆసుపత్రి వైద్యులు, ఏఎంసీ ఛైర్మన్ మణిచందర్, మద్దెల ఈశ్వరరావు, డి.నేతాజీ, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ కుమార్, సీపాన నారాయణ వైద్య సిబ్బంది, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుక్కలకు సరైన సమయంలో టీకాలు వేయించాలి..

కోటబొమ్మాళి, జూలై 6 ప్రభాతవార్త
పెంపుడు కుక్కలకు సరైన వయసులో టీకాలు వేయించుకోవాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు మంద లోకనాథం అన్నారు. సోమవారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి 57 పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్క పుట్టిన 45వ, 60వ, 90వ రోజు, అక్కడి నుంచి ప్రతీ 6 నెలలకు, 12 నెలలకు రాబీస్ మరియు ఇతర వ్యాధులను నివారించే టీకాలను వేసుకోవాలని, అలా టీకాలు వేయటం వల్ల కొంతవరకు జూనోసిస్ వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చునని ఆయన సూచించారు. ఇక్కడకి రాలేని వారికి ఆయా గ్రామాల్లో టీకాలు వేయడం జరుగుతుందని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, ప్రజా ప్రతినిధులు వెలమల కామేశ్వరరావు, బాదాన రమణమ్మ, కోరాడ గోవిందరావు, దేవాది సింహాద్రమ్మ, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పొట్ట కొట్టవద్దు

కోటబొమ్మాళి, జూలై 6 ప్రభాతవార్త:
రిజిస్ట్రేషన్ స్టాంప్‌ల శాఖను ప్రైవేటీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.యస్. నెం.396ను వెంటనే ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖరుల సంఘం అద్వర్యంలో కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి పెన్ డౌన్ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు దస్తావేజు లేఖరుల నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధి విధానాలను మేము వ్యతిరేకిస్తున్నామని, రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఫ్రంట్ ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని కార్పోరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం వల్ల దస్తావేజులు లేఖరులు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోవాల్సి ఉంటుందని, ఈ నూతన విధానాలతో తమ పొట్టకొట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు బాస్కరరావు మాస్టర్, శిరసాన శ్రీనివాస్, సురేష్, అనిల్, కామేశ్వరరావు, మురళి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ జయంతి రోజున మెగా రక్తదాన శిబిరం

కొత్తూరు, జూలై 6 ప్రభాతవార్త :
దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీ (బుధవారం) పాతపట్నంలో భారీ మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ స్థానిక నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతమ్మ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ కొత్తూరు మండల పార్టీ అధ్యక్షులు గండివలస ఆనందరావు, ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్ మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తూరు మండలం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు, రోగులు ఈ ఉచిత వైద్య శిబిరానికి తరలివచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనము లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుడబండి పోలయ్య, మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం హరీష్, ప్రధాన కార్యదర్శి బొమ్మాలి నగేష్, వైఎస్సార్సీపీ యువ నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

07-07pg10.qxd:07-07pg10.qxd 1/1/02 7:00 AM Page 1

జింబాబ్వే టి20 సిరీస్‌కు సంజూ ఔట్, ప్రభ్‌సిమ్రన్ ఇన్
ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శివమ్ దూబే

ముంబై, జులై 6: ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు, జింబాబ్వేతో జరిగేటీ 20 సిరీస్‌లకు టీమిండియా జట్లను బీసీసీఐ ప్రకటించింది. శివమ్ దూబే దాదాపు రెండేళ్ల తర్వాత భారత వన్డే జట్టులోకి వచ్చాడు. గాయంతో దూరమైన నితీశ్ కుమార్ స్థానాన్ని దూబేతో బీసీసీఐ సెలక్షన్ కమిటీ భర్తీ చేసింది. టీ20 జట్టులో కీలక సభ్యునిగా ఉన్న దూబే.. చివరివన్డే 2024 ఆగస్టులో ఆడాడు. ఇదొక్క మార్పుతోనే సరిపెట్టింది.
జూలై 23నుంచి ప్రారంభం కాబోయే జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. సంజూ శాంసన్‌పై సెలక్టర్లు వేటు వేశారు. అతడి స్థానంలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను ఎంపిక చేశారు. అలాగే వైభవ్ సూర్యవంశీని కొనసాగించారు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆడుతున్న అక్షర్ పటేల్, వాషింగ్టన్ , రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు విశ్రాంతినిచ్చారు. అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్‌లు జట్టులోకి రాగా, ఫినిషర్ రింకూ సింగ్ తిరిగి జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.

ఇంగ్లండ్‌తో వన్డేలకు భారత్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ , కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్,అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.

జింబాబ్వేతో టీ20లకు భారత్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

గుండె పగిలిన బ్రెజిల్ స్టార్ నేమార్
సాకర్‌కు అల్విదా

న్యూజెర్సీ, జులై 6: బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో కొత్త తరానికి స్ఫూర్తిగా నిలిచిన నేమార్ జూనియర్ వీడ్కోలు పలికాడు. పీలే, రొనాల్డో, రొనాల్డిన్హో వంటి దిగ్గజాల వారసత్వాన్ని కొనసాగించి, షో మ్యాన్‌గా ఓ వెలుగు వెలిగిన నేమార్ అనూహ్యంగా సాకర్‌కు బైబై చెప్పేశాడు. ఫిఫా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో నార్వే చేతిలో ఓటమితో కుంగిపోయిన బ్రెజిల్ స్టార్ నేమార్.. ఈ తీవ్ర నిర్ణయానికి వచ్చాడు. ఆ సమయంలో తీవ్ర ఉద్వేగానికి గురై, కన్నీరు పెట్టుకున్నాడు. తన కెరీర్ ఎక్కడ మొదలైందో అక్కడే ముగిసిందని వెల్లడించాడు. తన ప్రాణానికి ప్రాణమైన ఆటకు నేమార్ విచార వదనంతో అల్విదా చెప్పడం కోట్లాదిమందిని కలచివేసింది. ఈ నిర్ణయంతో నేమార్ 16 ఏళ్ల కెరీర్ ముగిసింది.
నేమార్... బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఈ పేరు ఓ సంచలనం. బ్రెజిల్ తరపున ఆడిన దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్రెజిల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలవడంతో పాటు.. జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 130 మ్యాచ్‌లలో 80గోల్స్ సాధించాడు. 2010లో అరంగేట్రం చేసిన న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలోనే యాదృచ్ఛికంగా చివరి మ్యాచ్ ఆడేశాడు.
రెండో అర్ధభాగంలో మైదానంలోకి వచ్చిన నేమార్.. పెనాల్టీని గోల్‌గా మలిచినా, బ్రెజిల్‌ను టోర్నీ నుండి నిష్క్రమించకుండా ఆపలేకపోయాడు. ఫైనల్ విజిల్ తర్వాత అతను ఏకధాటిగా ఏడుస్తున్న దృశ్యాలు అభిమానుల హృదయాలను కలచివేశాయి. అతని బ్రెజిల్ సహచరులు చాలామంది అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించారు, కానీ బార్సిలోనా మాజీ ఆటగాడైన అతను పూర్తిగా కుంగిపోయాడు. "నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇప్పుడు అంతా ముగిసింది" అని నేమార్ అన్నాడు.

నేను ప్రయత్నించాను, చాలా ప్రయత్నించాను. ఇపుడు అది ముగిసింది... నార్వే చేతిలో ఓటమితో బ్రెజిల్ నిష్క్రమించిన తర్వాత గుండె పగిలిన ఆవేదనతో ఫుట్‌బాల్ దిగ్గజం నేమార్ పలికిన మాటలు. సాకర్ ప్రపంచకప్ అందించాలన్న కలలు కల్లలయిన వేళ కన్నీళ్లతో తన ఫుట్‌బాల్ కెరీర్‌కు అల్విదా పలికాడు.

మెక్సికోకు ఇంగ్లండ్, బ్రెజిల్‌కు నార్వే షాక్

న్యూజెర్సీ, జులై 6: నార్వే సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలిసారి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో హాట్ ఫేవరెట్ బ్రెజిల్‌పై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. నార్వే స్టార్ ఫార్వర్డ్, మాంచెస్టర్ సిటీ సంచలనం ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్‌తో నార్వేకు అద్భుత విజయాన్ని అందించాడు. ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే బ్రెజిల్‌కు లభించిన గోల్డెన్ ఛాయిస్‌ను చేజార్చుకుంది. ఆట ప్రారంభంలోనే పెనాల్టీ లభించగా గిమారెస్ దాన్ని గోల్‌గా మలచడంలో తడబడ్డాడు.నార్వేగోల్‌కీపర్ నైలాండ్ అడ్డుకున్నాడు. దీంతో తొలి హాఫ్ ముగిసేసరికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

చెలరేగిన హాలాండ్

ద్వితీయార్థంలో నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ దూసుకుపోయాడు. ఆట 79వ నిమిషంలో నార్వే ఆటగాడు షెల్డెరప్ అద్భుతమైన క్రాస్‌ను అందించగా దాన్ని హాలాండ్ అత్యంత ఎత్తుకు లేచి బ్రెజిల్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ ఇచ్చిన షాక్ నుంచి బ్రెజిల్ కోలుకోకముందే, హాలాండ్ మరోసారి తన ప్రతాపం చూపించాడు. బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మార్చుకుంటూ మ్యాచ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు హాలండ్ రెండో గోల్ సాధించి నార్వే ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇది ఈ సాకర్ వరల్డ్ కప్‌లో హాలాండ్‌కు ఏడో గోల్. మెస్సీ,కిలియన్ ఎంబాపేల సరసన నిలిచిన హాలాండ్... గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు.

ఇంజ్యూరీ టైమ్‌లో బ్రెజిల్ గోల్

ఇకమ్యాచ్ ఇంజ్యూరీ టైమ్ 10వ నిమిషంలో బ్రెజిల్ ఆటగాడు కాసెమిరోను నార్వే డిఫెండర్ ఓస్టిగార్డ్ ప్రమాదకరంగా అడ్డుకోవడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీని నేమార్ గోల్‌గా మలిచి నార్వే ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. ఈ ప్రపంచ కప్‌లో నేమార్‌కు ఇదే మొదటి గోల్.అప్పటికే సమయం మించిపోవడంతో బ్రెజిల్ 2-1తో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

బెల్లింగ్‌హామ్ డబుల్.. మెక్సికోపై విజయం

సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ అసాధారణ ఆటతీరు కొనసాగుతోంది. మెక్సికోను దాని సొంతగడ్డపై 3-2తో ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ రెండు నిమిషాల వ్యవధిలో (36, 38) రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. కెప్టెన్ హ్యారీ కేన్ పెనాల్టీ ద్వారా మరో గోల్ (60వ నిమిషం) సాధించాడు.
తొలి అర్ధభాగం 36వ నిమిషంలో బెల్లింగ్‌హామ్ తొలి గోల్‌తో ఇంగ్లండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ గోల్‌కు కేవలం 98 సెకన్ల వ్యవధిలోనే మరోసారి గోల్ చేసి స్కోరును 2-0కు చేర్చాడు. అతని వేగవంతమైన డబుల్‌తో మెక్సికో ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది.అయినా పుంజుకుని 42వ నిమిషంలో జూలియన్ క్వినోనెస్ గోల్ చేసి ఇంగ్లండ్ ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు.

కేన్ గోల్.. క్వాన్సా రెడ్ కార్డ్

రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే ఇంగ్లండ్‌కు పెనాల్టీ లభించింది. 60వ నిమిషంలో హ్యారీ కేన్ దాన్ని గోల్‌గా మలిచి జట్టుకు 3-1 ఆధిక్యంఅందించాడు.అయిదే జారెల్ క్వాన్సా రెడ్ కార్డ్ గురై మైదానం వీడడంతో ... దీన్ని అవకాశంగా మార్చుకుని మెక్సికో వరుస దాడులు చేసింది. రౌల్ జి మెనెజ్ మరో గోల్ చేసి 3-2కు తీసుకువచ్చాడు. చివరి నిమిషాల్లో మెక్సికో సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

బెల్లింగ్‌హామ్ రెండు గోల్స్

క్వార్టర్ ఫైనల్లో సినర్, కోకో గాఫ్

లండన్, జులై 6: ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్.. వరుసగా ఐదో వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. జపనీస్ క్వాలిఫయర్ షింటారో మోచిజుకిపై 6-3, 7-6, 6-3 తేడాతో గెలుపొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్ సినర్..తొలి సెట్‌ను అలవోకగానే నెగ్గాడు. అయితే రెండో సెట్‌లో షింటారో నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఎవరి సర్వీసులు వారు నిలుపుకోవడంతో సెట్ టైబ్రేక్‌కు సాగింది. చివరకు అనుభవజ్ఞుడైన సినర్‌దే విజయం అయింది. మూడో సెట్‌ను మరింత ఈజీగా నెగ్గి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఏడుసార్లు వింబుల్డన్ విజేత నోవాక్ జొకోవిచ్ ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా సినర్ నిలిచాడు. పురుషుల సింగిల్స్ మిగతా నాలుగో రౌండ్‌లో కొబొలి 7-4, 7-6, 6-3తో మినార్‌పై అతికష్టంపై గెలుపొండగా...స్టఫ్ 3-6,6-7, 7-6, 7-5, 4-2తో హుర్కాజ్‌పై గెలుపొందాడు. చివరి సెట్‌లో హుర్కాజ్ తొడకండరాల గాయంతో రిటైర్ అయ్యాడు.
కాగా అమెరికా సంచలనం కోకో గాఫ్... మహిళల సింగిల్స్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ చేరింది. నాలుగో రౌండ్‌లో బెలిండా బెన్సిక్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. తొలి సెట్‌లో గాఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కోకో గాఫ్ సర్వీసును బెలిండా బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-4తో నెగ్గింది. అయితే వెంటనే పుంజుకున్న కోకో గాఫ్ రెండో సెట్‌ను 6-3తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌ను కూడా ఈజీగా కైవసం చేసుకుని కోకో గాఫ్ ముందంజ వేసింది. మిగతా నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో నొస్కోవా 6-4, 7-6తో చెమటోడ్చి 26వ సీడ్ కీస్‌పై గెలుపొందగా... మూడు సెట్ల పోరులో పావోలిని 6-4, 4-6, 6-3తో ఇలాపై, మెర్టెన్స్ 6-4, 6-4తో బౌజ్కోవాపై, కోస్ట్యుక్ 6-4, 6-4తో క్రుయేగర్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరారు.

ఆటో, మెటల్ షేర్ల మద్దతు

లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి,జులై 6: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. తొలి త్రైమాసిక వ్యాపార అప్‌డేట్లు ఆశాజనకంగా ఉండటం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, నైరుతి రుతుపవనాల పురోగతి మెరుగుపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంశాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగగా.. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడి 78 వేల 285 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు ఎగిసి 24 వేల 430 వద్ద స్థిరపడింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ దాదాపు 2.36 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచాయి.
మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.679 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడి 95 రూపాయల 40 పైసల వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధరలు స్వల్పంగా తగ్గగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల 91 సెంట్ల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లలో యూరప్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవగా ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణితో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈనెల వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు పెరగడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఫెడ్ సమావేశపు మినిట్స్‌పై కేంద్రీకృతమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.36 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.76, కరూర్ వైశ్యా బ్యాంక్ 4.87, బంధన్ బ్యాంక్ 4.06 శాతం లాభపడ్డాయి. డిక్సన్ టెక్నాలజీస్ దాదాపు 7 శాతం ఎగసింది. ఫెర్మెంటా బయోటెక్ 13.78 శాతం జంప్ చేసింది.మరోవైపు సుప్రియా లైఫ్‌సైన్స్ షేరు 11 శాతానికి పైగా పతనమైంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర షేరు 2.29 శాతం తగ్గింది. కొత్తగా లిస్టైన ఆస్తా స్పింటెక్స్ షేరు ఇష్యూ ధర కంటే స్వల్ప ప్రీమియంతో 136 రూపాయల 45 పైసల వద్ద ముగిసింది. ఫాల్కాన్ కాన్సెప్ట్స్‌కు 101 కోట్ల 93 లక్షల రూపాయల విలువైన వర్క్ ఆర్డర్ లభించడంతో ఆ కంపెనీ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

భారత్ మార్కెట్ల నుంచి 580 మిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా

ముంబయి,జులై 6: భారత్ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా అయ్యాయి.గతవారం భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకున్నారు. ఎలారా సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు మొత్తం580 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇందులో భారత్‌కే ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టే ఫండ్ల నుంచి 250 మిలియన్ డాలర్లు వెనక్కి వెళ్లగా మిగిలిన నిధులు గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్స్, ఆసియా ఎక్స్ జపాన్ ఫండ్ల ద్వారా ఉపసంహరణకు గురయ్యాయి.
అంతకుముందు వారంలో 94 మిలియన్ డాలర్లుగా ఉన్న ఉపసంహరణలు ఇప్పుడు మరింత పెరిగాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన భారీ విక్రయాలతో పోలిస్తే ప్రస్తుత ఉపసంహరణలు తక్కువగానే ఉన్నాయి. అమెరికా ఈక్విటీ ఫండ్ల నుంచి ఒక్క వారంలోనే 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. అంతకుముందు వారంలో ఈ మొత్తం 8 బిలియన్ డాలర్లుగా ఉండగా మూడు వారాల క్రితం మాత్రం రికార్డు స్థాయిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి.
మార్చి తర్వాత తొలిసారిగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో కూడా 9 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత పెట్టుబడుల ప్రభావంతో పెరిగిన ఎమర్జింగ్ మార్కెట్ పెట్టుబడుల జోరు తగ్గుముఖం పట్టిందని ఎలారా వెల్లడించింది. ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో తైవాన్ నుంచి 766మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. ఇది గత 11 ఏళ్లలో అత్యధికం. దక్షిణ కొరియా నుంచి 283 మిలియన్ డాలర్లు బయటకు వెళ్లగా బ్రెజిల్ నుంచి గత ఏడు వారాల్లో దాదాపు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు విత్‌డ్రా అయ్యాయి. కమోడిటీ ఫండ్ల నుంచి వరుసగా ఎనిమిదో వారంలో 1.5 బిలియన్ డాలర్ల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎనర్జీ ఫండ్ల నుంచి రికార్డు స్థాయిలో 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. బంగారం ఫండ్ల నుంచి 14 వారాల్లో అత్యధికంగా 3.1 బిలియన్ డాలర్లు ఉపసంహరించుకోగా వెండి ఫండ్లలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు.

స్వల్పకాలిక రుణాలతో రూ.2.53 లక్షలకోట్ల సేకరణ

ముంబయి,జులై 6: దేశీయ కార్పొరేట్ సంస్థలు కమర్షియల్ పేపర్లు సీపీల ద్వారా నిధుల సమీకరణలో భారీ వృద్ధికనిపిస్తోంది. అనుకూలమైన వడ్డీ రేట్లు, సీజనల్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇప్పటికే ఉన్న రుణాల రీఫైనాన్సింగ్ కారణంగా జూన్ నెలలో సీపీల ద్వారా నిధుల సమీకరణ దాదాపు ఐదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. జూన్ నెలలో కంపెనీలు కమర్షియల్ పేపర్ల ద్వారా రూ.2 లక్షల 53 వేల కోట్లను సమీకరించాయి. మే నెలతో పోలిస్తే ఇది 84.6 శాతం అధికం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 59.4 శాతం వృద్ధి నమోదైంది.
2021 జులైలో రూ.2 లక్షల 69 వేల కోట్ల సమీకరణ తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం విశేషం. కరూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ విభాగాధిపతి వి. రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాలతో పోలిస్తే కమర్షియల్ పేపర్ల ద్వారా నిధుల సమీకరణ తక్కువ వ్యయంతో ఉండటంతో కార్పొరేట్లు ఈమార్గాన్ని ఎక్కువగా ఎంచుకున్నారని తెలిపారు.వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, మార్కెట్లో తగినంత నగదులభ్యత కూడా ఇందుకు దోహదపడిందని చెప్పారు. ధనలక్ష్మి బ్యాంక్ ట్రెజరీ హెడ్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ అధిక వడ్డీతో కూడిన బ్యాంకు రుణాలకు బదులుగా తక్కువ వ్యయంతో లభించే స్వల్పకాలిక మార్కెట్ ఫండింగ్ వైపు కార్పొరేట్లు, ఎన్‌బీఎఫ్‌సీలు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి మంచి డిమాండ్, స్థిరమైన క్రెడిట్ పరిస్థితులు కూడా ఈ ధోరణికి బలం చేకూర్చాయని వివరించారు.

కమర్షియల్ పేపర్లు అంటే కంపెనీలు 7 రోజుల నుంచి ఏడాది వరకు స్వల్పకాలిక నిధులు సమీకరించేందుకు ఉపయోగించే రుణ పత్రాలు. జూన్ తొలి భాగంలో కమర్షియల్ పేపర్లపై రిటర్నులు అధికంగా ఉన్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన భారీ లిక్విడిటీ ఇన్ఫ్యూజన్ చర్యలతో అవి తగ్గుముఖం పట్టాయి. ఆర్బీఐ వివిధ వేరియబుల్ రేట్ రెపో వేలాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.6 లక్షల కోట్లకు పైగా తాత్కాలిక లిక్విడిటీని అందించింది. ప్రస్తుతం జూలై 5 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1 లక్షా 85 వేల కోట్ల అదనపు లిక్విడిటీ ఉన్నట్లు ఆర్బీఐడేటా చెపుతోంది.

ఎన్ఎస్ఈ భారీ ఐపీవోకు రంగం సిద్ధం
సెప్టెంబర్‌లో రూ.30 వేల కోట్ల పబ్లిక్ ఇష్యూ

ముంబయి,జులై 6: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తన భారీ ఐపీవోను ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఐపీవో పరిమాణం సుమారు రూ.30వేల కోట్లు ఉండేఛాన్స్ ఉంది. ఈఇష్యూ విజయవంతమైతే,భారత కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా నిలవనుంది. ఈ ఐపీవో ద్వారా ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా చేరే అవకాశముందని అంచనా. ఇప్పటికే ఇష్యూకు సంబంధించిన రోడ్‌షోలను ప్రారంభించేందుకు ఎన్ఎస్ఈ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఐపీవో విజయవంతమైతే, 2024 అక్టోబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా చేపట్టిన రూ.27,870 కోట్ల ఐపీవో రికార్డును అధిగమించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే జరుగుతుంది. ఇందులో మొత్తం 14 కోట్ల 89 లక్షల ఈక్విటీ షేర్లు విక్రయానికి రానుండగా, ప్రస్తుత వాటాదారులు కలిపి సంస్థలోని సుమారు 6 శాతం వాటాను విక్రయించనున్నారు.
ప్రస్తుతం ఎన్ఎస్ఈకి దాదాపు 1.8 లక్షల మంది షేర్‌హోల్డర్లు ఉన్నారు. వాటా విక్రయిస్తున్న ప్రధాన వాటాదారుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యధికంగా 2.48కోట్ల షేర్లు విక్రయించనుండగా,ఎంఎస్ స్ట్రాటజిక్ 1.60 కోట్ల షేర్లు విక్రయించనుంది. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ తదితర సంస్థలు కూడా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి. అయితే ఎన్ఎస్ఈలో 10.72శాతం వాటాతో అతిపెద్ద వాటాదారైన ఎల్ఐసీ ఈ షేర్ విక్రయంలో పాల్గొనబోవడం లేదని స్పష్టం చేసింది.సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) లభించిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఐపీవో ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఐపీవో నిర్వహణ కోసం ఎన్ఎస్ఈ ఇప్పటికే 20 మంది మర్చంట్ బ్యాంకర్లను, న్యాయ సలహాదారులు, ఇతర మధ్యవర్తులను నియమించింది. ఎన్ఎస్ఈ ఐపీవో ప్రకటన అనంతరం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్‌లు కూడా సెబీకి తమ డ్రాఫ్ట్ పత్రాలను సమర్పించింది. జియో ప్లాట్‌ఫామ్‌ల ఐపీవో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్రం వాటాల విక్రయం

కొచ్చిన్,జులై 6: ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం తన వాటాలను విక్రయిస్తోంది. ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా గరిష్ఠంగా5.04 శాతం వాటాను విక్రయించనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.1,400ను ఇష్యూ ధరగా నిర్ణయించారు. తొలి దశలో 2.52 శాతం వాటాను విక్రయించనుండగా పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభిస్తే గ్రీన్‌షూ ఆప్షన్ కింద మరో 2.52 శాతం వాటాను కూడా విక్రయించే అవకాశం ఉందని దీపమ్‌తెలిపింది. ఈఆఫర్‌లో జూలై 7న నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు, జూలై 8న రిటైల్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలో భారీ వాటాల విక్రయానికి కేంద్రం సిద్ధమవుతోందన్న వార్తలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఖండించిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఈ లావాదేవీ ద్వారా కేంద్రానికి రూ.16 వేల కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉందనిఅంచనా.తాజా షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రమోటర్ అయిన కేంద్రానికి 67.91 శాతం వాటా ఉంది.ఎల్ఐసీ సంస్థకు 3.34 శాతం వాటా ఉంది.ప్రభుత్వ రంగ సంస్థల్లో తన వాటాను తగ్గించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం సాధారణంగా ఆఫర్ ఫర్ సేల్ విధానాన్ని అనుసరిస్తుంది. డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పెరుగుతున్న ఆదాయంప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కోల్ ఇండియా,ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా కేంద్రం ఇప్పటికే దాదాపు రూ.14 వేల కోట్లు సమీకరించింది.

మైక్రోసాఫ్ట్‌లో భారీ ఉద్యోగాల కోత
4,800 మందికి ఉద్వాసన

శాన్‌ఫ్రాన్సిస్కో,జులై 6: ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు శ్రీకారంచుట్టింది.సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం,అంటే దాదాపు 4,800 మందిని తొలగించనున్నట్లు ప్రకటించింది. కృత్రిమమేధ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వ్యాపార కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐ వినియోగాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బిగ్ టెక్ కంపెనీలు ఏఐమౌలిక సదుపాయాలపై 700 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయని అంచనా. ఇప్పటికే అమెజాన్, మెటా వంటి సంస్థలు కూడా వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి. 2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్ ధర దాదాపు 23 శాతం పడిపోవడం 2022 తర్వాత కంపెనీకి ఇదే అత్యంత బలహీనమైన తొలి అర్థవార్షిక ప్రదర్శనగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.